
RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక:27 హైదరాబాద్, బుధవారం, 9 జూలై 2025 పేజీలు: 12 వెల: 1.00

## ఢిల్లీలో సీఎం రేవంత్ బిజీ బిజీ..

## కేంద్రమంత్రికి వినతి పత్రం

న్యూఢిల్లీ, జులై 08: న్యూఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ వరుసగా భేటీ అవుతున్నారు. అందులోభాగంగా మంగళవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని ఆయనకు సీఎం వినతి పత్రం అందజేశారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలోని జహీరాబాద్ ఇండస్ట్రీయల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అందులోభాగంగా జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ (ఆమోదించిన రూ. 596. 61 కోట్లను త్వరగా విడుదల చేయాలని కేంద్ర మంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలకు ఆర్థిక సహాయం అందించాలని అడిగారు. హైదరాబాద్ – వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ఈ సందర్భంగా సీఎం రేవంత్ అభ్యర్థించారు. హైదరాబాద్ – బెంగళూరు ఏరో డిఫెన్స్ కారిడార్ మంజూరు చేయాలని కోరారు. అలాగే హైదరాబాద్ – విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫిజిబిలిటీని



అధ్యయనం చేస్తున్నట్లు కేంద్ర మంత్రి దృష్టికి ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు.

ఆదిభట్లలో అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో ప్రత్యేక రక్షణ, ఏరోస్పేస్ పార్కును తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని.. ఈ నేపథ్యంలో హైదరాబాద్ – బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌ను ఏరో–డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తామని.. వాటికి సైతం మోదీ ప్రభుత్వం మద్దతుగా నిలవాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పీయుష్ గోయెల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

## రాష్ట్రపతుల పేర్లు తప్పుగా పలికిన ఖర్గే..

## క్షమాపణకు బీజేపీ డిమాండ్

రాయ్‌పూర్: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యలు మరోసారి రాజకీయ దూమారం రేపాయి. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పబ్లిక్ ర్యాలీలో ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్లను తప్పుగా ఉచ్చరించడం వివాదానికి కారణమైంది. దీనిపై వెంటనే స్పందించిన బీజేపీ.. ఖర్గే క్షమాపణ



చెప్పాలని డిమాండ్ చేసింది.

రాయ్‌పూర్‌లోని సైన్స్ గ్రౌండ్‌లో మంగళవారంనాడు జరిగిన పార్టీ కార్యక్రమంలో ఖర్గే పాల్గొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేరును 'ముర్మ జీ' అంటూ సంబోధించారు. అయితే వెంటనే దానిని సవరించుకుని 'ముర్ము' అని పలికారు. ఆ తర్వాత కొద్ది సేపటికే ఆయన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను 'కోవిడ్'గా సంబోధించడం మరోసారి విమర్శలకు దారితీసింది.

ఛత్తీస్‌గఢ్‌లో పెద్ద సంఖ్యలో చెట్లను కూల్చివేయడంపై ఖర్గే తన ప్రసంగంలో ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ తన ఇండస్ట్రియల్ మిత్రులతో కలిసి గిరిజనుల భూములు లాక్కుంటోందని, సహజ వనరులను ధ్వంసం చేస్తోందని ఆరోపించారు. జల్, జంగిల్, జమీన్‌ను పరిరక్షించుకునేందుకు మనమంతా ఐక్యంగా నిలబడాల్సిన అవసరముందని చెప్పారు. 'వాళ్లు (బీజేపీ) ముర్మ (ద్రౌపది ముర్ము)ను రాష్ట్రపతిగా, (రామ్‌నాథ్) కోవిడ్ (కోవింద్)ను రాష్ట్రపతిగా చేసామని చెప్పుకుంటారు. కానీ ఎందుకు? మన అడవులు, నీళ్లు, భూములను దొంగిలించేందుకు. ఇవాళ వాటిని అదానీ, అంబానీ వంటి వాళ్లు ఆక్రమించుకుంటున్నారు' అని ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు

బహిరంగ క్షమాపణకు బీజేపీ డిమాండ్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌పై ఖర్గే అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం ద్వారా వారిని అవమానించారని బీజేపీ మండిపడింది. తక్షణం ఖర్గే, కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. దీనిపై బీజేపీ జాతీయ ప్రతినిధి గౌరవ్ భాటియా మాట్లాడుతూ, రాష్ట్రపతి, మాజీ రాష్ట్రపతిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం ద్వారా దళిత, ఆదివాసీ, రాజ్యాంగ వ్యతిరేక భావజాలాన్ని కాంగ్రెస్ చాటుకుందని విమర్శించారు. రామ్‌నాథ్ కోవింద్‌ను కోవిడ్ అని, ద్రౌపది ముర్మును ముర్మాజీ అని, ల్యాండ్ మాఫియా అని, ఆస్తులు, అడవులు లాక్కొనేందుకు ఆమె రాష్ట్రపతి అయ్యారనే విధంగా ఖర్గే ఆరోపణలు చేశారని తప్పుపట్టారు. కాంగ్రెస్, ఖర్గే తక్షణం క్షమాపణ చెప్పాలని, లేకుంటే ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి ఉంటుందని అన్నారు. ఖర్గే కాంగ్రెస్ పార్టీ రిమోట్ కంట్రోల్ జాతీయ అధ్యక్షుడని, పార్టీ నేత రాహుల్ గాంధీ తరఫున ఖర్గే ఇలాంటి అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని భాటియా విమర్శించారు.

## తెలంగాణ మీ జాగీరా..

## కేటీఆర్‌పై అద్దంకి దయాకర్ సెటైర్లు

హైదరాబాద్: మాజీమంత్రి కేటీఆర్‌వి చిల్లర ప్రయత్నాలు అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. ఇవాళ(మంగళవారం) ఏబీఎన్‌తో అద్దంకి దయాకర్ మాట్లాడారు.



కేటీఆర్‌ని చూస్తే జాలి వేస్తోందని ఎద్దేవా చేశారు. కేటీఆర్ చర్చించడానికి అసెంబ్లీ ఉందని గుర్తుచేశారు. కేసీఆర్ కంటే రేవంత్‌రెడ్డిది పెద్ద స్థాయి అని ఉద్ఘాటించారు. కేటీఆర్‌కి దమ్ముంటే కేసీఆర్‌ని అసెంబ్లీకి తీసుకురావాలని సవాల్ విసిరారు. తమకి అనుకూలంగా రాస్తే అందరి మీడియా, వ్యతిరేకంగా రాస్తే ఆంధ్రా మీడియానా అని ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతి తెలంగాణ ఉద్యమానికి ఏం చేసిందో కేసీఆర్‌ని అడిగితే తెలుస్తోందని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు.

'తెలంగాణ మీ జాగీరా?. సాగరహారం జరుగుతుంటే ఎక్కడ ఉన్నారు. సాగరహారం జరిగిన రోజుల్లో మీ మొహాలు ఎక్కడున్నాయి. తెలంగాణ ఉద్యమంలో కొట్లాడిన వాళ్లం మేము. సారా అమ్ముతారు జై తెలంగాణ అంటారు. ఫోన్ ట్యాపింగ్ చేస్తారు.. జై తెలంగాణ అంటారు. బీఆర్ఎస్ పేరు పెట్టుకున్నాక తెలంగాణతో మీకు సంబంధం ఏంటి?. నీ చెల్లి కవిత ఫోన్‌ని ట్యాపింగ్ చేసి అణగదొక్కావ్. మీ చెల్లి వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ఉందా?. తెలంగాణ ప్రజలను మోసం చేసిన దొంగలు మీరు. రేవంత్‌రెడ్డితో పోలిక పెట్టుకోవడానికి అర్హతే లేదు మీకు. నమ్మించి మోసం చేయడమే మీ అయ్య సంస్కృతి. ఆంధ్రా తెలంగాణ అంటూ సెంటిమెంట్ రెచ్చగొడుతున్నారు. వాళ్లకి అనుకూలంగా ఉంటే మంచి మీడియానా? లేకపోతే చెడ్డ మీడియానా?. బీఆర్ఎస్ పార్టీని మీ నలుగురు తప్ప.. ఎవరూ సపోర్ట్ చేయడం లేదు. కేసీఆర్‌కి రావడం చేతకాక బచ్చగాడిని పంపుతారా. మాకు సానుభూతి ఉంది కాబట్టే హాస్పిటల్‌కి వెళ్లి కేసీఆర్‌ని పరామర్శిస్తున్నాం. బావ, బామ్మర్దులతో పాటు చెల్లి ఇప్పుడు పోటీలోకి వచ్చింది. అందరూ కలిసినా రేవంత్‌ని ఏం చేయలేకపోయారు. పిచ్చిమాటలు మాట్లాడితే మా తడాఖా చూపిస్తాం. మొన్నటి ఎన్నికల్లో కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ చేయకపోతే కాంగ్రెస్ పార్టీకి 100 సీట్లు వచ్చేవి' అని అద్దంకి దయాకర్ ధీమా వ్యక్తం చేశారు.

## ఎన్నికల వేళ మహిళలకు

## సీఎం భారీ బొనంజా

%పాట్నా: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తరుణంలో మహిళా సాధికారత, ఉద్యోగాల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సంకేతాలిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్ ప్రకటించారు. ప్రభుత్వ



ఉద్యోగాలకు నేరుగా జరిగే అన్ని రిక్రూట్‌మెంట్లలో బీహార్ స్థానికత కలిగిన మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పించనున్నట్టు మంగళవారంనాడు ప్రకటించారు. రాష్ట్ర క్యాబినెట్ ఈ మేరకు ఆమోదం తెలిపింది.

ఎంపిక చేసిన ప్రభుత్వ సర్వీసులలో బీహార్‌లోని మహిళలకు ఇప్పటికే రిజర్వేషన్ ఉండగా, తాజా నిర్ణయం ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖలు, రిక్రూట్‌మెంట్ స్థాయిలలో శాశ్వత నివాసిత మహిళలకు 35 శాతం కోటా వర్తిస్తుంది.

బీహార్ యూత్ కమిషన్ ఏర్పాటుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఉద్యోగావకాశాలు పెంచడం, వొకేషనల్ ట్రైనింగ్, రాష్ట్రంలోని యువతకు సపోర్ట్‌గా నిలబడే లక్ష్యంతో ఈ యూత్ కమిషన్ ఏర్పాటు కానుంది. యువతకు సంబంధించిన విధానాలు, అభివృద్ధి పథకాల్లో అడ్వైజరీగా కమిషన్ వ్యవహరిస్తుందని నితీష్ కుమార్ తెలిపారు. నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ముఖ్యంగా ప్రైవేటు రంగంలో జాబ్ ప్లేస్‌మెంట్‌ను మెరుగుపరచేందుకు వివిధ శాఖలతో కమిషన్ సమన్వయం చేస్తుందని చెప్పారు. ఈ కమిషనల్‌లో ఒక చైర్మన్, ఇద్దరు వైస్ చైర్మన్లు, ఏడుగురు సభ్యులు (45 ఏళ్లలోపు వారు) ఉంటారు.

## బోనాల జాతర శాంతియుతంగా జరిగేలా

## చర్యలు తీసుకోండి: మంత్రి పొన్నం



%హైదరాబాద్: ఆషాఢ మాస బోనాల జాతర ఉత్సవాలు శాంతియుతంగా కొనసాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ అంబర్‌పేట్‌లో బోనాల జాతర ఉత్సవాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. పోలీసు, రెవెన్యూ, దేవాదాయశాఖ, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక, విద్యుత్తు, జలమండలి ఇతర విభాగాల అధికారులు ఒక ప్రణాళికతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అంబర్‌పేట్‌లో నూతనంగా నిర్మించిన ఫ్లై ఓవర్, సర్వీస్ రోడ్లపై ఏర్పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంట నగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున మంత్రులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. దొంగతనాలు, శానిటైజేషన్, మహిళల భద్రత కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటుకు మంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంతరావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, పోలీసు ఉన్నతాధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## 42కోట్లాది కుటుంబాలను దగా చేసిన కాంగ్రెస్

### రేవంత్ కు బెసిక్ నాలెడ్జ్ కుడా లేదు

### ఏ వర్గానికి రేవంత్ రెడ్డి మేలు చేయలేదు కేటీఆర్

హైదరాబాద్‌మంగళవారం నాడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమాజీగూడ ప్రెస్ క్లబ్ లో మీడియాతో మాట్లాడారు. గత 18 నెలల నుంచి తెలంగాణలో సాగుతున్న కాంగ్రెస్ అరాచక పాలన తో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

నోటికొచ్చిన హామీలు, నోటికి వచ్చిన వచ్చిన వాగ్దానాలు, 420 హామీలు, వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు అని డైలాగులు కొట్టి గత 18 నెలలుగా రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులను, కోట్లాది కుటుంబాలను కాంగ్రెస్ దగా చేసిందని ఆరోపించారు.

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల అమలుకు మాది గ్యారంటీ అని బాండ్ పేపర్ మీద రాసి గద్దెనెక్కి 18 నెలల తర్వాత కూడా ఒక్కటంటే ఒక్క హామీని కూడా రేవంత్ రెడ్డి నెరవేర్చలేకపోయాడు. తెల్లారి లేస్తే అరుపులు, గావుకేకలు, బూతులు తప్ప రేవంత్ రెడ్డి చేసింది ఏమీ లేదు. తెలంగాణ రైతాంగానికి, యువతకు ఎవరేం చేశారో తేల్చుకుందాం రమ్మని ముఖ్యమంత్రి విసిరితే స్వీకరించి నేను వచ్చాను. బేసిన్ నాలెడ్జి లేని రేవంత్ రెడ్డికి బేసిక్ నాలెడ్జి లేదని తెలిసినా కూడా ముఖ్యమంత్రి ముచ్చట పడుతున్నాడు కదా అని సవాల్ ను స్వీకరించాను. బేసిన్ నాలెడ్జ్ , బేసిక్ నాలెడ్జ్ లేదు కాబట్టే ఓ 72 గంటల టైం ప్రిపరేషన్ కోసం ఇచ్చి రమ్మన్నాను. ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని చెప్పాను. జులై 8 తారీఖున 11 గంటలకు మేమే ప్రెస్ క్లబ్ కు వస్తాము, మీడియా సాక్షిగా, ప్రజల సాక్షిగా చర్చిద్దామంటే ఇవాళ రేవంత్ రాకుండా ఢిల్లీకి పోయిండు. ఒకవేళ ముఖ్యమంత్రి రాలేకపోతే ఆయన తరపున బాధ్యత గల ఉప ముఖ్యమంత్రి గాని, వ్యవసాయ మంత్రి గానీ, లేదంటే ఇంకెవరైనా మంత్రులను పంపుతారని అనుకున్నానని అన్నారు.

కానీ రేవంత్ రెడ్డికి రచ్చ చేయడమే వచ్చు కాని చర్చ చేయడం రాదని ఇవాళ తేలిపోయింది. రేవంత్ రెడ్డికి బూతులు మాట్లాడడం వస్తుంది కానీ రైతుల గురించి మాట్లాడడం రాదని స్పష్టంగా తెలిసిపోయింది. రేవంత్ రెడ్డికి బేసిన్ ల గురించి కూడా బేసిక్ నాలెడ్జ్ లేదు. ఏ ప్రాజెక్టు బేసిన్లో ఉంది అని ఇరిగేషన్ అధికారులను ఒక చిన్న పిల్లాడు అడిగినట్లు అడుగుతుంటే ఇతనా మనకు న్యాయం చేసేదని రాష్ట్రంలోని రైతులు బాధపడుతున్నారు.

భారత శక్తి
VOICE OF INDIAN

## బీజేపీ టార్గెట్ సౌత్

రానున్న అసెంబ్లీ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ సన్నద్ధమవుతున్నది. పార్టీ జాతీయ అధ్యక్షుని ఎన్నికకు ఇంకా సమ యం పట్టవచ్చు. ఆ ఎన్నికలో జరుగుతున్న జాప్యం అటుంచితే, ఇటీవలే ఆరు రాష్ట్రాలకు పార్టీ కొత్త అధ్యక్షులను నియమించింది. కనుక ఎన్నికల ప్రక్రియలో భాగంగా జేపీ నడ్డా వారసుని ఎంపిక కొద్ది వారా ల్లో ము గియవచ్చు. నిజానికి పొడిగించిన ఆయన పదవీకాలం కూడా ముగిసి నెలలైంది.పార్టీ నియమావళి ప్రకారం దేశంలోని సగం రాష్ట్రా ల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయితే గానీ, జాతీయ అధ్యక్షుని ఎన్నికకు మార్గం సుగమం కాదు. ఇప్పుడు ఆరు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులను నియమించుకోవడంతో ఇక జాతీయ అధ్యక్షుని ఎన్నిక ఒక్కటే మిగిలివుంది. రాష్ట్రాల చీఫ్‌లు నాయకులను ఎంపిక చేయడంలో వారికి సం స్థాగతంగా ఉన్న అనుభవాన్ని అధిష్ఠానం పరిగణలోకి తీసుకున్నట్టు స్పష్టమైంది.నడ్డాకు వారసుణ్ణి ఎంపిక చేయడంలో పార్టీకి, ఆర్ఎస్ఎస్‌కు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడమే ఆలస్యానికి కారణమనే ఊహాగానాలు వినిపించాయి. సంఘ్ పరివార్‌తో ఏకాభిప్రాయం కుదిరిన వెంటనే జాతీయ కమల దళపతి పేరు ప్రకటించే అవకాశం ఉంది. బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళ, పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీలకు కొద్ది నెలల్లో ఎన్నికలు జరుగనున్నాయి. కీలకమైన ఈ రాష్ట్రాల్లో బీజేపీకి విజయం అందించడం పార్టీ కొత్త అధ్యక్షుడికి సవాల్ కానున్నదిదక్షిణాన తమిళనాడు, తెలంగాణపై దృష్టి నిలిపిన బీజేపీ తన వ్యూ హాల అస్త్రాలను ఇప్పటికే బయటకు తీసింది. తమిళనాడులో అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకున్న బీజేపీ, కొత్త పార్టీతో ముందుకెళ్తున్న తమిళ పాపులర్ నటుడు విజయ్‌పై కన్నేసింది. అయితే, బీజేపీతోగానీ, డీఎంకేతో గానీ తమిళ వెట్రి కళగం (టీవీకే) పొత్తుపెట్టుకునే ప్రసక్తే లేదని, వచ్చే ఏడాది రాష్ట్ర అసెంబ్లీకి జరుగనున్న ఎన్నికల్లో తనే ముఖ్యమంత్రి అభ్యర్థినని విజయ్ ప్రకటించుకున్నారు.పార్టీ కార్యనిర్వాహక కమిటీ ఈమేరకు తీర్మానం కూడా ఆమోదించింది. ఈ పరిస్థితుల్లో అధికార డీఎంకేను ఎదుర్కోవడంలో అన్నా డీఎంకేతో కలిసి బీజేపీ ఎలాంటి వ్యూహం అనుసరిస్తుం దనేది చూడాలి. మరోవైపు, బలవంతంగానే అన్నా డీఎంకేను బీజేపీ పొ త్తుకు ఒప్పించిందన్న ఊహాగానాల మధ్య, ఇదీ నిజమేనన్న తీరులో పళనిస్వామి మాటలు వినిపిస్తున్నాయి. బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నా, సీట్ల పంపకం మొదలు ఏ విషయంలోనైనా అన్నాడీఎంకే పెద్దన్న పాత్రలో ఉంటుందని పళినిస్వామి చెపుతున్నారు.దక్షిణాది రాష్ట్రాల్లో, ముఖ్యంగా మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకల్లో హిందీ భాష పట్ల వ్యక్తమవుతున్న వ్యతిరేకత తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపనున్నది. ఈ పరిస్థితి దృష్టిలో పెట్టుకుని బీజేపీని పూర్తిగా తలెత్తుకోవడం అన్నాడీఎంకేకు ఇబ్బందిగా వుంది. తమిళనాడు అసెంబ్లీ సీట్ల పంపకం చెరి సగంగా ఉండాలని కేంద్ర మంత్రి అమిత్‌షా ఇప్పటికే పళనిస్వామికి ఖరాఖండికి చెప్పినట్టు వార్తలు వచ్చాయి. ఇక తెలంగాణలో గత అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలనే సాధించిన బీజేపీ, కొత్త అధ్యక్షుడు రాంచందర్‌రావు నాయకత్వంలో అధికార పీఠం చేజిక్కించుకునే వైపునకు కదులుతున్నది.రానున్న ఏడాది కాలంలో బిహార్, అస్సాం, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ ఎన్నికలు జరుగనున్నాయి. వీటిలో మెజారిటీ రాష్ట్రాల్లో గెలవడం బీజేపీకి ఒక అగ్నిపరీక్ష లాంటిది. ముఖ్యంగా దక్షిణాదిన బీజేపీ విస్తరించడం అంత సులభం కాదుఅయితే కేవలం సంఘ్ అండదండలు ఉన్నంత మాత్రాన బీజేపీ విజయాలు సాధించగలుగుతుందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. నిజానికి సంఘ్ బలంగా ఉండడం వేరు, బీజేపీ బలంగా ఉండడం వేరు అన్న విషయం రెండు సంస్థలకూ తెలియనిది కాదు సంఘ్ అత్యంత బలంగా ఉన్న కర్ణాటకను ఒకప్పుడు బీజేపీ దక్షిణాది ద్వారంగా ఆ పార్టీ నేతలు అభివర్ణించారు. కాని క్రమంగా ఆ ద్వారం మూసుకుపోతున్నట్లు కనపడుతోంది. దేశమంతటా హిందూత్వ ప్రయోగం విజయవంతం అవుతున్నట్లు కనపడుతున్నప్పటికీ కర్ణాటకలో మాత్రం ఈ ప్రయోగం లింగాయత్‌ల అదుపులో ఉన్నట్లు స్పష్టమవుతోంది. అక్కడ పార్టీలో ఉన్న అంతర్గత పోరాటాన్ని అధిష్ఠానం అరికట్టలేకపోతోంది. నేతలు ఒకరిపై మరొకరు మీడియాకెక్కుతున్నారు. యడ్యూరప్పను, ఆయన కుమారుడు విజయేంద్రను మచ్చిక చేసుకునేందుకు ఇటీవల బలమైన ఎమ్మెల్యేను బసనగౌడ పాటిల్ యత్నాల్‌ను పార్టీ నుంచే బహిష్కరించారు. బీజేపీకి కర్ణాటకలో భవిష్యత్ లేదని త్వరలో ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని యత్నాల్ ప్రకటించారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను అప్రతిష్ఠపాలు చేసేందుకు ముడా కుంభకోణాన్ని లేవనెత్తి, ఈడీని ప్రయోగించినా బీజేపీ విజయవంతం కాలేకపోయింది. విచిత్రమేమంటే సంఘ్ హేమాహేమీలు దత్తాత్రేయ హోసబలె, సిఆర్ ముకుంద్, ప్రస్తుతం జాతీయ స్థాయిలో సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా ఉన్న సంతోష్, హెచ్‌వి శేషాద్రి, పద్మనాభాచార్య తదితరులు ఆ రాష్ట్రానికి చెందినవారే. ఒకప్పటి సర్ సంఘ్ చాలక్ సుదర్శన్ కూడా మైసూరుకు చెందినవారే. నిజానికి మహారాష్ట్ర తర్వాత అత్యధిక సంఖ్యలో అగ్రశ్రేణి సంఘ్ నేతలు కర్ణాటక నుంచే వచ్చారు. కాని అదే కర్ణాటకలో ఇప్పుడు బీజేపీ రాజకీయ భవిష్యత్తు డోలాయమాన పరిస్థితిలో ఉన్నది. సంతోష్ జీ వల్లే దక్షిణాదిలో బీజేపీ దెబ్బతిన్నదని విమర్శలు చేసేవారు కూడా ఉన్నారు. తమిళనాడులో ఐపీఎస్ అధికారి అన్నామలైను ప్రవేశపెట్టి ఓట్ బ్యాంకును పెంచుకునేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో మళ్లీ అన్నాడీఎంకెపై ఆధారపడవలసిన స్థితి ఏర్పడింది. కేరళలో కూడా ఆర్ఎస్ఎస్ బలంగా ఉన్నా బీజేపీ కొంత ఓటు శాతాన్ని పెంచుకోవడం తప్ప అసాధారణమైన విజయాలేమీ సాధించలేదు.ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే నెల్లూరులో ఆర్ఎస్ఎస్ తొలి శాఖ 1947లోనే ఏర్పడింది. 1948లో విజయవాడలో ఆర్ఎస్ఎస్ అతి పెద్ద సభను నిర్వహించింది. 1950లలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన తొలి ఓటీసీ నెల్లూరులో జరిగింది.

# ఏఐతో దోమలకు చెక్...

ఒంగోలు, జూలై ,



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దోమల బెడదను నివారించడానికి సరికొత్త ప్రణాళికను సిద్ధం చేసింది. కృత్రిమ మేధస్సు ఆధారిత స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్‌ను విజయవాడ, విశాఖ, కర్నూలు, నెల్లూరు, కాకినాడ, రాజమండ్రి నగరాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఈ వ్యవస్థ ద్వారా దోమల ఉత్పత్తి ప్రాంతాలను గుర్తించి డ్రోన్ల ద్వారా రసాయనాలు పిచికారీ చేసి దోమలను నియంత్రిస్తారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాలనలో సాంకేతికతకు పెద్ద పీట వేస్తున్న సంగతి తెలిసిందే. పాలనలో సాంకేతికత వినియోగం ద్వారా ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించాలనే ఉద్దేశంతో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలు తీసుకువచ్చింది. అలాగే పురపాలికల్లో సమస్యలను ప్రజలు నేరుగా ప్రభుత్వానికి తెలియజేసేలా పురమిత్ర పేరుతో యాప్ కూడా తీసుకువచ్చారు. ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ఏపీ ప్రభుత్వం.. ఇప్పుడు ఏఐ సాయంతో దోమలకు చెక్ పట్టాలని ప్లాన్ చేస్తోంది. మోడ్రన్ టెక్నాలజీ వాడి దోమలను నియంత్రించాలనేది ఏపీ ప్రభుత్వం ఆలోచన. ఈ క్రమంలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో పనిచేసే స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ అమలు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ తొలుత ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాంతాలలో అమలు చేయానున్నారు. విజయవాడ, విశాఖ, కర్నూలు, నెల్లూరు, కాకినాడ, రాజమండ్రి వంటి ప్రాంతాల్లో ఈ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ అమలు చేస్తారు. ఇక్కడ వచ్చే ఫలితాలను అనుసరించి.. తర్వాత దశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు. ఈ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ ఓ ప్రైవేట్ సంస్థ రూపొందించింది. ఈ విధానంలో భాగంగా.. దోమల ఉత్పత్తి ఎక్కువగా ఉండే 66 ప్రాంతాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో పనిచేసే సెన్సార్లు ఏర్పాటు చేస్తారు. ఈ సెన్సార్లు.. ఆ ప్రాంతంలో దోమల సాంద్రత, అలాగే ఉష్ణోగ్రత వంటి వివరాలను సేకరించి.. సెంట్రల్ సర్వర్‌కు సమాచారం పంపుతుంది.ఈ సమాచారం ఆధారంగా ఆయా ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో దోమల నియంత్రణ కోసం రసాయనాలు పిచికారీ చేస్తారు. స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ ద్వారా సమయం ఆదా కావటంతో పాటుగా ఖర్చు కూడా కలిసి వస్తుందని.. అధికారులు చెప్తున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద చేపడుతున్న ప్రాంతాల్లో స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ మంచి ఫలితాలను ఇస్తే.. రాష్ట్రంలోని మిగతా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో దీనిని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. దోమల నియంత్రణ ద్వారా వ్యాధులను అరికట్టాలని.. ప్రజారోగ్యం కాపాడాలనేది ప్రభుత్వం ఆలోచన. ఆ రకంగా టెక్నాలజీ సాయంతో దోమలను నియంత్రించాలని ఏపీ ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

# శ్రావణ మాసంలో 3 లక్షల ఇళ్ల గృహప్రవేశం

విజయవాడ, జూలై ,8

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేదలకు గుడ్ న్యూస్ చెప్పింది. శ్రావణ మాసంలో పేదలకు ఇళ్లు కేటాయించాలని నిర్ణయించింది. ఈ నెలాఖరు నుంచి వచ్చే నెల మొదటి వారం వరకూ దాదాపు మూడు లక్షల ఇళ్లను లబ్దిదారులకు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. శ్రావణమాసంలో పేదల ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని సిద్ధమయింది. ఇప్పటికే పనులు పూర్తి చేయడం కోసం లబ్దిదారులకు మూడు వందల కోట్ల రూపాయలను విడుదల చేసి ప్రభుత్వం అధికారులను కూడా ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్ మూడు లక్షల ఇళ్లను... కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తి కావస్తుండటంతో పేదలకు మూడు లక్షల ఇళ్లను అప్పగించి వారిని ఇంటి యజమానులుగా చేయాలన్న లక్ష్యంతో ఈ మెగా ఈవెంట్ కు శ్రీకారం చుట్టింది. ఈ సామూహిక పేదల ఇళ్ల గృహప్రవేశాలను శ్రావణమాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తిచేస్తున్నారు. మిగిలిపోయిన పనులను వీలయినంత త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అధికారులకు అందాయి.. గత ఏడాది కాలంలో దాదాపు 2.30 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. చిన్న చిన్న పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇక రూఫ్ స్థాయిలో దాదాపు ఎనభై ఏడు వేల ఇళ్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. లింటెల్ స్థాయిలో 1.2 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉండగా, పునాది వేసిన ఇళు యాభై వేల వరకూఉన్నాయి. దీంతో వీటిని పూర్తి చేయడానికి అధికారుల సిద్ధమయ్యారు. ఇసుక కూడా సిద్ధంగా ఉంచడంతో వేగంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు నిర్విరామంగా పనిచేస్తున్నారు.లబ్దిదారులకు సాయం... మంజూరయిన ప్రతి ఇంటికి కేంద్ర ప్రభుత్వం లక్షన్నర రూపాయలు చెల్లిస్తుంది. గ్రామీణ ప్రాంతంలో ఉపాధి హామీ పథకం కింద మరో ముప్పయి వేలు అదనంగా ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం దీనికి అదనంగా వెయ్యి రూపాయలుచెల్లిస్తుంది. రూరల్, అర్బన్ ఏరియాల్లోని ఎస్సీ లబ్దిదారులకు , బీసీలకు యాభై వేల రూపాయలు చొప్పున, ఎస్టీలకు 75 వేల రూపాయలు, ఆదివాసీ గిరిజనులకు లక్ష రూపాయలు అదనంగా సాయం అందిస్తుంది. వేగంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి శ్రావణమాసంలో మూడు లక్షల ఇళ్లను ఒకేసారి ప్రారంభించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు.

# అడ్డగోలుగా వయాగ్రా...

కాకినాడ, జూలై 8, (

గోదావరి జిల్లాల్లో వయాగ్రా, అబార్షన్ టాబ్లెట్ల అడ్డగోలు అమ్మకాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు డ్రగ్ కంట్రోల్ అధికారులు. మెడికల్ షాపుల్లో సోదాలు చేసి పాత రికార్డ్స్ కూడా పరిశీలిస్తున్నారు. తనిఖీల్లో అనేక షాకింగ్ విషయాలు బైటికొస్తున్నాయి.అబార్షన్ ట్యాబ్లెట్స్ అమ్మకాలు పెంచడానికి సేల్స్‌మెన్‌కు టార్గెట్లు పెట్టి మరీ దందాకు పాల్పడుతున్నారు అక్రమార్కులు. ఫార్మా కంపెనీల్లో పనిచేసి మానేసినవాళ్లేమెడికల్ రిప్రజెంటేటివ్స్ ద్వారా వయాగ్రా సేల్స్‌కి తెగిస్తున్నట్టు తేలింది. టార్గెట్ పూర్తి చేయాలన్న ఒత్తిళ్లు భరించలేక బ్లాక్‌లో మందులు అమ్ముతున్నారు. అబార్షన్ కిట్లు, వయగ్రా టాబ్లెట్లు అడిగిందే తడవుగా అమ్మిన దుకాణదారులపై చర్యలు తప్పవంటున్నారు అధికారులు.వయాగ్రా? అది షెడ్యూల్డ్ ఊ కేటగిరీకి చెందిన మెడిసిన్ అనీ, ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మనేకూడదని తెలిసినా.. షాపుల్లో మాత్రం అంతా విచ్చలవిడితనమే. కౌంటర్లో చెయ్యి పెట్టి అడిగితే చాలు.. స్టాకు లేకపోయినా తెప్పించి మరీ ఇస్తారు. వయాగ్రా మందులు ఆఫ్‌లైన్లోనే కాదు ఆన్‌లైన్‌లో కూడా విచ్చలవిడిగా అమ్మకమౌతున్నాయి. అక్కడైతే అధికారుల తనిఖీలుండవు, అమ్మే వాళ్లకు కొనేవారు ఎవరో కూడా తెలీదు .. కొన్నవాళ్ళు వాటిని వాడి ఏమైపోతారన్న కనీస స్పృహ కూడా ఉండదు. కొన్ని ప్రతికూల ఎంజైముల్ని నియంత్రించి, రక్తప్రసరణ పెరగడం కోసమే తయారయ్యే మెడిసిన్ వయాగ్రా. ఒక్కో వయసు వారికి ఒక్కో రీతిలో ఉండే బ్లడ్ ఫ్లోను వయాగ్రాతో సమతుల్యం చెయ్యొచ్చు కానీ.. అవగాహన లేకుండా మోతాదుకు మించి వాడితే.. తాత్కాలిక తృప్తి సంగతి అటుంచితే తలనొప్పి, జీర్ణకోశసమస్యలు, గుండెపోటు లాంటి తీవ్ర సమస్యలు పక్కా.వయాగ్రా.. ఎంత బెటర్‌మెంట్ ఇస్తుందని ఆశపడతారో.. అంతకంటే ఎక్కువ సైడ్ ఎఫెక్ట్స్ బాధపెడతాయ్. హార్ట్ ఎటాక్స్‌కి దారితియ్యొచ్చు? కిడ్నీలపై చెడుప్రభావం చూపనూవచ్చు. దాంతో ప్రమాదం ఉంది కనుకనే అమ్మకాలపై నియంత్రణ పెట్టారు. దాన్ని మీరి.. విచ్చలవిడిగా విక్రయించడం మొదలైతే?దాన్ని వాడేవాళ్ల మెంటల్ స్టేటస్‌ను ఎవరూ కంట్రోల్ చెయ్యలేరు. ఇదే ముఠా ఇంకాస్త విజృంభించి సిటీల్లోకి పాకితే పరిస్థితి మరీ దారుణంగా మారుతుంది కనుక.. ఉక్కుపాదం మోపుతోంది డ్రగ్ కంట్రోల్ విభాగం.

# ఆనం వర్సెస్ నారాయణ

నెల్లూరు, జూలై 8,

నెల్లూరులో ఇద్దరు మంత్రుల మధ్య పొసగడం లేదని తాజాగా బయటపడింది. నెల్లూరులో వీఆర్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యా మంత్రి లోకేష్ పాల్గొన్నారు. మంత్రులు నారాయణతో పాటు ఆనం రామనారాయణరెడ్డి కూడా పాల్గొన్నారు. అందరూ స్కూల్ ఓపెనింగ్ గురించి మాట్లాడారు. అయితే మంత్రి ఆనం మాత్రం అనూహ్యంగా స్కూల్ కు మున్సిపల్ కార్పొరేషన్ పేరు పెట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆనం రామనారాయణ రెడ్డి వీఆర్ హైస్కూల్‌ను మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌గా మార్చడంపై వేదికపై అభ్యంతరం వ్యక్తం చేశారని, స్కూల్ అభివృద్ధికి మున్సిపల్ మంత్రి సహకరిస్తే అది మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ ఎలా అవుతుందని ప్రశ్నించారని తెలుస్తోంది. చాలా మంది కాంట్రాక్టర్లు తమ సీఎస్ఆర్ ఫండ్స్ ఇస్తే స్కూల్ రీఓపెన్ అయిందన్నారు. మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి , పొంగూరు నారాయణ మధ్య స్కూల్ విషయంలో వివాదాలు ఉన్నట్లుగా ఈ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ పేరు వివాదంపై మంత్రి నారాయణ ఎలాంటి కామెంట్లు చేయలేదు. నెల్లూరులోని వీఆర్ హైస్కూల్ అసలు పేరు వెంకటగిరి రాజా హైస్కూల్. 2021లో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో మూతపడింది. గత ప్రభుత్వ హయాంలో స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది, దీని వల్ల నిర్వహణ కష్టమైంది. స్కూల్ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం, తగిన నిర్వహణ మరియు ఆధునీకరణ లేకపోవడం కూడా మూతకు కారణమైంది. ఎయిడెడ్ సంస్థల ఆస్తులపై దృష్టి పెట్టి స్కూల్‌ను మూసివేసేలా చేసిందని విమర్శలు ఉన్నాయి. 2025లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, ముఖ్యంగా మంత్రి పొంగూరు నారాయణ , నారా లోకేష్ ఆధ్వర్యంలో, రూ. 15 కోట్ల నిధులతో స్కూల్‌ను ఆధునీకరించి, అంతర్జాతీయ ప్రమాణాలతో జూలై 7, 2025న తిరిగి ప్రారంభించారు. ఎన్‌సీసీ కంపెనీ సీఎస్ఆర్ ఫండ్స్ ఇచ్చింది. మంత్రివర్గంలో నెల్లూరు జిల్లాకు ఇద్దరు మంత్రులు ఉన్నారు. ఒకరు పొంగూరు నారాయణ కాగా..మరొకరు సీనియర్ నేత ఆనం రామనారాయణరెడ్డి. ఆనం దేవాదాయశాఖను చూస్తున్నారు. పొంగూరు నారాయణ మున్సిపల్ మంత్రిగా ఉన్నారు. ఆయనే మున్సిపల్ కార్పొరేషన్ పేరును పెట్టించారని ఆనం భావిస్తున్నారు. గతంలో వీఆర్ స్కూల్ తమ




నిర్వహణలో ఉండేదని.. తమపై కోపం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ద్వారా నిర్వీర్యం చేసి మూసేయించారని అన్నారు. అయితే మున్సిపల్ పేరు పెట్టకుండా.. ఎవరు పేరు పెట్టాలి.. ఆనం కుటుంబీకుల పేరు పెట్టాలా లేకపోతే.. సీఎస్ఆర్ ఫండ్స్ ఇచ్చిన కంపెనీ పేరు పెట్టాలా అన్నదాన్ని మాత్రం.. ఆనం చెప్పలేదు. ఈ వ్యవహారంతో నెల్లూరు జిల్లాలోని మంత్రుల మధ్య పొసగడం లేదని అర్థం అవుతుందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి

## పెన్షన్ లైన్ లో దొంగతనం

ఏలూరు

ఏలూరు పట్టణంలో దొంగలు స్వైర విహారం చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఏలూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెన్షన్ లైన్ లో నివాసం ఉంటున్న మాజీ మంత్రి, ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు వ్యక్తిగత సహాయకుడు సమర్పణరావు ఇంటిలో దొంగతనం చెయ్యడానికి ఒక అగంతకుడు విశ్వప్రయత్నం చేశాడు.తెల్లవారు జామున 4:00 గంటలకు గోడ దూకి ఇంట్లోకి దూరి తలుపులు తియ్యడానికి విశ్వప్రయత్నం చేశాడు అనంతరం 2 వ ఫ్లోర్ కు చేరి అక్కడ డోర్ తీయడానికి ప్రయత్నించి విఫలమై అందుబాటులో ఉన్న విలువైన బూట్లు దొంగిలించాడు. ఈ సంఘటనతో కుటుంబసభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు.స్థానికంగా యువకులు గంజాయి మత్తులో ఇలాంటి పనులకు పాల్పడుతున్నారని ఈ పని చేసిందికూడా స్థానికుడే అని పలువురు తెలియజేశారు.

## వైఎస్సార్ కు జగన్ నివాళి

కడప

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి సందర్భంగా వైఎస్సార్ తనయుడు, వైఎస్సార్సీపీ అధినేత జగన్మోహన్రెడ్డి ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. ఆయనతో పాటు తన తల్లి విజయమ్మ నివాళి ఘటించారు. ఈ జయంతి కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, వైఎస్సార్సీపీ నేతలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## వైఎస్సార్ కు నివాళులర్పించిన వైఎస్ షర్మిలా

కడప

మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ 76 వ జయంతి సందర్భంగా ఇడుపుల పాయ ఘాట్ వద్ద ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఘన నివాళులు అర్పించారు.

షర్మిలా మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ మెమోరియల్ హైదరాబాద్ లో సైతం ఉండాలి. ఏఐసిసి అగ్రనేత సోనియా గాంధీ,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖల ద్వారా విజ్ఞప్తి చేశా. రేవంత్ రెడ్డి, వైఎస్సార్ మెమోరియల్ ఏర్పాటుపై చొరవ చూపాలని కోరుతున్నానని అన్నారు.

వైఎస్సార్ ఉమ్మడి . రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా రెండు సార్లు పని చేశారు. రాష్ట్రంలో నే కాదు దేశంలోనే అధికారంలో కాంగ్రెస్ అధికారంలో రావడంలో వైఎస్సార్ కీలకం. పరిపాలన, పథకాలతో కోట్ల మందిని తాకారు. ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్, జలయజ్ఞం లాంటి పథకాలు అయన మార్క్. వైఎస్సార్ చనిపోతే ఆయన వెనకాలే 700 మంది ప్రాణాలు వదిలారు. వైఎస్సార్ జయంతులకు,వర్ధంతులకు నివాళులు అర్పించేందుకు మెమోరియల్ ఉండాలి. రేవంత్ అన్న సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నానని అన్నారు.

## తమిళనాడులో స్కూల్ వ్యాన్‌ను ఢీకొట్టిన రైలు.. ఇద్దరు విద్యార్థుల మృతి. కడలూరుసమీపంలో ఘోర రైలు ప్రమాదం

చెన్నై

తమిళనాడులోని కడలూర్ సమీపంలో ఈ ఉదయం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సెమ్మన్కుప్పం రైల్వే క్రాసింగ్ వద్ద పాఠశాల విద్యార్థులతో వెళుతున్న వ్యాన్ను రైలు బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర దుర్ఘటనలో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

విద్యార్థులతో కూడిన స్కూల్ వ్యాన్ సెమ్మన్కుప్పం వద్ద రైల్వే ట్రాక్ను దాటుతోంది. అదే సమయంలో వేగంగా వస్తున్న రైలు వ్యాన్ను ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు వ్యాన్ నుజ్జునుజ్జయింది. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఆర్తనాదాలు మిన్నంటాయి.

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన విద్యార్థులను హుటాహుటిన కడలూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు

## ఇంద్రకీలాద్రిపై శాకాంబరీ ఉత్సవాలు ప్రారంభం

బెజవాడ ఇంద్రకీలాద్రిపై శాకంబరి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దుర్గమ్మను పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. 50 టన్నుల కూరగాయలు వినియోగించారు. శాకంబరి ఉత్సవాలు జూలై 10తో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రత్యేక దర్శనాలు రద్దు చేశారు.

## ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై దాడితో మాకు సంబంధం లేదు: టీడీపీ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై జరిగిన దాడి ఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని ప్రస్తుత ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. దాడులు చేసే సంస్కృతి తమది కాదని, ప్రసన్నకుమార్ రెడ్డి వల్ల గతంలో ఎంతోమంది తీవ్రమైన బాధలు అనుభవించారని, వారిలో ఎవరో ఈ దాడికి పాల్పడి ఉండవచ్చని ఆమె వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై తనపై వస్తున్న ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు.

ప్రసన్నకుమార్ రెడ్డి తనపై వ్యక్తిగతంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను వైసీపీ నేతలు తమ ఇంట్లోని మహిళలకు చూపించగలరా అని ఆమె ప్రశ్నించారు. ఒక మాజీ ఎమ్మెల్యే అయి ఉండి మహిళపై అలాంటి వ్యాఖ్యలు చేయడం దారుణమని, ఈ విషయాన్ని వైసీపీ అధినేత జగన్ తీవ్రంగా పరిగణించి ఆయనపై చర్యలు తీసుకోవాలని ప్రశాంతి రెడ్డి డిమాండ్ చేశారు.

## సింహాచలంలో మంత్రి అనిత ప్రత్యేక పూజలు

విశాఖపట్నం

సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి వారిని హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం దర్శించుకున్నారు. ఆమెకు అధికారులు ఆలయ మర్యాదలతో హోం మంత్రికి ఘన స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం స్వామివారి దర్శనం అనంతరం పండితులు వేద ఆశీర్వచనం చేసారు. మంత్రి అనితకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేసారు. గిరిప్రదక్షిణ నేపథ్యంలో మంత్రి ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేసారు.

మంత్రి మాట్లాడుతూ గిరి ప్రదక్షిణను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పటిష్ట ఏర్పాట్లు చేశాం. టోల్ ఫ్రీ నెంబర్లు అందుబాటులోకి తీసుకువచ్చాం. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణ సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నామని అన్నారు.

## అంగరంగ వైభముగా స్వామి వారి నిత్య కల్యాణం

సింహాచలం

ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

## ప్రెస్ క్లబ్ దగ్గర పోలీసుల మోహరింపు

హైదరాబాద్‌తెలంగాణలో రాజకీయ వేడి మరింత పెరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగంపై ఎవరు ఏం చేశారనే అంశంపై ఓపెన్ డిబేట్ కు సవాల్ విసరగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ సవాల్ను స్వీకరించారు. సీఎం ఎక్కడైనా వేదికను సూచిస్తే తాను చర్చకు సిద్ధమని స్పష్టంగా ప్రకటించిన కేటీఆర్, ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ వద్ద తాను సిద్ధంగా ఉంటానని ప్రకటించారు.మరోవైపు కాంగ్రెస్ నేతలు కూడా ప్రెస్ క్లబ్కు రావచ్చన్న వార్తలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. విపరీతంగా అభిమానులు, పార్టీ కార్యకర్తలు అక్కడికి చేరే అవకాశా న్ని పరిగణనలోకి తీసుకుని, పోలీస్ శాఖ భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. కేటీఆర్ ముందుగా చెప్పిన ట్టు చింతమడక, కొడంగల్, గజ్వేల్ వంటి ప్రాంతాల్లో ఎక్కడైనా చర్చ జరపడానికి తాను సిద్ధమని ప్రకటించినప్పటికీ, సోమాజిగూడ ప్రెస్ క్లబ్ను వేదికగా ఎంపిక చేశారు. రాజకీయ చర్చ పేరుతో మొదలైన ఈ పరిణామం, పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారి తీసే సూచనలు కనిపిస్తున్నాయి.

## అయిల్ ట్యాంకర్ ఢీకొని మహిళ మృతి

కాకినాడ కాకినాడ తాళ్లరే వు బైపాస్ రోడ్డులో పటవల సెంటర్ సమీపంలో ఆయిల్ ట్యాంకర్ బైక్ పై వెళుతున్న ఓ జంటను ఢీ కొట్టింది. ఈ ప్రమాద ఘటనలో కాజులూరు మండలం కోలంక గ్రామానికి చెందిన 40 ఏళ్ల మహిళ స్పాట్లో మృతి చెందింది. కేసు కోరంగి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పూర్తి సమాచారం ఇంకా రావాల్సి ఉంది

# జనవరి నుంచి మరో 62 అన్న క్యాంటిన్లు

కాకినాడ, జూలై 8,

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ప్రారంభించిన అన్న క్యాంటీన్‌లపై ప్రజల్లో పాజిటివ్ రెస్పాన్స్ ఉంది. అందుకే దీన్ని ప్రతి అసెంబ్లీ నియోజవర్గంలో ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇప్పటికే దాదాపు 113 నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్లు ఉన్నాయి. ఇప్పుడు మిగతా 62 నియోజకవర్గాల్లో క్యాంటీన్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే జనవరి నాటికి ప్రతి నియోజకవర్గంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం బిల్డింగ్‌లు నిర్మిస్తుంది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో ప్రక్రియ కూడా ప్రారంభించేశారు. ఈ భవనాలను డిసెంబర్‌కు పూర్తి చేసి జనవరిలో అన్న క్యాంటీన్లు ప్రారంభించాలని చూస్తున్నారు. ఈ మేరకు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రూ.61 లక్షలతో ఒక్కో భవనం నిర్మిస్తున్నారు. అంటే ఇప్పుడు కొత్తగా నిర్మించే భవనాలకు ప్రభుత్వం రూ.41.70 కోట్లు ఖర్చు చేస్తుంది. పేదలి ఆకలి తీర్చేందుకు ఈ అన్న క్యాంటీన్ కాన్సెప్ట్ తీసుకొచ్చారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 205 అన్న క్యాంటీన్‌లు ఉన్నాయి. వాటిలో 1,84,500 మంది ఫుడ్ తీంటున్నారు. దీనిపై ప్రభుత్వం నెలకు రూ.11 కోట్లు ఖర్చు చేస్తోంది. అంటే ఏడాదికి రూ.132 కోట్లు వెచ్చిస్తోంది. అన్న క్యాంటీన్‌లలో ఐదు రూపాయలకే అన్నం పెట్టడంతో ఈ క్యాంటీన్లు ప్రజాదరణ పొందాయి. ఉదయం టిఫిన్ మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం కూడా పెడుతున్నారు. ఇలా ఫుడ్ పెట్టేందుకు టిఫిన్‌పై



17 రూపాయలు, మధ్యాహ్నం, రాత్రి భోజనంపై చెరో 29 రూపాయలు ఖర్చు చేస్తోంది. మొత్తంగా ఒక వ్యక్తి అన్న క్యాంటీన్‌లో మూడు పూటల భోజనం చేస్తే ఆ వ్యక్తిపై 75రూపాయలు ఖర్చు పెడుతున్నందన్నమాట. క్వాలిటీ ఫుడ్ ఐదు రూపాయలకే పెడుతుండటంతో నియోజక వర్గస్థాయిలో పెడితే మంచిందనే ఆలోచన ప్రజల్లో వచ్చింది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చంద్రబాబు 70 అన్న క్యాంటీన్‌లు ఏర్పాటుకు ఓకే చెప్పారు. ఇప్పుడు ఉన్నవి ఎక్కువ పట్టణ, నగర ప్రాంతాలకే పరిమితం అయ్యాయి. అందుకే ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో క్యాంటీన్ ఉండేలా సర్దుబాటు చేస్తున్నారు. కొత్తగా మరో 62 నిర్మిస్తున్నారు. వాటిని జనవరిలో ప్రారంభించేలా ప్లాన్ చేస్తున్నారు.

# స్ట్రీట్ ఫైట్ కు సిద్ధమవుతున్నారా?

విజయవాడ, జూలై 8,

ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ నాయకులకు భయం పోయినట్లుంది. ఇన్నాళ్లు రెడ్ బుక్ అని భయపడి కొంత వెనక్కు తగ్గిన వారు ఇప్పుడు తలెత్తి మరీ తొడకొడుతున్నారు. నిన్న మొన్నటి వరకూ ఇద్దరు ముగ్గురు వైసీపీ నేతలు మాత్రమే బయటకు వచ్చి అధికార పార్టీపై విమర్శలు చేసేవారు. వరస కేసులు నమోదవుతుండటంతో పాటు అక్రమ కేసులు బనాయిస్తుండటంతో కొంతకాలం మౌనం పాటించడమే మంచిదని భావించి తమ నియోజకవర్గానికే కొందరు వైసీపీ నేతలు పరిమితం కాగా, మరికొందరు మాత్రం వ్యాపారాలు చూసుకుంటూ రాజకీయాలకు దూరంగా కాలం వెళ్లబుస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏడాది అయిన తర్వాత మాత్రం నేతలందరూ ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడటంతో పాటు ప్రధానంగా తమకు కూటమి వల్ల ఇబ్బందులుగా ఉన్న తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోనూ కొంత అనుకూలత కనిపిస్తుండటంతో ఇప్పుడిప్పుడే మీడియా ముందుకు వచ్చి అధికార పార్టీపై విమర్శలు చేస్తున్నారు. వల్లభనేనివంశీ, పోసాని కృష్ణమురళి, నందిగం సురేష్, కాకాణి గోవర్ధన్ రెడ్డి లాంటి వారు జైలుకెళ్లి బయటకు వచ్చారు. కేసులు పెట్టినా మహా అయితే రెండు నుంచి మూడు నెలలు జైల్లో ఉంటామని, ఆ తర్వాత నియోజకవర్గంలో సానుభూతి పెరగడంతో పాటు తమకు వచ్చే ఎన్నికల్లో అడ్వాంటేజీగా మారుతుందని లెక్కలు వేసుకుంటున్నారు. అందుకే దమ్ముంటే కేసులు పెట్టుకోవాలంటూ సవాల్ విసురుతున్నారు.వైఎస్ జగన్ పదే పదే వచ్చే ఎన్నికల్లోనూ గెలుపు తథ్యమని చెబుతుండటంతో పాటు అవసరమైతే కొత్త తరం నేతలను ఎంపిక చేస్తామని చెబుతుండటంతో ఇక బయటకు రాక తప్పడం లేదు. ప్రధానంగా జగన్ కూడా ఎవరు ఈ ఏడాది నుంచి యాక్టివ్ గా ఉన్నారు? ఎవరు ప్రజలకు, కార్యకర్తలకు దూరంగా ఉన్నారన్న లెక్కలు తీస్తున్నారట. వారు ఇన్నాళ్లు బయటకు రాకపోవడానికి గల కారణాలపై కూడా నివేదికలు తెప్పించుకున్నారని తెలిసిన నేతలు ఇక అసలుకే ఎసరు వస్తుందని భావించి ఇప్పుడు స్ట్రీట్ ఫైట్ కు సిద్ధమయ్యారు. జగన్ కూడా వరసగా కార్యక్రమాలను ఇస్తుండటం, ఏ నియోజకవర్గాల్లో ఎవరు పాల్గొన్నారన్నది రిపోర్టులు తెప్పించుకోవడంతో కొంత నేతల్లోనూ అలజడి స్టార్టయిందంటున్నారు.మొన్నటి వరకూ ఉత్తరాంధ్ర నేతలు పెద్దగా యాక్టివ్ గా లేరు. అలాగే తూర్పు గోదావరిజిల్లా నేతలు కూడా తమకు రాజకీయ భవిష్యత్ ఉంటుందా? లేదా? అన్నసందేహంలో ఉన్నారు. అయితే కాపు సామాజికవర్గంలోనూ కొంత సానుకూలత ఏర్పడటంతో పాటు జగన్ వైపు కొన్ని వర్గాలు మొగ్గు చూపుతున్నాయని తెలుసుకున్న నేతలు ఇక దూకుడుగా వెళ్లాలని నిర్ణయించుకున్నట్లే కనపడుతుంది. మరొక వైపు ఏదో ఒక సమస్యపై జగన్ జిల్లాల పర్యటనలకు వస్తుండటంతో కూడా తమ ప్రాంతానికి వచ్చినప్పుడు జగన్ కు తప్పుడు సమాచారం ఎవరైనా ఇస్తారేమోనని చెప్పి కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారట. పార్టీ కార్యాలయంతో పాటు నియోజకవర్గంలోనే ఉంటూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారని చెబుతున్నారు. మొత్తం మీద ఏడాదిలోనే ఫ్యాన్ పార్టీలో ఎంత మార్పు అని సొంత పార్టీ నేతలే ముక్కున వేలేసుకుంటున్నారు.

# వన్ టైమ్ ఎమ్మెల్యేపై జరాభద్రం

విజయవాడ, జూలై 8,

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడు ఎవరినీ స్పేర్ చేసే పరిస్థితుల్లో లేరు. గత ఎన్నికల్లోనే సీనియర్ నేతలను పక్కన పెట్టారు. అలాంటిది ఏమాత్రం అలక్ష్యం ప్రదర్శించినా, పనితీరులో వెనకబడినా ఏ మాత్రం ఉపేక్షించరు. ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యేలు అర్థమయింది. ఇప్పుడు గెలిచిన ఎమ్మెల్యేల్లో దాదాపు 90 శాతం మంది సొంత బలంతో గెలిచిన వారు కాదు. కేవలం టీడీపీ గుర్తు, కూటమి పార్టీల కలయిక వల్లనే ఒక్కసారిగా హైప్ క్రియేట్ అయి గత ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా స్ట్రయిక్ రేటు వచ్చింది. చంద్రబాబు నాయుడులో కూడా ఆత్మవిశ్వాసం పెరిగింది. మరోసారి జగన్ ను రానిచ్చేది లేదని చంద్రబాబు పదే పదే చెబుతుండటానికి కారణం కూడా అదే.2029 ఎన్నికల నాటికి ఇక నియోజకవర్గంలో వెనకబడిన ఎమ్మెల్యేలకు టిక్కెట్ ఉండదు. ఆయనకు కార్యకర్తలు ముఖ్యమని పదే పదే చెబుతున్నారు. ఎమ్మెల్యేల పనితీరును నెలవారీ సమీక్షలు చేస్తానని, అనుకున్న లక్ష్యాలను నెరవేరిస్తేనే తిరిగి టిక్కెట్ అని, లేకుంటే వన్ టైమ్ ఎమ్మెల్యేలుగానే మిగిలిపోతారని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. తనకు పార్టీ ముఖ్యం. తిరిగి గెలవడమ లక్ష్యం. అంతే కాని కొత్త ముఖాలు అస్సలు ప్రధానం కాదు. ఈ విషయం ఎమ్మెల్యేలకు కూడా తెలియంది కాదు. వార్నింగ్ లు ప్రస్తుతం సుతిమెత్తంగానే హెచ్చరిస్తున్నా అవి రేపు టిక్కెట్ల కేటాయింపు సమయంలో కౌంట్ అవుతాయన్నది అందరూ అంగీకరిస్తున్న మాట.2024 ఎన్నికల్లో సీనియర్ నేతలను చంద్రబాబు నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టారు. దేవినేని ఉమ వంటి వారికి కూడా టిక్కెట్ లేదు. పొత్తులో భాగంగా అనేక మంది నేతలు టిక్కెట్లు కోల్పోయారు. ఇక ఒక కుటుంబానికి ఒక టిక్కెట్ అన్నది ఖచ్చితంగా అమలు చేశారు. జేసీ, కోట్ల వంటి కుటుంబాలను కూడా కేర్ చేయలేదు. కేవలం ఒక టిక్కెట్ ను మాత్రమే ఇచ్చి దానితో సంతృప్తి పడమన్నారు. అంటే మొన్నటి ఎన్నికల్లోనే చంద్రబాబు ఎఫెన్స్ లో వెళ్లినప్పుడు ఇక వచ్చే ఎన్నికల్లో ఇంకెంత స్పీడ్ గా ఉంటారో వేరే చెప్పాల్సిన పనిలేదు. గెలుపు గుర్రాలకే టిక్కెట్లు కేటాయిస్తారన్నది వాస్తవం. అది కూడా అన్నీ లెక్కలు వేసుకుని మరీ బరిలోకిదింపుతారు. అందులో ఏమాత్రం సందేహం లేదు.ఇది వరకటి టీడీపీ కాదు. ఇప్పుడు చంద్రబాబుకు తోడుగా లోకేశ్ ఉన్నారు. ఇద్దరూ వేగంగా నిర్ణయాలు తీసుకునే నేతలే.పార్టీని గతంలో వీడి వెళ్లిన వారిని కూడా పెద్దగా పార్టీలోకి తీసుకోవడం లేదు. అదే సమయంలో పార్టీ లైన్ ను దాటి వ్యవహరించిన వారిని కూడా ప్రస్తుతం ఏమీ అనకపోయినా నాలుగేళ్ల తర్వాత మాత్రం అది కౌంట్ అవుతుంది. అందుకే ఎమ్మెల్యేలు గతంలో మాదిరిగా చంద్రబాబు మెతక వైఖరితో ఉంటారనుకుంటే పొరపాటే. ఎందుకంటే ఆయన పూర్తిగా మారిపోయారు. అదీ ఆయన గత ఏడాది నుంచి నడుస్తున్న తీరును చూస్తుంటే అర్థమవుతుంది. ఈసారి అనేక మంది కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికయిన వారు, సీనియర్ నేతలకు కూడా భంగపాటు తప్పేట్లు లేదు.

# మూలపేట నుంచి మరో జాతీయ రహదారి

విశాఖపట్టణం, జూలై 8,

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం మరో తీపికబురు చెప్పింది.. ఉత్తరాంధ్రలో కీలకమైన మరో గ్రీన్ ఫీల్డ్ కోస్టల్ నేషనల్ హైవేకు లైన్ క్లియర్ అయ్యింది. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నుంచి భీమిలి వరకు గ్రీన్ ఫీల్డ్ కోస్టల్ హైవే నిర్మాణం కానుంది. ఇటీవల ఈ హైవే గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని రిక్వెస్ట్ చేశారు.. దీంతో ఓకే చెప్పారు. ఈ హైవే మూలపేట పోర్టుకు అనుసంధానంగా ఉంటుందని చెబుతున్నారు. పర్యావరణానికి అనుకూలంగా, వేగంగా వెళ్లేందుకు ఉపయోగంగా ఉంటుందంటున్నారు.విశాఖపట్నం నుంచి భీమిలి వరకు జాతీయ రహదారి ఉంది.. భోగాపురం దగ్గర ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నిర్మాణం జరుగుతోంది.. అటు శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టుకు ఆరు లేన్ల రహదారి అవసరం ఉందన గుర్తించారు. అందుకే భోగాపురం ఎయిర్ పోర్టుకు, మూలపేట పోర్టుకు కనెక్టివిటీని పెంచే పనిలో ఉన్నారు.. విశాఖఫట్నం వరకు లింక్ చేయనున్నారు. అటు పర్యాటకం అభివృద్ధి చెందడంతో పాటుగా ఆక్వా పరిశ్రమలు కూడా వస్తాయని భావిస్తున్నారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ హైవేకు సంబంధించి ఫోకస్ పెట్టారు. ఆయన కూడా ఈ కోస్టల్ నేషనల్ హైవే ఆవశ్యకతను కేంద్రానికి వివరించారు. అయితే సుమారు 200 కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ కోస్టల్ నేషనల్ హైవేకు భూ సేకరణ ఏపీ ప్రభుత్వం చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఈ హైవేకు సంబంధించి ఆదేశాలు ఇంకా రాలేదని.. ఒకవేళ వస్తే కనుక డీపీఆర్ రెడీ చేస్తామంటున్నారు అధికారులు. ఈ ప్రాంతంలో అటవీ, తీరప్రాంత, జిరాయితీ, స్థలాలు ఎంత అవసరమో గుర్తిస్తామన్నారు.మరోవైపు మూలపేట పోర్టు పరిధిలో అమెరికాకు చెందిన ఎగ్జాంబిల్ కంపెనీ ఏర్పాటుకు ముందుకొచ్చింది. గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్ పాలీఇథలీన్ పరిశ్రమను 1,250 ఎకరాల్లో రూ.83,500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. గతవారం ఆ సంస్థ ప్రతినిధులు అధికారులతో కలిసి ఈ ప్రాంతాన్ని పరిశీలించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆర్డీవో ప్రభుత్వం సంస్థకు కల్పించే సౌకర్యాలను వివరించారు. మూలపేట పోర్టుకు రైలు, రోడ్డు రవాణా సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. పోర్టు ఆవశ్యకతను కూడా వివరించారు.

## ప్రాంతీయ విద్వేషాలకు రెచ్చగొడుతున్న బీఆర్ఎస్

### కాంగ్రెస్ పైనున్న కోపాన్ని పత్రికలు, ఛానళ్లపై చూపిస్తున్నారు: ఎంపి చామల

హైదరాబాద్

భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి టిఆర్ఎస్ పార్టీ వైఖరిని తీవ్రంగా తప్పు పట్టారు. టిఆర్ఎస్ అంటే తెలంగాణ అని ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారు. టిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా రాసే పత్రికలను టీవీలపై దాడులకు ఉపక్రమించడం సరికాదు. ఉద్యమ సమయంలో మాదిరి తిరిగి సెంటిమెంటును రగిలించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

బావ బామ్మర్దులు టిఆర్ఎస్ కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు ప్రేరేపిస్తున్నారు . టిఆర్ఎస్ పార్టీ నాయకులు వాళ్ళ గురించి అనుకూలంగా రాసే పత్రికలే తెలంగాణ పత్రికలు అని, వాళ్ల గురించి అనుకూలంగా చూపించే టీవీ ఛానల్ తెలంగాణ ఛానల్ అని ఈ రాష్ట్రంలో బీఆర్ఎస్ గురించి ఎవరు నెగిటివ్ మాట్లాడొద్దు మేము చేసిన తప్పిదాలు రాయ వద్దు, ఛానల్ లో చూపించ వద్దు అంటే ఎలా అని ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్ఎస్ గురించి ఎవరు నెగిటివ్ మాట్లాడినా, రాసినా ఆంధ్ర ఛానల్ అంటున్నారు. కేసీఆర్ ఎన్.టి.రామారావు దగ్గర బీఫామ్ కోసము అబద్ధం చెప్పి తర్వాత వచ్చి అజయ్ అన్న పేరుని తారక రామారావుగా మార్చుకున్నారు. కానీ ఆంధ్ర తెలంగాణ మధ్యన వ్యత్యాసం తీసుకొచ్చి అందరూ సుఖంగా ఉన్న హైదరాబాద్ నగరంలో ప్రజలను రెచ్చగొడుతున్నారు. కేటీఆర్ స్నేహితులంతా ఆంధ్ర వాసులే, ఆయన తిరిగిన ఫిలిం ఇండస్ట్రీకి సంబంధించిన మిత్రులందరూ ఆంధ్ర వాళ్ళే. కేటీ రామారావు చదువుకున్నది గుంటూరు విజ్ఞాన్ కాలేజీలో . విజ్ఞాన్ కాలేజీ లో చదివి జ్ఞానం లేని మాటలు మాట్లాడుతున్నాడు. తెలంగాణ ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారు. ఈరోజు మేము హైదరాబాద్ ని గ్లోబల్ సిటీ గా చేయాలనుకుంటున్నాం. ఒక మంచి రైసింగ్ తెలంగాణ స్లోగన్ తో కాంగ్రెస్ పార్టీ ముందుకు పోతోంది . కాంగ్రెస్ పార్టీ మీద కోపాన్ని పత్రికల మీద టీవీ ఛానల్ మీద చూపిస్తున్నారు. పదేళ్ల మీ అధికారం గురించి ..ఇప్పుడు మీరు చేసుకున్నటువంటి చెడు ప్రచారం గురించి ఛానల్ చెప్పక తప్పదు కదా . చెప్పినప్పుడు మీరు ఒక రాజకీయ పార్టీగా ఉండి మంచిని ,చెడును రెండింటిని ఆస్వాదించడం నేర్చుకోవాలి. అది కాకుండా దాడి చేయడమే కాకుండా ఇంకా దాడులు చేస్తామని మాట్లాడడం సరికాదు. కేసీఆర్ మీరు ఫామ్ హౌస్ లో ఉండి మీ అల్లుడు మీ కొడుకులు రెచ్చగొట్టి కార్యకర్తలతో మాట్లాడిస్తారు.

దేశంలో తెలంగాణను ముందుంచే ప్రయత్నం చేస్తున్న సమయంలో బీఆర్ఎస్ ఈ ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతోంది. ఇక్కడున్న వ్యాపారస్తులను కానీ పత్రికల యాజమాన్యాలను గాని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు.

## గంజాయి మత్తులో యువకుడి హల్ చల్

మిర్యాలగూడ

గంజాయిని అరికడుతున్నామని పోలీసు శాఖ పదేపదే చెబుతున్నప్పటికీ యువత మాత్రం ఇంకా ఆ మత్తులోనే జోగుతూ అనర్థాలకు పాల్పడుతున్నారు. తాజాగా నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామంలో గంజాయి సేవించిన ఇద్దరు యువకులు నానా బీభత్సం సృష్టించారు. మిర్యాలగూడ వేములపల్లి ప్రాంతాలకు చెందిన ఇద్దరు యువకులు గూడూరు గ్రామంలో స్థానికులతో ఘర్షణపడి గంజాయి మత్తులో హల్ చల్ చేశారు. నార్కట్ పల్లి అద్దంకి హైవేపై వాహనాలకు ఎదురెళ్లి లారీ అద్దాలు పగలగొట్టారు. అడ్డుకోబోయిన స్థానికుల పై దాడికి పాల్పడ్డారు. చివరకు పోలీసులు నానా తంటాలుపడి.. అడ్డు అదుపు లేకుండా రెచ్చిపోతున్న యువకులను అదుపులోకి తీసుకున్నారు..

## సాగర్ కు వరద పోటు

నల్గొండ

కృష్ణ బేసిన్ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువనున్న శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా మారుతోంది. నేడో, రేపో శ్రీశైలం డ్యామ్ గేట్లు తెరుచుకోనున్నాయి. ఈ క్రమంలో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ప్రస్తుతం 58 వేల 663 క్యూసెక్కుల వరదనీరు ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతుంది. ఈ నేపథ్యంలో.. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా 3వేల 374 క్యూసెక్కుల నీటిని.. ఖమ్మం జిల్లా తాగునీటి కోసం పాలేరు జలాశయానికి ఇరిగేషన్ అధికారులు విడుదల చేసారు. . హైదరాబాద్ కు తాగునీటి కోసం 900 క్యూసెక్కుల నీటి చొప్పున మొత్తం 4 వేల 734 క్యూసెక్కులుగా ఉంది. అయితే, నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకుగాను, ప్రస్తుతం 530.60 అడుగులకు చేరుకుంది. అలాగే.. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టిఎంసీ లకు గానూ.. ప్రజెంట్ 169.3208 టిఎంసీ లుగా ఉంది..

# తిరుపతిలోవైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

తిరుపతి

తిరుపతి తుడా కార్యాలయ ప్రాంతం లోని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైసిపి శ్రేణులు, కార్యకర్తలు పూలమాలలు వేసి , భారీ కేక్ ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్ఆర్సిపి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, నగర మేయర్ శిరీష, తిరుపతి జిల్లా యూత్ ఇంచార్జ్ భూమన అభినయ్ రెడ్డి పాల్గొన్నారు.

# సిగరేట్ల దుకాణాలనూ పోలీసుల దాడులు

ఏలూరు

నిషేధిత ప్రాంతాలలో నిషేధిత సిగరెట్లు పాన్ పరాగ్ గుట్కా జర్ద వంటి వాటి అమ్మకాలు కొనసాగించడం చట్టరీత్యా నేరమని కళాశాలల ప్రాంగణాలలో సిగరెట్ల అమ్మకాలు జరిపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు . ఏలూరు నగరంలోని సిఆర్ఆర్ కళాశాల సమీపంలోని పలు సిగరెట్ల దుకాణాలపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ మంగళవారం ఉదయం నిర్వహించారు. కొత్త బస్టాండు ప్రాంతాలలో ఉన్న షాపులపై దాడులు చేశారు. వారిపై కేసులు నమోదు చేశారు.

# స్థానిక సమరానికి బీజేపీ సన్నద్ధం.

కరీంనగర్ లో పార్టీ శ్రేణులతో కేంద్ర మంత్రి బండి సంజయ్ సమావేశం

స్థానిక సంస్థల సమరానికి కమలదళం సన్నద్ధమయ్యింది. మెజార్టీ స్థానాలు గెలిపే లక్ష్యంగా పకడ్బందీ ప్రణాళికతో ప్రజల్లోకి వెళ్లేలా సిద్ధమైంది. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రాబోయే పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేందుకు అనుసరించాల్సని వ్యూహంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పార్టీ మండలాధ్యక్షులతో అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపే వాళ్లెందరున్నారు? అని అడిగిన ప్రశ్నకు దాదాపు అందరూ ఎన్నికల్లో పోటీకి సిద్ధమని చేతులెత్తారు. ఈ నేపథ్యంలో వాళ్లను ఉద్దేశించి సంజయ్ ప్రసంగిస్తూ స్థానిక సంస్థల్లో వాతావారణం బీజేపీకి అనుకూలంగా ఉందన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ హవా ఎంత ముఖ్యమో, ఆ పార్టీ నుండి పోటీ చేసే అభ్యర్ధికి ఉన్న ఇమేజ్ కూడా అంతే ముఖ్యమని తెలిపారు. దానిని దృష్టిలో ఉంచుకని మీ పంచాయతీ, మండల, మున్సిపాలిటీల పరిధిలో వ్యక్తిగత ఓటు బ్యాంకు ఉన్న నాయకులంతా పోటీలో ఉండాలని సూచించారు. మిగిలిన వారంతా ఎన్నికల్లో పార్టీని గెలిపించే బాధ్యతను భుజాన వేసుకోవాలని ఆదేశించారు. ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేలా కసితో పనిచేయాలని కోరారు. మండలాధ్యక్షులు సైతం తమ తమ మండలాల పరిధిలో అత్యధిక సర్పంచ్, వార్డు కౌన్సిలర్ స్థానాలను గెలిపించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. అందుకు తగిన ప్రణాళికను రూపొందించుకుని ఎన్నికల రంగంలోకి దిగాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధానంగా రెండు అంశాలను ప్రచారం చేయాలని, 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో నిధులివ్వకుండా స్థానిక సంస్థలను ఏ విధంగా నీరుగార్చారు....అభివృద్ధి పనులు చేసిన సర్పంచులకు బిల్లులివ్వకుండా ద్రోహం చేసిందనే విషయంతోపాటు 19 నెలల కాంగ్రెస్ పాలనలో పంచాయతీలకు నిధులివ్వకుండా, కనీస అభివృద్ధి పనులు చేయకుండా ఏ విధంగా నష్టం చేకూరుస్తుందనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. దీంతోపాటు గత 11 ఏళ్లలో పంచాయతీలు అభివృద్ధి చెందాయంటే నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే సాధ్యమైందనే అంశాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలని కోరారు. రైతు వేదికలు, పల్లె ప్రక్రుతి వనాలు, సీసీ రోడ్లుసహా స్మశాన వాటికల నిర్మాణం దాకా కేంద్రం ఇచ్చిన నిధులతోనే నిర్మించారనే విషయాన్ని ఇంటింటికీ, గల్లీగల్లీకి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# అంబర్ పేట బతుకమ్మ కుంట కు జీవం పోసిన హైడ్రా

హైదరాబాద్అంబర్ పేట బతుకమ్మ కుంట కు హైడ్రా జీవం పోసింది. నామ రూపాలు లేకుండా పోయిన బతుకమ్మ కుంట కు పునరుజ్జివం తెచ్చింది, ఐదు ఎకరాల 15 గుంటల విస్తీర్ణం లో చెట్లు, చెత్త చేదాలతో ఉన్న బతుకమ్మ కుంటను పునః నిర్మించింది. సెప్టెంబర్ లో బతుకమ్మ పండుగ కు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీద గా బతుకమ్మ కుంట ప్రారంభం కానుంది.

# సికింద్రాబాద్ కోర్టు కు బాంబు బెదిరింపు

## ఉత్తుత్తి కాల్ అని నిర్ధారించిన పోలీసులు

సికింద్రాబాద్సికింద్రాబాద్ సివిల్ కోర్టుకు బాంబ్ బెదిరింపు ఈ మెయిల్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బాంబు ఉందన్న సమాచారం రావడంతో న్యాయవాదులు హుటాహుటిన కోర్టు నుండి బయటకు వచ్చారు. వెంటనే మారేడుపల్లి పోలీసులు సికింద్రాబాద్ సివిల్ కోర్టు చేరుకొని తనిఖీలు చేపట్టారు. డాగ్ బాంబు స్క్వాడ్ తో కోర్టు ప్రాంగణంతోపాటు కోర్టు హాలులో తనిఖీలు చేశారు. చివరికి బాంబు లేదని తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నగరంలోని పలు సివిల్ కోర్టులకు ఇదే తరహా ఈమెయిల్ రావడంతో న్యాయవాదులు న్యాయమూర్తులు భయాందోళనకు గురయ్యారు. ఎవరైతే ఈమెయిల్ పంపారో వారిని గుర్తించి పోలీసులు చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేస్తున్నారు.

# ఇండోసోల్ ప్రాజెక్టు..

## అప్పుడు అలా... ఇప్పుడు ఇలా

నెల్లూరు, జూలై 8,

వేలాది మంది రైతులు.. గొంతెత్తి అరుస్తున్నారు.. రోడ్డెక్కి నినదిస్తున్నారు? దీనంగా మొరపెట్టుకుంటున్నారు.. అయినా ఏలిన వారు స్పందించడం లేదు. దక్షిణ కోస్తా ప్రాంతంలో ఇండోసోల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న ఓ సోలార్ కంపెనీకి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమం ఇది. తమ పొలాలు పోతున్నాయని.. రైతులు రగిలిపోతుంటే.. ప్రభుత్వం సెలెంట్.. ప్రభుత్వాధినే?తా సైలంట్.. అధికార పార్టీ సెలంట్.. మిత్రపక్షాలు సెలంట్.. ప్రతిపక్షాలూ.. సైలంట్.. టోటల్గా ఓ నిశ్శబ్దవే రాజ్యమేలుతోంది..నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలంలోని కరేడు గ్రామపంచాయతీ పరిధిలోని ఓ 15 గ్రామాల పరిధిలో షుమారు 4500 ఎకరాల్లో భూసేకరణకు జూన్ 22న నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ భూమి సేకరణ ఎందుకంటే..ఇండోసాల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ ఆ సంస్థ ఈ ప్రాంతంలో సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారు చేస్తుంది. ఇది దేశంలోనే అతిపెద్ద, ఇంటిగ్రేటెడ్ సోలార్ ప్యానల్స్ తయారీ ప్లాంట్ అని చెబుతున్నారు. 8,000 ఎకరాల్లో 5ఉచి చొప్పున మొత్తం రెండు దశల్లో 10ఉచి సామర్థ్యంతో దీనిని నిర్మించనున్నారు. పరిశ్రమలో సోలార్ సెల్స్, వాఫర్స్, పాలిసిలికాన్, గ్లాస్ ప్యానెల్స్ తయారీతో పాటు అనుబంధ పరిశ్రమలు, టౌన్షిప్, ఇతర మౌలిక వసతులు కూడా ఉంటాయి. మొత్తం రూ. 25,000 కోట్ల పెట్టుబడితో 23,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించే అవకాశం ఉందని కంపెనీ చెబుతోంది.అంతపెద్ద పెట్టుబడితో.. ఇంత పెద్ద పరిశ్రమ వస్తుంటే సంతోషించాలి కానీ... మరి వివాదం ఎందుకు..?ఎందుకంటే. పచ్చని పొలాలతో.. పకృతి రమణీయంగా ఉన్న ఈ ప్రాంతాన్ని పరిశ్రమ కోసం ఎంపికచేయడమే సమస్య..! ఇక్కడ ఉన్న భూమిని తీసుకుని పరిశ్రమకు ఇవ్వడానికి రైతులు ఒప్పుకోవడం లేదు. తమ భూమిని ఇవ్వం అని తెగేసి చెబుతున్నారు. ఎక్కడ పరిశ్రమ ఏర్పాటు అయినా రైతుల నుంచి అభ్యంతరాలు తప్పవు. కాకపోతే.. పంటలు సరిగ్గా పండని బంజరు ప్రాంతాలు, నీటి సౌకర్యం తక్కువ ఉన్న పొలాలను.. వీటికోసం ఎంపిక చేస్తారు. వ్యవసాయం కంటే.. అక్కడ ఉపాధి అవసరం ఎక్కువ ఉన్న భూములు తీసుకుంటారు. కానీ ఇలాంటి సారవంతమైన భూములను తీసుకుంటామనడంతో గొడవ మొదలైంది. రైతులు తమ జీవనాధారం కోల్పోతామని, ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. జూన్ 29 న వీళ్లు జాతీయ రహదారిని దిగ్బంధించారు. గ్రామసభల్లో తమ భూములు ఇవ్వమని చెప్పేశారు.మరి ఇంత జరుగుతుంటే.. సంబంధిత మంత్రి? గొట్టిపాటి రవికుమార్ మాట్లాడలేదు. ? ఒకప్పుడు ఈ ప్రాంతం ప్రకాశం జిల్లాలోనే ఉండేది ఆయన ఆ జిల్లా మంత్రి కూడా..! డిపార్ట్మెంట్ నుంచి మాట్లాడటం లేదు. చిన్న విషయానికి కూడా స్పందించే సీఎం చంద్రబాబు నోరెత్తడం లేదు.. ఆ పార్టీ నేతలు అధికారికంగా స్పందించడం లేదు. ఆ పార్టీ భవిష్యత్ అని చెప్పే నారా లోకేష్ నో రెస్పాన్స్? అన్యాయం జరిగితే నినదిస్తా అని చెప్పే కూటమి మిత్రుడు పవన్ కల్యాణ్ పత్తాలేరు.. బీజేపీ నోరెత్తడం లేదు. ఇలా మొత్తం సర్కారు వారి సైలెన్స్ లా పరిస్థితి ఉంది.ఈ విషయంలో ప్రభుత్వం కు మేలు చేయడానికి ప్రయత్నాలు చేస్తోందని అందరూ అనుకునేలా వాళ్ల వ్యవహారశైలి ఉంది. కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకోవడానికి ప్రధాన కారణం.. ఈ ప్రాజెక్టును అధికారంలోకి రాకముందు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎలక్షన్కు ముందు ఆ పార్టీకి వాయిస్ గా ఉన్న లోకేష్ తన పాదయాత్రలో ఇండోసోల్ను కంపెనీ అన్నారు. మరి అప్పటి ఫేక్ కంపెనీ రెండేళ్లలో కంపెనీ అయిపోయిందా అని జనం ప్రశ్నిస్తున్నారు. ఒకసారి లోకేష్ అప్పుడు ఏం చెప్పారో చూడండి..కనీసం లక్ష రూపాయల కేపిటల్ లేనటువంటి.. కంపెనీ 72వేల కోట్ల పెట్టుబడులు పెడుతందా అన్నది ఆయన ప్రశ్న. మరి ఈ రెండేళ్లలో పెట్టుబడులు ఎక్కడ నుంచి తెచ్చింది ఇండో సోల్ సంస్థ షిరిడిసాయి ఎలక్ట్రికల్స్ కు చెందిన సబ్సిడరీ కంపెనీ.. ఈ సంస్థకు కిందటి జగన్ మోహనరెడ్డి ప్రభుత్వం ఆయాచిత లబ్ది చేకూర్చిందని తెలుగుదేశం పదే పదే ఆరోపించింది. ట్రాన్స్ ఫార్మర్లలో దోపిడీ చేసిందన్నారు. స్మార్ట్ మీటర్లతో దోచుకున్నారు అని చెప్పారు. అసలు ఆ కంపెనీలో జగన్ బినామీ అని కూడా చెప్పారు. మరి అలాంటి కంపెనీపై అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది.. ఎందుకు విచారణ జరిపించడం లేదు. అది చేయకపోగా.. ఇలా భూములను ఎందుకు కట్టబెడుతున్నారు..పరిశ్రమలు రావడం అవసరమే కానీ.. నిజంగా దానికి అంత భూమి ఎందుకు.. కిందటి ప్రభుత్వం 5వేలు ఎకరాలు ప్రతిపాదిస్తే ఇప్పుడు 8వేల ఎకరాలు ఎందుకు అడుగుతున్నారు...?అంత పెట్టుబడిని ఎక్కడ నుంచి తీసుకొస్తుంది.. వీటికి దేనికీ సమాధానాలు లేవుసహజంగా అధికారపక్షం వైపు తప్పు ఉంటే ప్రతిపక్షం రాజకీయ లబ్ది కోసమైనా దానిని టేకప్ చేస్తుంది. కానీ ఇక్కడ కరేడు వాసులది దీనస్థితి.. తెలుగుదేశం ప్రభుత్వం, పార్టీ అధికారికంగా స్పందించకపోయినా.. ఆ పార్టీ లోకల్ నాయకత్వం, సానుభూతి పరులు వాళ్లకి మద్దతు తెలుపుతున్నారు. కానీ దీనిపై స్పందించాల్సిన మాత్రం పూర్తి సైలంట్. కొంతమంది రౌడీషీటర్లను కొడితేనే పనిగట్టుకుని వెళ్లి పరామర్శించి వచ్చిన జగన్ మోహనరెడ్డికి కనీసం దీనిపై స్పందించడం లేదన్నది వాళ్ల ఆవేదన. ఈ ప్రాజెక్టు యాజమాన్యానికి వైసీపీకి సంబంధాలున్నాయన్న మాట నిజం అనుకోనేలా ఉంది ఆయన స్పందన.కూటమిలో భాగస్వామిగా ఉన్న పవన్ కల్యాణ్ కొన్ని సందర్భాల్లో నేరుగా వెళ్లి మాట్లాడారు.

# ఇప్పుడు టార్గెట్ చైనా...

న్యూఢిల్లీ, జూలై 8,

ఇప్పటికే ఆర్థిక వ్యవస్థలో జర్మనీ దేశాన్ని పక్కన పెట్టాం. మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదిగాం. భవిష్యత్ కాలంలో చైనాను అధిగమించబోతున్నాం. అమెరికాకు దగ్గరగా వెళ్లబోతున్నాం.. ఆర్థికంగా ఎదగడం మాత్రమే కాదు.. రక్షణ పరంగా కూడా అంతే స్థాయిలో వృద్ధిని సాధించబోతున్నాం. ఇదేదో అడ్డగోలుగా చెబుతున్న మాట కాదు. సరదాగా చేస్తున్న వ్యాఖ్య అంతకన్నా కాదు. ఇటీవల పాకిస్తాన్ పై ఆపరేషన్ సిందూర్ తర్వాత మన సైనిక సామర్థ్యం.. మన ఆయుధ సామర్థ్యం.. ప్రపంచానికి తెలిసింది. ముఖ్యంగా యుద్ధ విమానాలను వాడటంలో మనం ఉపయోగిస్తున్న సాంకేతికత ప్రపంచానికి సరికొత్తగా కనిపించింది. అయితే దీనిని ఇక్కడితోనే ఆపివేయాలని భారత ప్రభుత్వం అనుకోవడం లేదు. ఈ సాంకేతికతను మరింత అభివృద్ధి చేసుకోవాలని భావిస్తున్నది. ఈ క్రమంలోనే అత్యంత ఆధునిక రక్షణ వ్యవస్థను భారతదేశం నిర్మించుకుంటున్నది.ఇప్పటికే డిఆర్డిఓ అత్యంత ఆధునికమైన ఆయుధాలను తయారు చేస్తున్నది. వచ్చే ఐదు సంవత్సరాలలో వివిధ రకాల 12 హైపర్ సోనిక్ యుద్ధ క్షిపణులు సిద్ధమవుతున్నాయి. ఇవి దాడి చేయడం మాత్రమే కాదు.. శత్రు దేశాల రక్షణ సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి. ప్రాజెక్టు విష్ణు లో భాగంగా డిఆర్డిఓ ఈ మిషన్ చేపడుతోంది.. డిఆర్డిఓ చేపడుతున్న మిషన్ లో హైపర్ సోనిక్ గ్లైడ్ వెహికల్, హైపర్ సోనిక్ క్రూజ్ మిస్సైల్స్, హైపర్ సోనిక్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. దాడిలో అత్యంత వేగవంతమైన సామర్థ్యం.. అత్యంత ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానం వీటిలో ఉపయోగిస్తున్నారు. వీటి ద్వారా శత్రువులను అత్యంత బలంగా ఎదుర్కోవడం.. వెంటనే తుద ముట్టించడం వీటి లక్ష్యమని నిపుణులు చెబుతున్నారు.సరిగ్గా ఏడాది క్రితం డిఆర్డిఓ హైపర్ సోనిక్ మిస్సైల్ పరీక్షను అత్యంత విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రయోగం ద్వారా దేశ స్క్రామ్ జెట్ ఇంజన్ అభివృద్ధిలో ఇది కీలకమైన రాయిగా నిలిచింది.. అంతేకాదు ఈ వ్యవస్థలను అభివృద్ధి చేసి చైనా, రష్యా, అమెరికా స్థాయిలో భారత్ నిలిచింది. లాంగ్ రేంజ్ హైపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ కెపాసిటీ ఉన్న మోస్ట్ పవర్ఫుల్ కంట్రీస్ లో మన దేశం ఒకటిగా నిలిచింది. ధ్వని కంటే ఐదు రెట్ల వేగంతో ప్రయాణించే కెపాసిటీ ఉన్న ఆయుధాలను హైపర్ సోనిక్ అని పిలుస్తుంటారు. ఇలాంటి క్షిపణులను అడ్డుకునే వ్యవస్థ ప్రస్తుతం ప్రపంచంలో ఏ దేశం వద్ద లేదు. అయితే ఇటువంటి అత్యాధునిక హైపర్ సోనిక్ వెపన్స్ ను డిఆర్డిఓ డెవలప్ చేస్తోంది. వీటిని ఆర్మీ, నేవి, వాయు సేన కోసం డెవలప్ చేస్తోంది.ఇందులో ఫస్ట్ టైం ఎక్స్టెండెడ్ ట్రాజెక్టరీ లాంగ్ రేంజ్ హైపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ ను డిఆర్డిఓ డెవలప్ చేస్తోంది. స్క్రామ్ జెట్ ఇంజన్ తో మాక్- 8 స్పీడ్ ను రీచ్ అయ్యే విధంగా దీనిని డెవలప్ చేస్తున్నారు. ఇది 2,500 కిలోమీటర్ల వరకు ఉన్న టార్గెట్ లను చేజ్ చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు 2030 కల్లా వీటిని మన ఆర్మీలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఆయుధాలు మన ఆర్మీకి ఐదు సంవత్సరాల కాలంలో అందుబాటులోకి వస్తాయి. ఇవన్నీ కూడా మన దేశ రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాయి. అప్పుడు శత్రు దేశాలు మన మీద దాడి చేయాలంటే ఆలోచిస్తాయి. అంతేకాదు బలమైన దేశాల కంటే మనమే ముందు వరుసలో ఉంటాం. అన్నిటికంటే ముఖ్యంగా రక్షణ వ్యవస్థలో అమెరికాతో సమానంగా ఉంటాం.

# రెచ్చగొట్టడానికి జగన్ వస్తున్నాడు..జాగ్రత్త ప్రశాంతి రెడ్డికి ప్రసన్న కుమార్ క్షమాపణ చెప్పాలి భానుప్రకాశ్ రెడ్డి, - బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

తిరుపతి

జగన్ పర్యటనకు వస్తున్నారు. ఆయన రావాలంటే, ఒక శవం అయినా ఉండాలి, లేకుంటే ఒక శవం అయినా లేయాలి అనే అభిప్రాయంలో ప్రజలు ఉన్నారని బీజేపీ అధికార ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి న్నారు.

జగన్ కు ఓ పండు ఏమిటో తెలుసా. మామిడి రకాలు ఎన్ని ఉన్నాయో , వాటి పేర్లు ఏమిటో చెప్పు నాయనా జగన్. గూగుల్ తల్లిని అడకకుండా వాటి పేర్లు చెప్పలేవు.

పాదయాత్ర చేసావు, నీ యాత్ర పరామర్శ యాత్ర కాదు, దండ యాత్ర..మేము మీ యాత్రను స్వాగతిస్తున్నానీ, కానీ వేల మంది రావడం ఏమిటండీ. మార్కెట్ యార్డ్ అంటే మైదానం కాదు. అక్కడ అంత మంది సరిపోరు అయ్యా. పరదాల ముఖ్యమంత్రి జగన్ తన ఐదేళ్లలో ప్రజల సమస్యలు తెలిసి ఉంటే, ఈ పరిస్థితి ఉండేది కాదని అన్నారు.

మీకు ఆ పరిస్థితి లేదు కాబట్టే, 11 సీట్లకు పరిమితం చేశారు.. తోలు, గుజ్జు, టెంకణి కూడా ఉపయోగించుకునే అవకాశం ఉందని నిపుణులు ద్వారా తెలుస్తోంది..అదే సాధ్యం అయితే రైతుల సమస్యలు పరిష్కరం అవుతుందని బావిస్తున్నం.రెచ్చగొట్టడానికి, రెచ్చిపోవడానికి వారు వస్తున్నారు. జాగ్రత్తగా ఉండండి. ఆయన యాత్రలన్ని ఓదార్పు యాత్రలే తప్ప, జైత్రయాత్రలు ఉండవని మేము చెబుతున్నాం. ముఖ్యమంత్రి ఏమి చేయాలో, ఏమి చేయకూడదో తెలుసుకోవాలంటే, జగన్ ను ఓ కేస్ స్టేడిగా తీసుకుంటే తెలుస్తుంది. ప్రసన్నకుమార్, మహిళలను అవహేళనగా మాట్లాడారు.ఒళ్ళు జాగ్రత్తగా పెట్టుకో. జగన్ ,మహిళలను గౌరవించే వ్యక్తి అయితే, ప్రసన్నకుమార్ రెడ్డి ని సస్పెండ్ చేయాలని అన్నారు.

అహంకారంతో ప్రసన్నకుమార్ రెడ్డి కళ్ళు నెత్తికెక్కయా. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కాళ్ళు పట్టుకుని క్షమాపణ చెప్పాలి. రాజకీయ నాయకులు ఆదర్శంగా ఉండాలే తప్ప దిగజారి మాట్లాడకుడదు. దిగజారి మాట్లాడం ఏమిటి, ప్రజలు చూస్తూ ఊరుకోరు. జగన్ అప్పట్లో, తన మంత్రిత్వశాఖలో బూతుల మంత్రులను పెట్టుకుని పాలన సాగించారని అన్నారు.

==============================

44జూబ్లీ హిల్స్ రోడ్డు నంబర్ 36 లో గల పార్క్ సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి

జీహెచ్ఎంసి కమిషనర్

హైదరాబాద్

జూబ్లీ హిల్స్ రోడ్డు నంబర్ 36 లో గల పార్క్ సుందరీకరణ పనులను త్వరితగతంగా చేపట్టాలని కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళ వారం కమిషనర్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తో కలిసి పార్కు ను పరిశీలించారు. పార్కు అభివృద్ధి ,సుందరీకరణ చేపట్టిన ప్లాన్ లో చేర్పులు మార్పులు చేయాలని సూచించారు. రోడ్డు నంబర్ 36 నుండి నడుచుకుంటూ వెళ్లి రోడ్డు నంబర్25 వరకు మధ్య లో ఉన్న పార్కును సందర్శించారు. పార్కు లో విజిటర్స్ కు ఆహ్లాదకర మైన వాతావరణం కల్పించే విధంగా అన్ని విధాలుగా సుందరీకరణ, అత్యవసర పనులను చేపట్టి నిర్దేశించిన కాల వ్యవధి లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు కమిషనర్ వెంట ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, సర్కిల్18 ఈ ఈ విజయకుమార్ హార్టికల్చర్ ఆఫీసర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు

# వ్యవసాయ రంగ సమస్యలను పరిష్కరిస్తున్నాం

న్యూ ఢిల్లీ :

జగన్ హయాంలో వ్యవసాయరంగం దెబ్బతింది. రైతులు అనేక రకాలుగా ఇబ్బంది పడ్డారు. వ్యవసాయం సహా ఏ రంగాన్ని పట్టించుకోలేదని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం అన్ని చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వ వైఖరితో వ్యవసాయరంగానికి అనేక చిక్కులు ఎదురయ్యాయి. ఆ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరిస్తున్నాయని అన్నారు.

# ఏపీ సర్కార్ లో పనిచేయలేమంటున్న ఐఏఎస్, ఐపీఎస్ లు

## కేంద్రానికి వరస ఫిర్యాదులు

విజయవాడ జూలై 8,

ఏపీ ప్రభుత్వం తీరుపై కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఆగ్రహంగా ఉన్నారా? కక్ష సాధింపునకు దిగుతోందని ఆందోళనతో ఉన్నారా? ఏపీ నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారా? మరి కొందరు నేరుగా కేంద్రానికి ఫిర్యాదు చేస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అందుకు బలం చేకూరుస్తున్నాయి. రెండు రోజుల కిందట ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీనామాకు సిద్ధపడిన సంగతి తెలిసిందే. వాలంటరీ రాజీనామాతో పెద్ద ప్రకంపనలు సృష్టించారు. అయితే ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వ బాధిత ఐఏఎస్, ఐపీఎస్ లు కేంద్రానికి భారీగా ఫిర్యాదులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీలో కూటమి ప్రభుత్వ తీరు బాగాలేదని పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారట.ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. వైసిపి హయాంలో అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా నడుచుకున్న అధికారులపై ఫోకస్ పెట్టింది కూటమి. అప్పటి వైసిపి ప్రభుత్వ పెద్దలతో అంటగాకి తమను ఇబ్బంది పెట్టిన వారిని పోస్టులు ఇవ్వకుండా చేసింది. కొందరిపై కేసులు కూడా నమోదయ్యాయి. ఇటువంటి పరిస్థితుల్లో చాలామంది ఇతర రాష్ట్రాల్లో పోస్టింగ్ కోసం ప్రయత్నాలు చేశారు. మరికొందరైతే స్వచ్ఛంద పదవీ విరమణకు ప్రయత్నించారు. అందుకు అంగీకారం తెలపక పోగా కొంతమంది పై కేసులు కూడా నమోదయ్యాయి. నీతో బాధిత అధికారులంతా కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు.కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే చాలామంది అధికారులను పక్కన పెట్టింది. వారికి పోస్టింగులు ఇవ్వలేదు. రాష్ట్రంలోనే సీనియర్ అధికారిగా గుర్తింపు సాధించిన శ్రీలక్ష్మి కి పోస్టింగ్ ఇవ్వలేదు. చీఫ్ సెక్రటరీ అర్హత జాబితాలో ఆమె తొలి స్థానంలో ఉన్నారు. జగన్ హయాంలో ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేశారు సీనియర్ ఐఏఎస్ అధికారి ముత్యాలరాజు. ఆయనకు సైతం పోస్టింగ్ ఇవ్వలేదు. మురళీధర్ రెడ్డి, మాధవి లత, నీలకంఠ రెడ్డికి ఇప్పటివరకు పోస్టింగ్ ఇవ్వలేదు. ఐపీఎస్ లపై సైతం అదే ధోరణి కొనసాగింది. రఘురామిరెడ్డి, విశాంత్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి పై కక్ష సాధింపు చర్యలకు దిగిందన్న విమర్శలు ఉన్నాయి. పీఎస్ఆర్ ఆంజనేయులు, సంజయ్, పీవీ సునీల్, క్రాంతి రానా, విశాల్ గున్నీలపై సైతం సక్సెస్ సాధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఐపీఎస్ అధికారి వాలంటరీ రిటైర్మెంట్ వైపు మొగ్గు చూపినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ తరుణంలో ప్రభుత్వ బాధ్యత అధికారులంతా కేంద్రానికి ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. మరి కేంద్రం ఎలా స్పందిస్తుందో చూడాలి.

## మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కిఘన నివాళులర్పించిన ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పలువురు నేతలు

హైదరాబాద్

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 76 వ జయంతి సందర్భంగా పంజాగుట్ట చౌరస్తా లో వైఎస్ ఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్,ఎమ్మెల్సీ బలమురి వెంకట్, సిడబ్ల్యుసి సభ్యుడు గిడుగు రుద్రరాజు, కాంగ్రెస్ నేతలు కేవీపీ రామచంద్రరావు, అంజన్ కుమార్ యాదవ్, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.మహా నేత దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 76 వ జయంతి సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ పక్షాన ఘన నివాళులు అర్పిస్తున్నాం.ఆయన రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలో దేశానికి ఆదర్శంగా నిలిపారు.ఆయన మరణించి 15 సంవత్సరాలు గడిచిన ఇంకా ఆయన గుర్తులు ప్రజల్లో చిరస్మరణీయంగా ఉన్నాయివారికి ఘన నివాళులు అర్పిస్తు ఈనాటి యువత వారి శ్రమ, సమయస్ఫూర్తి రాజకీయాల్లోకి వచ్చే వారు వారి నుండి నేర్చుకొని ముందుకు పోవాలి.

## వృద్ధురాలును చంపి బంగారం దొంగలించకపోయిన కేసు

### పోలీస్ అధికారులకు సిబ్బందికి నగదు రివార్డు అందజేత

### పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ

సిద్దిపేట

గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారెడ్డి పల్లి గ్రామ శివారులో నల్ల సత్తవ్వ, వ్యవసాయ భూమిలో పనిచేస్తుండగా గుర్తుతెలియని నేరస్తుడు వృద్ధురాలును చంపి బంగారు వస్తువులు దొంగలించక పోయిన కేసులో ఎలాంటి క్లూస్ లేకున్నా గజ్వేల్ ఇన్స్పెక్టర్లు సైదా, ముత్యం రాజు, క్రైమ్ వర్టికల్ మరియు ఐటీ సెల్ సిబ్బంది ఏఎస్ఐ యాదగిరి, కానిస్టేబుళ్లు నరేందర్, వెంకటేష్, రవి, దివ్య, శ్రీకాంత్, రమేష్, సురేందర్, హోంగార్డు నగేష్. టెక్నాలజీ సహాయంతో నేరస్తుని చాకచక్యంగా పట్టుకొని వృద్ధురాలి హత్య కేసును చేదించి ప్రాపర్టీ రికవరీ చేసినందుకు, కమిషనర్ కార్యాలయంలో పోలీస్ అధికారులను సిబ్బందిని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ అభినందించి నగదు రివార్డు అందజేశారు.

గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారెడ్డి పల్లి గ్రామ శివారులో నల్ల సత్తవ్వ వ్యవసాయ భూమిలో పనిచేస్తుండగా గుర్తుతెలియని నేరస్తుడు వృద్ధురాలును చంపి బంగారు వస్తువులు దొంగలించక పోయిన కేసులో సీసీ కెమెరాలు, టెక్నాలజీ సహాయంతో నేరస్తుని చాకచక్యంగా పట్టుకొని విచారించి నేరం ఒప్పుకున్నందున అతని వద్ద నుండి ఒక గ్లామర్ బైకు, కొడవలి, బంగారపు చైన్, చెవి కమ్మలు, ఒక మొబైల్ ఫోను. స్వాధీనం చేసుకుని నేరస్తుడైన కిచ్చిగారి శివ శంకర్, ఆయుర్వేదిక బోన్ సెట్టింగ్ డాక్టర్, నివాసం కోమటిపల్లి, వెల్దుర్తి మండలం, మెదక్ జిల్లా. అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్ కు పంపించిన గజ్వేల్ పోలీసులు ఇది విధితమే.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. ఏదైనా కేసు నమోదు కాగానే ఛాలెంజ్ గా తీసుకొని కేసులు చేదించే అధికారులకు సిబ్బందికి మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. అంకితభావంతో క్రమశిక్షణతో విధులు నిర్వహించే అధికారులకు సిబ్బందికి ప్రోత్సహించే విధంగా నగదు రివార్డు, అవార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కేసుల చేతనలో సీసీ కెమెరాలు టెక్నాలజీ చాలా ఉపయోగ పడతాయని తెలిపారు. నేను సైతం, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు వ్యాపారస్తులు ముందుకు వచ్చి పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఎసిపి నరసింహులు, గజ్వేల్ ఇన్స్పెక్టర్లు సైదా, ముత్యం రాజు, ఎస్బి ఇన్స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్ గౌడ్, కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ మల్లేశం గౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## రంగనాయక సాగర్ పంపు హౌస్ ను పరిశీలించిన కలెక్టర్

సిద్దిపేటరంగనాయక సాగర్ పంప్ హౌస్ ను జిల్లా కలెక్టర్ కె. హైమావతి పరిశీలించారు. అండర్ టన్నెల్ ద్వారా ప్రయాణించి పంప్ హౌస్ ని చేరుకోగా రంగనాయక సాగర్ డిఇ చంద్రశేఖర్ పంపు హౌస్ లోని అన్ని విభాగాలను జిల్లా కలెక్టర్ కు చూపించి కాలేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రంగనాయక సాగర్ రిజర్వాయర్ మరియు పంప్ హౌస్ వివరాలను జిల్లా కలెక్టర్ కు వివరించారు. రిజర్వాయర్ లోకి వాటర్ పంపింగ్ స్థలాన్ని చూపించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రంగనాయక సాగర్ గెస్ట్ హౌస్ ను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట స్థానిక తాసిల్దార్, ఎంపీడీవో తదితరులు ఉన్నారు.

## ఇంటింటికి వెళ్లిన తెలుగుదేశం పార్టీ నాయకులు

బద్వేలు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 7 వ రోజు మంగళవారం ఉదయం బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డు సురేంద్రనగర్ లో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు గురించి వివరించడం జరిగింది. అలాగే ప్రజల సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కరించమని ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

# రియల్ కుంభకోణం.. స్టార్ హీరో మహేష్ బాబుకు మరో నోటీసులు

హైదరాబాద్ జూలై 8,



సినీ సెలబ్రిటీలు ప్రముఖ కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్లు గా వ్యవహరించి చిక్కుల్లో పడుతున్నారు. ముఖ్యంగా సూపర్ స్టార్ మహేష్ బాబు గురించి మాట్లాడుకోవాలి. రీసెంట్ గానే ఆయన శ్రీ సాయి సూర్య డెవలపర్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ కు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించడం, కానీ ఆ సంస్థ మనీ లాండరింగ్ కేసులో చిక్కుకోవడంతో ఈడీ అధికారులు మహేష్ బాబు ని విచారణకు హాజరు కావాలని ఆదేశించడం వంటివి జరగడం మనమంతా చూసాము. అయితే మహేష్ బాబు విచారణకు హాజరు అయ్యాడో లేదో, అసలు ఈ వ్యవహారం ఎక్కడి దాకా వెళ్ళింది అనేది ఎవరికీ తెలియదు. ఈ అంశాన్ని అందరూ మర్చిపోయారు కూడా. కానీ ఇంతలోపే మరో రియల్ ఎస్టేట్ కుంభకోణం లో మహేష్ బాబు చిక్కుకున్నాడు. అయితే సాయి సూర్య డెవలపర్స్ సంస్థ మహేష్ బాబు యాడ్స్ ని ప్రచారం చేయడం వల్ల రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక మహిళ ఒక లే అవుట్ లో ఫ్లాట్స్ ని కొనుగోలు చేసిందటఒక్కో ఫ్లాట్ కి 34 లక్షల రూపాయలకు పైగా డబ్బులు తీసుకున్నారని, తీరా చూస్తే కొన్న ఫ్లాట్స్ మా పేరు మీద రిజిస్టర్ చేయడానికి అనుమతించలేదని ఆమె ఆరోపించింది. దీంతో కట్టిన డబ్బులను వెంటనే వెనక్కి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేయడంతో సాయిసూర్య డెవలపర్స్ సంస్థ ఎండీ సతీష్ చంద్రగుప్తా ఆమెకి కేవలం 15 లక్షలు మాత్రమే చెల్లించారట. మిగిలిన డబ్బుల కోసం అడిగితే అసలు అందుబాటులోకి రాలేదని ఆమె తన ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో ఆమె రంగారెడ్డి కన్స్యూమర్ ఫోరమ్ లో ఫిర్యాదు చేసింది. ఆమె పిటీషన్ ని క్షుణ్ణంగా పరిశీలించిన ఫోరమ్ అధికారులు సతీష్ గుప్త తో పాటు, ఆ యాడ్ ని ప్రమోట్ చేసిన మహేష్ బాబు కి నోటీసులు జారీ చేశారు. జులై 8న మీ న్యాయవాదులతో పాటు ఫోరమ్ ఎదుట హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు.మరి మహేష్ బాబు ఈసారైనా విచారణకు హాజరు అవుతాడా?,లేక కేవలం తన న్యాయవాదులను పంపి సరిపెడుతాడా అనేది తెలియాల్సి ఉంది. ఈ అంశంపై సోషల్ మీడియా లో నెటిజెన్స్ మహేష్ బాబు పై తీవ్రమైన ట్రోల్స్ వేస్తున్నారు. ఇంకా ఇలాంటివి ఎన్ని చేసావు బాబు అంటూ ఆయన్ని ట్యాగ్ చేసి ప్రశ్నిస్తున్నారు. మరి దీనిపై మహేష్ బాబు కానీ, ఆయన టీం కానీ రెస్పాన్స్ ఇస్తుందో లేదో చూడాలి. ప్రస్తుతం మహేష్ బాబు రాజమౌళి తో ఒక సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. శరవేగంగా రెండు ప్రధానమైన షెడ్యూల్స్ ని పూర్తి చేసుకున్న ఈ చిత్రం అప్పుడే పాతిక శాతం షూటింగ్ ని పూర్తి చేసుకుందట. ఆగష్టు 9 న మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుండి ఒక గ్లింప్స్ వీడియో ని విడుదల చేయబోతున్నారట మేకర్స్.

# గొర్రెలు, బర్రెలు ఇస్తే ఏం చేసుకోవాలి..

## తన శాఖలపై మంత్రి వాకిటి శ్రీహరి అసంతృప్తి

కరీంనగర్, జూలై 8 (

లేకలేక మంత్రి పదవి వచ్చింది. కానీ మంత్రి పదవి స్వీకరించిన కొన్ని రోజులకే నాకు ఇలాంటి శాఖలు కేటాయిస్తే ఏం చేసుకోవాలంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు వాకిటి శ్రీహరి. గొర్రెలు, బర్రెలు ఇస్తే ఏం చేసుకోవాలో అర్థం కావడం లేదని.. నాశనం అయిన శాఖలను కేటాయించారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు కేటాయించిన శాఖలపై కరీంనగర్లో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి అసంతృప్తి వ్యక్తం చేశారు. గత పదేళ్లలో పూర్తిగా నాశనం అయిన శాఖలను తనకు అప్పగించారని అన్నారు. యువజన సర్వీసులు, పశుసంవర్ధక శాఖలు ఇస్తే నేనేం చేసుకోవాలి. గొర్రెలు, బర్రెలు ఇస్తే ఏం చేసుకోవాలి అంటూ మంత్రి వాకిటి శ్రీహరి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు కేటాయించిన మొత్తం శాఖలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, తన అదృష్టమో లేక దురదృష్టమో అర్థం కావడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. వాకిటి శ్రీహరి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించినా అదృష్టం వరించింది. తెలంగాణ కేబినెట్ మంత్రి అయ్యారు. సామాజిక సమీకరణం కలిసి రావడంతో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తొలి ప్రయత్నంలోనే మంత్రి పదవితో జాక్ పాట్ కొట్టారు. మేజర్ పంచాయత్ మక్తల్ సర్పంచ్ గా విజయం సాధించిన వాకిటి శ్రీహరి అంచెలంచెలుగా ఎదిగి గత అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ ఎమ్మెల్యే అయ్యారు. ముదిరాజ్ లకు కేబినెట్ లో బెర్త్ ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం ఫిక్స్ కావడంతో రాష్ట్ర మంత్రి అయ్యారు. మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడుగా చేసిన వాకిటి శ్రీహరి జిఖఅ మక్తల్ గా తెలంగాణలో రెండో అత్యధిక మెజార్టీ తెచ్చుకున్నారు. తరువాత మహబూబ్ నగర్ జిల్లా జిల్లా పరిషత్ లో కాంగ్రెస్ పార్టీ జిఖ ఫ్లోర్ లీడర్ గా చేశారు. మహబూబ్నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేట్ ఎన్నికలలో ఇంఛార్జ్ గా చేశారు. 2023లో జరిగిన ఎన్నికల్లో మక్తల్ ఎమ్మెల్యేగా గెలుపొంది, తొలి ప్రయత్నంలోనే మంత్రి అయ్యారు. కానీ తనకు కేటాయించిన శాఖలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేయడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ అవుతోంది

# తెరపైకి కన్నెపల్లి పంపుహౌస్ వివాదం

కరీంనగర్, జూలై 8



అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల మధ్య ఇటీవలి కాలంలో అనేక అంశాలపై మాటల యుద్ధం సాగుతోంది. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో రెండు పార్టీల వాగ్వాదం జరుగుతుండగానే, తాజాగా కన్నెపల్లి పంపుహౌస్ వివాదం రెండు పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంపుహౌస్‌ను ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుండగా, పంపుహౌస్ ఎప్పుడు ప్రారంభించాలో తమకు తెలుసని కాంగ్రెస్ పార్టీ ఎదురుదాడి చేస్తోంది. ఈ కన్నెపల్లి పంపు విషయంలో ప్రస్తుత, మాజీ నీటిపారుదల శాఖ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, హరీశ్ రావుల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది.కాళేశ్వరంలోని కీలకమైన కన్నెపల్లి పంపుహౌస్‌లోని మోటార్లు 2022 గోదావరి వరదల్లో మునిగి పాడయ్యాయి. రిటైనింగ్ వాల్ కూలిపోవడంతో తీవ్ర నష్టం జరిగింది. వీటిని మరమ్మతు చేసి పునరుద్ధరించడానికి వందల కోట్లు అవసరమని నీటిపారుదల శాఖ ఇంజనీర్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఇదిలా ఉండగా, కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పి.సి. ఘోష్ ఆధ్వర్యంలో కమిషన్ వేసి విచారణ జరుపుతోంది. ఈ విచారణకు కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసిన ఇంజనీర్లు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు, మాజీ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ కమిషన్ నివేదిక ఆధారంగానే కాళేశ్వరం ప్రాజెక్టు విషయాల్లో ముందుకు సాగాలని కాంగ్రెస్ సర్కార్ నిర్ణయించుకుంది. ప్రస్తుతం కన్నెపల్లి పంపుహౌస్ మోటార్ల మరమ్మతు పనులు సాగుతున్నట్లు సమాచారం.గోదావరి నదిలో ప్రస్తుతం నీటి ప్రవాహం ఉన్నా కేవలం రాజకీయ కక్షతో కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లు ఆన్ చేయడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావు ఆరోపిస్తున్నారు. "గోదావరిలో నీళ్లున్నాయి. మేడిగడ్డ బ్యారేజీ గేట్లు తెరిచి ఉన్నా, కన్నెపల్లి పంపుహౌస్ ద్వారా రోజుకు 2 టీఎంసీల (వేల మిలియన్ క్యూబిక్ అడుగులు) నీటిని ఎత్తిపోయవచ్చు. రైతులు సాగునీరు లేక అల్లాడుతున్నారు. వెంటనే మోటార్లు ఆన్ చేసి రైతులకు న్యాయం చేయాలి," అని హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ రాజకీయానికి వాడుకుంటోందని హరీశ్ రావు విమర్శిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీరు అవసరమని, ఇప్పుడు నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని హరీశ్ రావు వాదన.మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లలో లోపాలు, కన్నెపల్లి పంపుహౌస్ నీట మునగడం వంటివి బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అవినీతికి నిదర్శనమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎదురుదాడికి దిగుతున్నారు. "కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం కమిషన్ల కోసం, వారి దోపిడీ కోసం కట్టింది. మామూలు పగుళ్లు కావు, మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లే కుంగిపోయాయి. అలాంటి ప్రమాదకరమైన నిర్మాణాలను మేము ఎలా నమ్మగలం? వాటిని సరిదిద్దకుండా, ప్రాజెక్టు భద్రతను నిర్ధారించుకోకుండా నీటిని ఎత్తిపోవడం అంటే రైతుల ప్రాణాలతో, ఆస్తులతో చెలగాటమాడటమే అవుతుంది," అని మంత్రి ఉత్తమ్ ఘాటుగా స్పందించారు. "కాళేశ్వరం కమిషన్ నివేదిక వచ్చేవరకు, నిపుణుల కమిటీ అనుమతి లేకుండా పంపుహౌస్‌లను పూర్తిగా ఆన్ చేయలేము. ఇది రాజకీయ నిర్ణయం కాదు, ప్రజల భద్రతకు సంబంధించినది," అని ఉత్తమ్ కుమార్ రెడ్డి కుండబద్దలు కొట్టి చెప్పారుఇలా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం సాగుతుంటే, వర్షాలు ఆశించిన రీతిలో రాకపోవడం, కన్నెపల్లి పంపుహౌస్ నుండి నీటి విడుదల కాకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు పార్టీలు రాజకీయాలకతీతంగా సాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం సైతం తమ సమస్యను దృష్టిలో పెట్టుకుని స్పందించాలని కోరుతున్నారు.అయితే, రెండు మూడు రోజులుగా కన్నెపల్లి పంపుహౌస్ చుట్టూ రాజకీయాలు సాగుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల మాటల యుద్ధం తెలంగాణ రాజకీయాల్లో కాక పుట్టిస్తున్నాయి. రైతులకు నీరు ఇవ్వాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేస్తుంటే, నిపుణులు చెప్పకుండా నీరు ఇస్తే రైతుల ఆస్తులకే నష్టం జరుగుతుందని ప్రస్తుత నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెబుతున్నారు.

=================

## వైసీపీకి మహిళలంటే గౌరవం లేదు: మంత్రి సవిత

కడప

వైసీపీకి మహిళలంటే గౌరవం లేదు. మహిళల పట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేయడం సరికాదని మంత్రి సవిత అన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై విమర్శలు శోచనీయం.ప్రశాంతిరెడ్డికి ప్రసన్న కుమార్ రెడ్డి క్షమాపణ చెప్పాలని మంత్రి అన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండే వ్యక్తి వైయస్ రాజశేఖర్ రెడ్డి

కాకినాడ

చనిపోయి పదహారేళ్లయినా సరే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండే వ్యక్తి దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అని మాజీ మంత్రి, కాకినాడ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాడిశెట్టి రాజా కొనియాడారు..కాకినాడ నగర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ 76 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.. స్థానిక బాలాజీ చెరువు సెంటర్ లో ఉన్న వైయస్సార్ విగ్రహానికి మాజీ మంత్రి దాడిశెట్టి రాజా,పార్టీ శ్రేణులుతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు..ఈ కార్యక్రమంలో వైఎస్సార్ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు...

## బైకు సెలెన్సర్ల పై ట్రాఫిక్ పోలీసుల డ్రైవ్

కాకినాడ

కాకినాడ నగరంలో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లతో ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారిపై ట్రాఫిక్-2 సీఐ డి.రామారావు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి.52 మందిపై కేసులు నమోదు చేసి,చలానా విధించారు.అనంతరం ఆయా సైలెన్సర్లను తొలగించి వాహనదారులకు సీఐ అవగాహన కల్పించారు.ట్రాఫిక్ ఆర్ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు...

## ధర్మవరం లో వైఎస్సార్ జయంతి వేడుకలు

ప్రత్తిపాడు

కాకినాడ జిల్లా పత్తిపాడు నియోజకవర్గం ధర్మవరం గ్రామంలో నియోజవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,నరసాపురం పార్లమెంట్ ఇంచార్జ్ ముదునూరి మురళి కృష్ణంరాజు ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకులు నిర్వహించారు..అనంతరం వైయస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి,కేక్ కట్ చేసి,250 పేద ప్రజలకు వస్త్రాలు పంపిణీ చేశారు..ఈకార్యక్రమంలో నియోజవర్గం పరిధిలోని వైయస్సార్ పార్టీ నాయకులు,అభిమానులు పాల్గొన్నారు..

## ఆర్ధరాత్రి వైఎస్సార్ విగ్రహం పెట్టిన వైకాపా నేతలు

### తొలగించిన జీవీఎంసి అధికారులు

అనకాపల్లి

అనకాపల్లి పట్టణ గవరపాలెం అరుంధతి నగర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రాత్రికి రాత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వెలిసింది. వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా అర్ధరాత్రి సమయంలో రాజశేఖరరెడ్డి విగ్రహం వైఎస్ఆర్సిపి కార్యకర్తలు ఏర్పాటు చేసారు. అభ్యంతరం తెలిపిన కూటమి నాయకులు, విగ్రహం తొలగించాలని జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసారు. దాంతో జీవీఎంసీ అధికారులు రాజశేఖర్ రెడ్డి విగ్రహం తొలగించారు.

## ఎస్పీకి పిర్యాదు చేసిన వైకాపా నేతలు

నెల్లూరు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వైసిపీ నేతలు వచ్చారు. తన నివాసం పై టిడిపీ శ్రేణుల చేసిన దాడిపై ఎస్పీ కార్యాలయానికి ప్రసన్న కుమార్ రెడ్డి, అనిల్ యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, ఆనం విజయ్ కుమార్ రెడ్డి పిర్యాదు చేసారు.అనిల్ యాదవ్ మాట్లాడుతూ దాడిపై నిన్ననే పిర్యాదు చేశాం. ఇప్పటి వరకూ పోలీసుల నుండి ఎలాంటి స్పందనా లేదు. ఎఫ్ఐఆర్ కూడా కట్టలేదు. ఇది ప్రసన్న కుమార్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నం. విమర్శలలో ఎదైన అభ్యంతరం వుంటే చట్టపరంగా వెళ్ళాలి. ప్రసన్న కుమార్ రెడ్డి ఏమి మాట్లాడాడు ? వేమిరెడ్డిని జాగ్రత్తగా వుండాలి అని సూచించారు. రోజా పై టిడిపీ చేసిన వ్యాఖ్యలు ఏమైయ్యాయి. ఒక మహిళ ఎమ్మెల్యే మాజీ మంత్రులను ఎమ్మెల్యేలను వాడు వీడు అని మాట్లాడొచ్చా. డబ్బుంది కాబట్టి డబ్బునోళ్లు అన్నం దాంట్లో తప్పేముంది. ప్రసన్న కుమార్ రెడ్డి గారు మాట్లాడిన మాటలను మీరు తప్పుగా ఆలోచన చేస్తున్నారు అందుకే మీకు అలా అర్థం అవుతున్నాయి. దాడిలో పాల్గొన్న వారితో పాటు వేమిరెడ్డి దంపతులపై హత్యాయత్నం కేసు కట్టాలని అన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 % రిజర్వేషన్లు అమలు చేయాలి

హైదరాబాద్రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని తిరుగుతున్న రాహుల్ గాంధీ తెలంగాణలో ఆర్టికల్ 243ఆని అమలు చేయాలని మరియు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో 42% రిజర్వేషన్ను అమలు చేయాలని రేవంత్ రెడ్డిని ఆదేశించాలని కోరుతున్నారని జాగృతి అధ్యక్షురాలు టిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు.

# బీఆర్ఎస్ తో టీడీపీ చెట్టా పట్టాల్...?

హైదరాబాద్, జూలై 8

తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అత్యంత కీలకంగా మారింది. మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ గెలుపు కోసం అన్ని రకాల వ్యూహాలను అమలు చేస్తున్నాయి. మూడు పార్టీలకూ ఉపఎన్నిక అత్యంత కీలకమే. ఎవరు గెలిస్తే వారికి ప్రజామోదం లభిస్తోందన్న ప్రచారం జరుగుతోంది. అందుకే ఆరు నూరైనా జూబ్లిహిల్స్‌లో గెలవాలన్న పట్టుదలగా అన్ని పార్టీలు ఉన్నాయి. బీఆర్ఎస్ పార్టీకి జూబ్లిహిల్స్ ఉపఎన్నిక అత్యంత ప్రతిష్టాత్మకం. ఇది ఆ పార్టీకి సిట్టింగ్ సీటు. ఇప్పటికే సిట్టింగ్ సీటు కంటోన్మెంట్ ను ఆ పార్టీ కోల్పోయింది. ఇప్పుడు జూబిహిల్స్ కోల్పోతే .. ఇప్పటికే ఆ పార్టీ పరిస్థితి డెడ్ అయిందని అది మరోసారి నిరూపితం అయిందని కాంగ్రెస్ నేతలు ఎగతాళి చేయడం ప్రారంభిస్తారు. అందుకే జూబ్లిహిల్స్ ఉపఎన్నికను బీఆర్ఎస్ ప్రెసిడెంట్ కేసీఆర్ సీరియస్ గా తీసుకున్నారు. మాగంటి గోపీనాథ్ మొదట తెలుగుదేశం పార్టీ తరపున గెలిచారు. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి టీడీపీలో ఉన్న ఆయన.. 2014లో పోటీ చేసే అవకాశాన్ని పొందారు. విజయం సాధించారు. ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల్లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మరో రెండు సార్లు గెలిచారు. అయితే ఈ రెండు సార్లు గెలుపులో ఆయనకు టీడీపీ సానుభూతిపరుల సపోర్టు బాగా ఉపయోగపడింది. అయితే మజ్లిస్ పార్టీ మద్దతు కూడా ఉపయోగపడింది. మాగంటి గోపీనాథ్ కోసం.. టీడీపీ సానుభూతిపరులు బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి ఉంటారని. ఈ సారి ఎవరు అభ్యర్థి అయినా బీఆర్ఎస్ కు ఓటు వేయరన్న ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో మజ్లిస్ పార్టీ కూడా బీఆర్ఎస్ పార్టీకి దూరం అయింది. ఈ క్రమంలో టీడీపీ మద్దుత కోసం కేసీఆర్ ప్రయత్నించారని కాంగ్రెస్ నేత సామ



రామ్మోహన్ రెడ్డి ఆరోపణలు చేశారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో లోకేష్ హాజరయినప్పుడు.. కేటీఆర్ కూడా వెళ్లారని.. అక్కడ అర గంట సేపు చర్చలు జరిపారని అంటున్నారు. మొత్తం రెండు సార్లు సమావేశం జరిగిందని అంటున్నారు. మాగంటి గోపీనాథ్ కుటంబసభ్యులకే టిక్కెట్ ఇస్తామని.. టీడీపీ తరపున సహకరించాలని కోరినట్లుగా చెబుతున్నారు. అయితే ఈ అంశంపై బీఆర్ఎస్ వర్గాల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఖండించడం కూడా చేయలేదు. ఈ అంశంపై స్పందిస్తే ఇంకా ఎక్కువ ప్రచారం జరుగుతుందన్న ఉద్దేశంతో సైలెంట్ గా ఉన్నారని అంటున్నారు. అయితే అంతర్గతంగా మాత్రం.. జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో టీడీపీ ప్రభావం ఏమి ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. టీడీపీకి ఎంత మద్దతు ఉంటుదో వైసీపీకీ అంతే ఉంటుందని తమ పార్టీకి ఎప్పుడూ వైసీపీ మద్దతుగానే ఉంటుందని గుర్తు చేస్తున్నారు. లోకేష్ ను మద్దతు అడిగే పరిస్థితి రాదని చెబుతున్నారు. తెలుగుదేశం పార్టీ వర్గాలు కూడా ఇంకా స్పందించలేదు.

# నాలుగు పార్టీలకు ఉపఎన్నిక పరీక్ష

హైదరాబాద్, జూలై 8,

తెలంగాణ కాంగ్రెస్ కు నిజంగా ఇది అగ్ని పరీక్ష. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో గెలుపు కాంగ్రెస్ కు అనివార్యంగా ఉండాలి. లేకపోతే పార్టీ నాయకత్వంపై అసంతృప్తులు మరింత పెరుగుతాయి. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ఆరు నెలల్లోనే జరుగుతుంది. మాగంటి గోపీనాథ్ మరణంతో ఉప ఎన్నిక అనివార్యమయింది. అయితే గతంలో సిట్టింగ్ శాసనసభ్యుడు మరణిస్తే ఉప ఎన్నికలో ఏకగ్రీవం కావడం సంప్రదాయంగా వస్తుంది. కానీ కంటోన్మెంట్ ఉప ఎన్నిక తర్వాత అది తెలంగాణలో కనిపించడ లేదు. 2023లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఉప ఎన్నిక ఏకగ్రీవం కాలేదు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ లు పోటీ చేశాయి. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గణేశ్ విజయం సాధించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ మూడు పార్టీలూ పోటీ చేయడం ఖాయంగా కనిపిస్తుంది. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం కాబట్టి ఎటూ ఆ పార్టీ తమ అభ్యర్థిని బరిలో దింపుతుంది. అలాగే బీజేపీ కూడా ఖచ్చితంగా తన పార్టీ నుంచి అభ్యర్థిని పోటీకి దింపుతుంది. ఇక కాంగ్రెస్ కూడా అధికారంలో ఉండటంతో ఖచ్చితంగా తన అభ్యర్థిని గెలిపించుకునే దిశగా ప్రయత్నిస్తుంది. అయితే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సంపన్నులు ఎక్కువగా ఉన్నట్లే పేద, మధ్య తరగతి ప్రజలు కూడా ఎక్కువగా ఉన్నారు. అందుకే ఈ నియోజకవర్గంలో గెలుపోటములను అంచనా వేయలేం. ఎందుకంటే రాష్ట్రంలో పరిస్థితులను బట్టి ఈ నియోజకవర్గ ప్రజలు వెళ్లే అవకాశాలున్నాయి. కొనసాగుతున్న సహాయక చర్యలు మైనారిటీలూ ఎక్కువే... జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో మైనారిటీల సంఖ్య కూడా ఎక్కువగా ఉంది. ఇక్కడ మైనారిటీ వర్గాలే కాకుండా ఉన్నతస్థాయి వర్గాల ప్రజలు కూడా అధికంగానే ఉండటం, కమ్మ, రెడ్డి సామాజికవర్గాలతో పాటు మిగిలిన కులాల వారు కూడా అధికంగా ఉండటంతో కాంగ్రెస్ తమకుకు అనుకూలం ఉంటుందని భావిస్తున్నారు. మరొక వైపు ప్రస్తుతం ఎంఐఎం కాంగ్రెస్ కు పరోక్షంగా మిత్రపక్షంగా ఉంది. ఎంఐఎం సహకారం కనుక కాంగ్రెస్ నేరుగా తీసుకుంటే ఇక్కడ గెలుపు కాంగ్రెస్ కు నల్లేరు మీద నడకే అవుతుంది. అదే సమయంలో ఎంఐఎం కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకునే వీలుంది. ఎంఐఎం గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ కు మద్దతుదారుగా ఉండటంతో ఆ ఓట్లు బీఆర్ఎస్ కు పోలయ్యాయి. ఇప్పుడు కాంగ్రెస్ కు సపోర్టుగా ఉండటంతో ఏం జరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది. బీజేపీని కూడా తక్కువగా అంచనా వేయడానికి లేదు. మోదీ ప్రభావంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కొంత పట్టు సంపాదించుకుంది. ఈ నేపథ్యంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఖచ్చితంగా జూబ్లీహిల్స్ గెలవాలని ఆదేశించి వెళ్లారు. అదే సమయంలో ప్రభుత్వ రెండేళ్ల పాలనకు ఇది రెఫరండంగా కూడా పార్టీ హైకమాండ్ చూసే అవకాశముంది. సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ పనితీరును జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతో బేరీజు వేసుకునేందుకు పార్టీ అధినాయకత్వానికి ఒక అవకాశం దొరుకుతుంది. అందుకే రాష్ట్ర నాయకత్వానికి అంటే ఇటు పీసీసీ చీఫ్, అటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ఒకసవాల్ అని చెప్పక తప్పదు.

# బండి ఇదేం భాష...

వరంగల్, జూలై 8, (న్యూస్ పల్స్)

కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం ముదిరింది. తన కుమారుడి దుస్తులపై విమర్శలు చేసిన కేటీఆర్ స్థాయి తన కుమారుడి కంటే తక్కువని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కేసీఆర్ కుటుంబం అవినీతి ఆరోపణలు నిరూపించాలని సవాల్ విసిరారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతిపై దాడులను సహించేది లేదని హెచ్చరించారు. బీజేపీ అధ్యక్షుడు రామచంద్ర రావు సైతం బీఆర్ఎస్ నేతల తీరును ఖండించారు. మీడియాకు రక్షణ కల్పించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేటీఆర్ స్థాయి నా కుమారుడి కంటే తక్కువ అంటూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ జిల్లా వేడిపల్లి మండలంలో పర్యటించిన మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. తన కుమారుడు ఖరీదైన దుస్తులు ధరించినందుకు బీఆర్ఎస్ పార్టీ విమర్శించడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. 'నా కొడుకు కాస్ట్లీ బట్టలు వేసుకుంటే కేటీఆర్ ఓర్వలేకపోయాడు. కేసీఆర్ కొడుకు నా కుమారుడితో కొట్లాడుతాడు. అదే అతని స్థాయి' అని మండిపడ్డారు. తమ పిల్లలు ఎవరూ ఖరీదైన దుస్తులు వేసుకోకూడదా.. బిచ్చగాళ్లలా తిరగాలా అంటూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్న వారిపై రెచ్చిపోయారు. 'మా పిల్లలు ఒక ఖరీదైన షర్ట్ వేసుకుంటే, బండి సంజయ్ వేల కోట్లు సంపాదించాడని ట్రోల్ చేస్తారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఇప్పుడిప్పుడే ఒక ఇల్లు కొన్నానని.. బీఆర్ఎస్, ముఖ్యంగా కేసీఆర్ కుటుంబం తనపై చేస్తున్న ఆరోపణలను రుజువు చేయాలని బండి సంజయ్ సవాల్ విసిరారు. 'కేసీఆర్ కొడుకును, అతని కుటుంబాన్ని సవాల్ చేస్తున్నా. మీ కుటుంబం అంతా రండి. మా కుటుంబంతో సహా వస్తాం. ఏ గుడికైనా పోదాం, బినామీలతో సహా ఆస్తులపై ప్రమాణం చేద్దాం' అని ఆయన కేటీఆర్‌కు నేరుగా సవాల్ విసిరారు. కేసీఆర్ గుండాయిజం తెలంగాణలో నడవదని, నడవనివ్వమని బండి సంజయ్ తీవ్రంగా హెచ్చరించారు. ఇటీవల ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థలపై బీఆర్ఎస్ శ్రేణులు దాడులు చేయబోతున్నట్లు వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. 'ఏబీఎన్ మీద దాడి చేస్తామని బాహాటంగా చెబుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటం సిగ్గుచేటు. తెలంగాణలో ఇకపై ఏ మీడియాపైన దాడి జరిగినా దానికి ప్రతిదాడి తప్పదు' అని బండి సంజయ్ వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ సమాజం ఇలాంటి ఊకదంపుడు హెచ్చరికలకు, దాడులకు భయపడదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, మీడియాకు అండగా నిలబడటానికి బీజేపీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన తెలియజేశారు. బండి సంజయ్ ఈ సందర్భంగా.. కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం తో కలిసి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆయన ఘాటుగా విమర్శించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఓవైసీకి చెందిన కళాశాల జోలికి వెళ్లబోమని ట్వీట్ చేయడంపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆ అధికారి నిర్ణయం సొంతమా లేక ప్రభుత్వ నిర్ణయమా..? కాంగ్రెస్ పార్టీ ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలి' అని ఆయన డిమాండ్ చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాల్లోని అనేక మంది పేదల ఇళ్లు, గుడిసెలు కూల్చివేసినప్పుడు గుర్తురాని మానవత్వం, ఇప్పుడు ఓవైసీకి చెందిన కళాశాల విషయంలో ఎందుకు గుర్తుకు వచ్చిందంటూ ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ నీతికి నిదర్శనమని బండి సంజయ్ పరోక్షంగా ఆరోపించారు. ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తూ.. మరొక వర్గాన్ని నిర్లక్ష్యం చేయడం ప్రభుత్వ పాలనా తీరును ప్రశ్నిస్తోందని ఆయన అన్నారు. ప్రజా ప్రయోజనాలను పక్కన పెట్టి, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. పేదల ఇళ్లను కూల్చివేసేటప్పుడు మానవతా దృక్పథం చూపని ప్రభుత్వం, ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన వారి విషయంలో మాత్రం ఎందుకు సున్నితంగా వ్యవహరిస్తోందని ఆయన ప్రశ్నించారు. ఈ రకమైన రాజకీయాలు సమాజంలో అసమానతలకు దారితీస్తాయని, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజలు ఈ ద్వంద్వ వైఖరిని గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో దీనికి తగిన గుణపాఠం చెబుతారని బండి సంజయ్ అన్నారు. బీజేపీ ఎప్పుడూ ప్రజా సమస్యల పక్షాన నిలబడుతుందని, ఎలాంటి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడదని ఆయన స్పష్టం చేశారు.

# గోడ తీస్తే 3.. మూస్తే 8 కి.మీ.. అడ్డుగోడపై

## 'హైడ్రా' కొరడా, 25 వేల మందికి ఊరట

వరంగల్, జూలై 8,

గ్రేటర్ హైదరాబాద్‌లో అక్రమణల తొలగింపునకు హైడ్రా కఠిన చర్యలు తీసుకుంటోంది. మెరుగైన రవాణా సౌకర్యాల కోసం వందల నిర్మాణాలను కూల్చివేసింది. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లకు అడ్డుగా గోడలు కట్టిన గేటెడ్ కమ్యూనిటీలపై హైడ్రా చర్యలు మొదలుపెట్టింది. తాజాగా.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మల్లంపేట-బాచుపల్లి మధ్య ప్రణీత్ ఆంటిల్యా కాలనీ కట్టిన అడ్డుగోడను హైడ్రా తొలగించింది. హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం ప్రణీత్ ఆంటిల్యా గేటెడ్ కమ్యూనిటీ కాదని.. దారిని అడ్డుకోవద్దని అధికారులు స్పష్టం చేయడంతో ప్రజల ఏళ్లనాటి పోరాటానికి న్యాయం దక్కింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ఇప్పటికే వందల ఇండ్లు, నిర్మాణాలను నేలమట్టం చేసింది. ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు హైడ్రా కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. నగరంలోని పలు గేటెడ్ కమ్యూనిటీలు, ప్రైవేట్ వెంచర్లు నిబంధనలకు విరుద్ధంగా రోడ్లకు అడ్డంగా గోడలు నిర్మించడం వల్ల ప్రజలు దీర్ఘకాలంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పలు కాలనీల్లో అడ్డగోడలను కూల్చివేసి, దారులు లేని ప్రాంతాలకు రోడ్లు నిర్మిస్తోంది. తాజాగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలంలోని మల్లంపేట- బాచుపల్లి మధ్య నెలకొన్ని ఓ దారి వివాదానికి పరిష్కారం చూపింది. ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 4 నుంచి మల్లంపేట, బాచుపల్లి క్రాస్‌రోడ్స్ మీదుగా ప్రగతినగర్‌కు చేరుకోవడానికి ఉన్న సులభమైన మార్గానికి ప్రణీత్ ఆంటిల్యా అనే కాలనీ నివాసులు అడ్డుగా గోడ కట్టడంతో వేలాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి ఎగ్జిట్ నుంచి ప్రగతినగర్‌కు కేవలం 3 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. అయితే ప్రణీత్ ఆంటిల్యా కట్టిన అడ్డుగోడ కారణంగా సుమారు 25,000 మందికి పైగా ప్రజలు 8 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. మల్లంపేట గ్రామ ప్రజలతో పాటు, ప్రణీత్ లీఫ్ కాలనీ, ఆకాష్ వెంచర్, డ్రీం వ్యాలీ కాలనీ, గ్రీన్‌పార్కు కాలనీ, సాయినగర్ కాలనీ, బృందావన్ కాలనీ, ఏపీఆర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, లక్ష్మి శ్రీనివాస్ కాలనీ, హెచ్ ఎండీఏ తో పాటు మరిన్ని కాలనీల వాసులు ఈ అడ్డుగోడ తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. గోడ తొలగిస్తే 40 నుంచి 60 అడుగుల వెడల్పుతో కూడిన దారి లభిస్తుందని వారు పేర్కొంటున్నారు. గతంలో ఈ ప్రాంతం గుండా బండ్ల బాట ఉండేదని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఈ మేరకు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ప్రణీత్ ఆంటిల్యా నివాసులు మాత్రం తమ కాలనీ గుండా రాకపోకలు పెరిగితే ఇబ్బందులు పడతామని, తమకు గోస మొదలవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదంపై స్పందించిన హైడ్రా... లోతైన పరిశీలన చేసింది. హెచ్ ఎండీఏ అనుమతులు పరిశీలించగా.. ప్రణీత్ ఆంటిల్యా గేటెడ్ కమ్యూనిటీ కాదని స్పష్టమైంది. అనుమతుల్లో 7వ అంశం ప్రకారం.. నివాస ప్రాంతాలకు చుట్టూ ప్రహరీ నిర్మించరాదని, ముఖ్యంగా రహదారులకు అడ్డంగా గోడలు నిర్మించరాదని, పక్కన ఉన్న కాలనీవాసులకు దారి చూపాలని స్పష్టంగా ఉంది. ఈ నిబంధనల ఆధారంగా హైడ్రా ఇటీవల అక్కడి ప్రహరీలను తొలగించింది. అయితే ప్రణీత్ ఆంటిల్యా కాలనీ వాసుల అభ్యంతరాలతో మరింత లోతుగా అధ్యయనం చేసింది. రెవెన్యూ అధికారులు కూడా ప్రణీత్ ఆంటిల్యా నివాసాల మధ్య నుంచే గతంలో బండ్ల దారి ఉండేదని ధృవీకరించారు. నిజాంపేట మున్సిపల్ అధికారులు కూడా ఇది గేటెడ్ కమ్యూనిటీ కాదని నిర్ధారించారు. దీంతో హైడ్రా, మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఇరుపక్షాలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రణీత్ ఆంటిల్యా గేటెడ్ కమ్యూనిటీ కాదని, దారి ఇవ్వాల్సిందేనని స్పష్టంగా నిర్ణయించారు. ఈ నిర్ణయంతో మల్లంపేట ప్రజల ఏళ్ల నాటి పోరాటానికి న్యాయం దొరికింది.

# కార్పొరేషన్ లో విలీనం కానున్న మేడ్చల్ జిల్లా

హైదరాబాద్, జూలై 8స్)

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మరో కొత్త రూపు సంతరించుకోనుంది. ఇప్పటికే 24 నియోజకవర్గాలు, 150 డివిజన్లతో విస్తరించి ఉన్న గ్రేటర్ లో తాజాగా గ్రామ పంచాయతీలు లేని జిల్లాగా రూపుదిద్దుకున్న మేడ్చల్ జిల్లాలోని మున్సిపాలిటీలను విలీనం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మేడ్చల్ జిల్లాలో ఇప్పటికే ఉన్న 10 మున్సిపాలిటీలు, 4 కార్పొరేషన్లతో పాటు, కొత్తగా ఏర్పడిన 3 మున్సిపాలిటీలు కూడా గ్రేటర్‌లో భాగం కావడం వల్ల హైదరాబాద్ సరిహద్దులు మరింత విస్తరించి, మహానగర అభివృద్ధి వేగంగా జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్ నగరానికి ఆనుకుని వేగంగా విస్తరిస్తున్న మేడ్చల్ జిల్లా రూపు రేఖలు మారిపోనున్నాయి. మరింత వేగంగా ఆ జిల్లా అభివృద్ధి చెందనుంది. మేడ్చల్ జిల్లాను పూర్తిగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విలీనం చేసేందుకు పురపాలక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. వేగవంతమైన అభివృద్ధి కోసం, ముఖ్యంగా సికింద్రాబాద్ నుంచి తూంకుంట, అలాగే సికింద్రాబాద్ నుంచి కొంపల్లి వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ల పనులను వేగంగా పూర్తిచేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మేడ్చల్ జిల్లా పరిధిలో ఇప్పటికే 4 శాసనసభ నియోజకవర్గాలు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్నాయి. వీటికి అదనంగా జిల్లాలో 10 మున్సిపాలిటీలు, 4 కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిని మినహాయిస్తే కేవలం 34 పంచాయతీలు మాత్రమే ఉండగా.. వాటిని కూడా కలిపి 3 కొత్త మున్సిపాలిటీలుగా (అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట) మార్చారు. దీంతో మేడ్చల్ జిల్లా ఇకపై గ్రామాలు లేని జిల్లాగా రూపుదిద్దుకుంది. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల రికార్డులను పురపాలక శాఖకు అప్పగించారు. పంచాయతీల్లో కార్యదర్శులుగా పనిచేసినవారు, ఎంపీడీవోలను నేరుగా పురపాలక శాఖలో విలీనం చేస్తున్నారు. వారి సర్వీస్ సంవత్సరాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. సిబ్బంది ఎక్కువగా ఉన్న మున్సిపాలిటీల్లో పంచాయతీరాజ్ శాఖ సిబ్బందిని మాతృశాఖకు పంపుతున్నారు. పంచాయతీల్లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసిన వారికి వార్డుల్లో పనివిధానం, ఇతర కార్యకలాపాలను బట్టి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. సర్వే లెక్కలు, పన్నుల వసూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పనిచేసిన అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా ఉద్యోగాలు ఇస్తున్నారు. అయితే, 34 పంచాయతీలు మున్సిపాలిటీలుగా మారడంతో ఉపాధి హామీ పథకం ఇకపై ఈ ప్రాంతాలకు వర్తించదు. మేడ్చల్ జిల్లాలో 17 వేల జాబ్ కార్డులుండగా.. క్రియాశీలకంగా పనిచేసే 6 వేల మందికి ఏటా రూ.3 కోట్ల వరకు చెల్లించేవారు. ఉపాధి హామీ లేనందున, మున్సిపల్ అధికారులు హరితవనాల అభివృద్ధి నిధుల కింద మొక్కలు నాటించి కూలీ చెల్లించే ప్రత్యామ్నాయాన్ని సిద్ధం చేశారు.

జిల్లా గ్రేటర్‌లో విలీనం కావడం వల్ల మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి సేవలు మెరుగుపడతాయి. సికింద్రాబాద్-తూంకుంట, సికింద్రాబాద్-కొంపల్లి ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ పనులు మరింత వేగంగా పూర్తవుతాయి. ఇది ఉత్తర హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గిస్తుంది. గ్రేటర్‌లో విలీనం అయిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అర్బన్ డెవలప్‌మెంట్ కింద వచ్చే నిధులు మేడ్చల్ జిల్లాకు సులభంగా అందుబాటులోకి వస్తాయి. అర్బన్ బాడీగా మారిన తర్వాత ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందుతాయి. వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థలు మెరుగుపడతాయి. ఈ విలీనం ప్రతిపాదన చాలా కాలంగా ఉన్నప్పటికీ, ఇప్పుడు ఎలివేటెడ్ కారిడార్ల పనుల వేగం దృష్ట్యా ఇది ఆచరణ రూపం దాల్చుతోంది. ఈ నిర్ణయం మేడ్చల్ జిల్లా భవిష్యత్ అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుందని అధికారులు భావిస్తున్నారు.

# ఆషాఢ మాస బోనాలు ఉత్సవాల సందర్భంగా అధికారులతోమంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం

హైదరాబాద్

అంబర్ పేట నియోజకవర్గంలో వివిధ ఆలయాలకు చెక్కులు పంపిణీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ బలమురి వెంకట్, కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్, కార్పొరేటర్లు, ఆలయ కమిటీ, ఇతర ముఖ్య నేతలు, పోలీస్ రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ వివిధ విభాగాల అధికారులు:మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.మహంకాళి అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలిఅధికారులు విధి నిర్వహణలో ఎక్కడ లోపం లేకుండా చూసుకోవాలి..గత సంవత్సరం జరిగిన తప్పిదాలు పునరావృతం జరగకుండా చూసుకోవాలి.రోడ్డు సమస్యను వర్షం లేనప్పుడు 48 గంటల్లో పూర్తి చేయాలిగత నెల 26 వ తేదీన గోల్కొండ బోనాలతో ఆషాఢ మాస బోనాలు ప్రారంభం అయ్యాయి.జూలై 1 వ తేదీ బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం13 వ తేదీ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు20 వ తేదీ లాల్ దర్వాజా బోనాలు ఉత్సవాలు జరుగుతున్నాయి.జంట నగరాల్లో 3 వేలకు పైగా దేవాలయాల్లో బోనాల ఉత్సవాల పూజలు జరగనున్నాయిబోనాల ఉత్సవాల కు ఎక్కడ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం.నగరంలో పోలీస్, ట్రాఫిక్, జీహెచ్ ఎంసీ, రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు సమన్వయం చేసుకొని పని చేయాలి.ఆషాఢ మాస బోనాలు సందర్భంగా అధికారులు డ్యూటీ కాకుండా గొప్ప సేవ చేసే అవకాశం దొరికిందిఆషాఢ మాస బోనాలు ఉత్సవాల్లో విధి నిర్వహణలో ఎక్కడ అలసత్వం లేకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలి.గోల్కొండ బోనాలు, బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, ఎక్కడ ఇబ్బందులు లేకుండా జరిగాయిబోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం 20 కోట్లు విడుదల చేసింది.అన్ని దేవాలయాల కు ఖర్చు కోసం ఇప్పటికే చెక్కులు పంపిణీ చేయడం జరిగిందిజంట నగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం తరుపున మంత్రులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.పోలీసులు ఎక్కడ ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలిఈవ్ టీజింగ్ లేకుండా మహిళా పోలీసులను ఏర్పాటు చేయాలి.అమ్మవారి ఊరేగింపు రోజు రోప్ ఏర్పాటు చేసి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేయాలినల్ల పోచమ్మ దేవకాయం వద్దకు బోనాలు తీసుకెళ్లే మహిళా భక్తులకు చైన్ స్నాచింగ్ జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలి.ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఈ సంవత్సరం ఫ్లై ఓవర్ ప్రారంభం అయింది కాబట్టి ట్రాఫిక్ డైవర్షన్ చేసుకోవాలిసిపి ఎల్ రోడ్డు గుండా ట్రాఫిక్ మళ్లింపు చేయాలి, సోమవారం అమ్మవారి ఊరేగింపు రోజు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి.శానిటేషన్ కోసం అదనంగా బృందాలు ఏర్పాటు చేయాలి మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలిజల మండలి దేవాలయం వద్ద డ్రైనేజీ లీకేజీ లు లేకుండా చూసుకోవాలి. మంచి నీటి పాకెట్ లు అందించాలిప్రత్యేక జనరేటర్ ఏర్పాటు చేయాలి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి.మహంకాళి ఆలయం వద్ద వాటర్ ప్రూఫ్ స్టేజి ఏర్పాటు చేయాలి.. బారికేడ్లను ఏర్పాటు చేయాలిఆర్టీసీ బస్సులు మహంకాళి ఆలయం వైపు వచ్చేలా చూసుకోవాలి.అంబులెన్స్ ఏర్పాటు చేయడం తో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలిఅగ్ని ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి ఫైర్ ఇంజన్ లతో పాటు ఎమర్జెన్సీ బృందాలు ఉండాలి.అమ్మవారికి సేవ చేసుకునే అవకాశం వస్తుందనుకొని పనుల్లో నిమగ్నం కావాలిమహంకాళి ఆలయం,నల్ల పోచమ్మ ఆలయం, ముత్యాలమ్మ ఆలయం వద్ద వేదికలు ఏర్పాటు చేయాలి.

# మిడుతల దండులా డ్రామాలు చేస్తున్న కేటీఆర్

**- ఇంటి ఆడబిడ్డని ఓర్వలేనోడు బయటి ఆడబిడ్డలను ఎలా ఎదిగనిస్తాడు : మంత్రి సీతక్క**



ములుగు జిల్లా ప్రతినిధి, జులై 8 (భారత శక్తి): ములుగు నియోజకవర్గంలో శాంతి వాతావరణం లో అభివృద్ధి జరుగుతుంటే ఓర్వలేక భారతీయ రాష్ట్ర సమితి తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు మిడుతల దండల డ్రామాలుచేస్తున్నాడని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని అతిథి గృహంలో మంత్రి సీతక్క మంగళవారం మీడియా సమావేశంలో తీవ్రవ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నేత కేటీఆర్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తాను ఆదివాసి మహిళనని చూడకుండా కావాలని లక్ష్యంగా చేసుకొని రాజకీయ దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సమ్మక్క సారక్క వారసులం మేము, మా జోలికి వస్తే నాశనమైపోతావ్ కేటీఆర్ అని సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. నీ అహంకారం నీ సొంత చెల్లెనే ఓర్చలేని స్థాయిలో ఉన్నావు, బయట ఆడబిడ్డల ఎలా ఎదగనిస్తావని మంత్రి వ్యాఖ్యానించారు. 70 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా కోయ వర్గానికి మంత్రి పదవి లభించిందని, అదే తనకు ఓ బాధ్యతగా భావించి ములుగు అభివృద్ధికి కృషి చేస్తున్నానని సీతక్క తెలిపారు. నేను ఎలాంటి తప్పు చేసినా, అసెంబ్లీలో చర్చ పెట్టి నిలదీయండి అని, పక్క నియోజకవర్గాల నుంచి ప్రజలను తీసుకొచ్చి రోడ్లమీద పోరాటాలు చేస్తే ప్రజలు మూరు?లని అనుకుంటారా ? అని ప్రశ్నించారు. ములుగులో ఇప్పుడు ప్రజారాజ్యం నడుస్తోంది అని, ఇదే నిజమైన ఇందిరమ్మ పాలన అని ఆమె తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత అభివృద్ధిని ఓర్చలేక బదాలు వెతుక్కుంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నదని విమర్శించారు. మీ ప్రభుత్వంలో ఎందరో ఆత్మహత్యలు చేసుకున్నారు అని, ఇప్పుడు మీరు సీతక్క పై పోలీస్ రాజ్యం అంటూ ప్రచారం చేస్తే ప్రజలు నమ్మరా అని, మా పాలనలో ఎవ్వరి పై తప్పుడు కేసులు పెట్టలేదు అని, నిజంగా పెట్టి ఉంటే లెక్కలు చూపించండి అంటూ సవాల్ విసిరారు. డిజిటల్ మీడియా వేదికల ద్వారా దుబాయ్లాంటి ప్రాంతాల్లో స్టూడియోల్లో కూర్చుని తప్పుడు కథనాలు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారు అని ఈ నీచరాజకీయాలకు సమాధానం ప్రజలే చెబుతారు అంటూ ఆమె హెచ్చరించారు. ములుగులో అభివృద్ధి అగమ్యగోచరంగా మారుతుందని తెలుసుకొని బీఆర్ఎస్ పార్టీ తప్పుడు రాజకీయాలకు దిగుతుంది అని, కానీ నేనేమీ భయపడను, ప్రజలే నా బలం, ఆదివాసుల హక్కులే నా ధ్యేయం అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# ఘనంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి 76 వ జయంతి వేడుకలు



మందమర్రి టౌన్,జులై 08, (భారత శక్తి):ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 76 వ జయంతి సందర్భంగా రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నాయకులు సొతుకు సుదర్శన్, పైడిమల్ల నర్సింగ్ కేక్ కట్ చేసి వైయస్సార్ జయంతి వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో %ాజ% సెల్ పట్టణ అధ్యక్షులు నెరువట్ల శ్రీనివాస్, సేవాదళ్ పట్టణ అధ్యక్షులు సొతుకు ఉదయ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కదలి శ్రీనివాస్ ( గుడ్ల శ్రీనివాస్ ), యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు మాయ తిరుపతి యాదవ్, సీనియర్ నాయకులు ఆలం శంకర్, గోగుల రాజయ్య, ఎర్ర రాజు, ముడారపు శేఖర్, విజయ్, షరీఫ్, రాచర్ల రవి, బీరం శ్రీనివాస్, పోలు సంపత్, రాకం సంతోష్, రంజిత్, నాంపల్లి వేణుగోపాల చారి, రాం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇటుకలపాడు గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



భారత శక్తి ప్రతినిధి, కడప, జూలై 8: వైయస్సార్ కడప జిల్లా శ్రీ అవధూత కాశినాయన మండలం ఇటుకలపాడు గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31 వ ఆవిర్భావ దినోత్సవం మరియు పద్మ శ్రీ మంద క్రిష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. %వీ్రా% గ్రామ కమిటీ నాయకులు మద్దూరి యువ మాదిగ, యంబడి రాజేష్ మాదిగ, వీరపోగు రాజు మాదిగ, యంబడి కైలాష్ మాదిగ,యంబడి చరణ్ మాదిగ, ఈరి శంకర్ దాదా మాదిగ, యంబడి పోలయ్య మాదిగ, జాలా చిన్న పుల్లయ్య మాదిగ, జాలా ఓబులేసు మాదిగ ,తంగేల్ల వినోద్ మాదిగ, లక్కినేని మధు మాదిగ, కత్తి బుజ్జి మాదిగ, యంబడి సమురి మాదిగల ఆద్వర్యంలో మాదిగ దండోరా జెండా దిమ్మె ఏర్పాటు చేయడ%శీ% జరిగింది,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు శ్రీ ఎంబడి ఈశ్వర్ మాదిగ గారు హాజరై జెండా ఆవిష్కరణ చేశారు.అదే విధంగా పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా గ్రామ యువత బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇటుకలపాడు గ్రామ ఎమ్మార్పీఎస్ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు, యువకులు మరియు మహిళలు పాల్గొని దండోరా ఆవిర్భావ దినోత్సవం మరియు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవాన్ని వేడుకగా జరుపుకున్నారు.

# మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి సమక్షం లో దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి 76 వ జన్మదిన వేడుకలు



పోరుమామిల్ల, భారత శక్తి ప్రతినిధి,జూలై 8: ఈరోజు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ పుట్టినరోజు సందర్భంగా పోరుమామిళ్లలోని కృష్ణ శారద డిగ్రీ కళాశాల నందు దివంగత నేత కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మరియు మాజీ ప్రభుత్వ సలహా దారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి ఎలక్షన్లకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడం జరిగిందని మొదటి సంతకం రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడం, విద్యార్థిని విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వడం వల్ల సామాన్య కుటుంబంలో పుట్టిన వారు కూడా డాక్టర్లు, ఇంజనీర్లు, పీజీ లు చేయడం జరిగిందని వారు అన్నారు. ఇప్పుడు చాలామంది విదేశాల్లో సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుగా, డాక్టర్లగా పనిచేస్తున్నారని అప్పుడు రాజశేఖర్ రెడ్డి ఫీజు రిబర్స్మెంట్ పెట్టకుండా ఉంటే ఇలా చదువుకొని అమెరికాకు వచ్చేవారం కాదని, నేను అమెరికాకు పోయినప్పుడు చాలామంది అన్నారని,రాజీవ్ ఆరోగ్యశ్రీ నీ దేశంలో మొదటిసారి తీసుకువచ్చి సామాన్యులకు కూడా వైద్యం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందడం, ఎంతోమంది ప్రాణాలను కాపాడుకోవడం జరిగిందని అన్నారు.

ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరిగిందని, అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందని హెలికాప్టర్ ప్రమాదంలో వైయస్సార్ చనిపోయినప్పుడు వందలాదిమంది అభిమానులు ఆ వార్తను తట్టుకోలేక చనిపోయారని,తండ్రికి తగ్గ తనయునిగా వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గ్రామసచివాలయ వ్యవస్థ స్థాపించి ఒక లక్ష 30 వేల మంది యువకులకు ఒకే నోటిఫికేషన్ లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగింది .

పరోక్షంగా రెండు లక్షల 50 వేల మందికి వాలంటరీ ఉద్యోగ అవకాశా లను కల్పించారు. ఇంకా చాలా ప్రభుత్వ ఉద్యోగాలు అవకాశం కల్పించారని అన్నారు . వైయస్ రాజశేఖర్ రెడ్డి మనమధ్య భౌతికంగా లేకున్నా ప్రజల హృదయాల్లో చిరస్తాయిగా నిలిచిపోయారని ఆయన అన్నారు.

# మైదుకూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ,ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్



మైదుకూరు, భారత శక్తి ప్రతినిధి, జూలై 8:మైదుకూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ,ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు ఇస్తున్నాం, అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచిత సిలిండర్లు ఇస్తున్నాం,ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనమిస్తున్నాం, ప్రజల కళ్ళల్లో ఆనందం చూస్తున్నామని తెలిపారు. అన్నదాత సుఖీభవ కూడా త్వరలోనే అందించబోతున్నాం అని అన్నారు.

అనంతరం ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు ఇస్తున్నాం, అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచిత సిలిండర్లు ఇస్తున్నాము, ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనమిస్తున్నాం,ప్రజల కళ్ళల్లో ఆనందం చూస్తున్నాము. అన్నదాత సుఖీభవ కూడా త్వరలోనే అందించబోతున్నాం అని అయన అన్నారు. ఈ కార్యక్రమములో టీడీపీ మైదుకూరు నాయకులు పాల్గొన్నారు.

# వెంచర్ల అభివృద్ధి పేరిట గీత కార్మికుల పొట్ట కొట్టొద్దు: తోటకూర వజ్రేష్ యాదవ్



ఘట్కేసర్, భారత శక్తి ప్రతినిధి, జూలై 08:వెంచర్ల అభివృద్ధి పేరిట తాటి చెట్లను కూల్చివేసి గీత కార్మికుల పొట్ట కొట్టొద్దని మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ కొర్రెముల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 311, 312, 313, 324,326 పి,327 పి లో దాదాపు 12 ఎకరాల్లో హెచ్ఎండిఎ లేఔట్ చేస్తున్న నిర్వాహకులు కొర్రెముల గీత కార్మిక సంఘానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా 85 తాటి చెట్లను తొలగించినందుకు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. మంగళవారం దీక్షా శిబిరానికి మద్ధతుగా మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతి తో పాటు జిల్లా కలెక్టర్ నుంచి ఎన్ఒసి తీసుకున్నప్పటికీ గీత కార్మిక సంఘం తీర్మానం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. తాటి చెట్లను తొలగించేందుకు ఒక్కో చెట్టుకు దాదాపు రూ.897/- చొప్పున 85 చెట్లకు సుమారు రూ. 80 వేలు సంఘానికి చెల్లించడం సరైన పద్ధతి కాదన్నారు. తాతలనాటి నుండి 85 తాటి చెట్లను నమ్ముకొని 300 పైగా కుటుంబాలు జీవనం పొందుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, పల్లె బాబు రావు గౌడ్, దేశం బాలరాజ్ గౌడ్, కుర్ర విగ్నేశ్వర్ గౌడ్,అనిల్ గౌడ్, కట్ట దర్శన గౌడ్, భాస్కర్ గౌడ్, నగేష్ గౌడ్, వెంకట్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ దళిత కుటుంబాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి నిర్ణయం

**-ల్యాండ్ పూలింగ్ ద్వారా అర్ధిక ప్రగతికి మార్గం సుగమం**

**-ముఖ్యమంత్రి కార్యాలయం నుండి కలెక్టర్ కు ఉత్తర్వులు జారీ**



ఉప్పల్, భారత శక్తి ప్రతినిధి, జూలై 08:ఎండ్ల తరబడి నిరీక్షిస్తున్న బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని 60 దళితుల కుటుంబాల్లో గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి నిర్ణయంతో వెలుగులు నిండాయి. బోడుప్పల్ సర్వే నెంబరు 63/2 నుండి 63/25 లోని 336 ఎకరలా భూమి నాడు సాగు చేసుకుని జీవనం సాధించేందుకు నాడు ఇందిరమ్మ భూమి పంపిణీ చేశారు. నేడు కాలం మారింది గ్రామం నగరంగా రూపాంతరం చెందింది. వ్యవసాయం చేసే వీలు లేదు కావునా సదు దళితుల భూమి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ ద్వారా ఎకరానికి 600 గజాల చొప్పున ఇచ్చేలా సర్కారు చెప్పడంతో అ రైతులు స్వచ్ఛందంగా ఒప్పుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ద్వారానే మా రైతుల కుటుంబాలు అర్ధిక ప్రగతి సాధిస్తాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ చేసిన కృషి మరువలేనిదని ఆయనను కొనియాడారు. మంగళవారం నాడు భూ యజమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి ని కలిసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మరో పదిహేను రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన అదేశాల మేరకు ప్రతిరైతకు భూ యాజమాన్యం హక్కులకు సంబంధించిన పత్రాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు మహేష్ గౌడ్,మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బీ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రాపోలు ఉపేందర్, మాజీ కార్పొరేటర్ చీరల నరసింహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు చీరాల జంగయ్య, దానగళ్ల యాదగిరి, రాపోలు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఈ.వి. ఎం. గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 08: సాధారణ తనిఖీలో భాగంగా ఈ.వి. ఎం. గోదామును పరిశీలించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. భారత ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు మంగళవారం ఈ.వి.ఎం. గోదామును సందర్శించి సిసి కెమెరాను, ఇతర భద్రత అంశాలను పరిశీలించి సాధారణ తనిఖీలో భాగంగా ఈ రోజు ఇవిఎం గోదాంను తనిఖీచేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, ఆర్డీఓ వీణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అనీల్ నాయబ్ తహసీల్దార్ , తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ నాయకులు బీహార్ రౌడీజాన్ని తెలంగాణలో ఇంప్లిమెంట్ చేస్తున్నారు: టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**బీఆర్ఎస్ నాయకుల మాటలు తెలంగాణ సమాజం సిగ్గుతో తల దించుకునే విధంగా ఉన్నాయి.**

**మీకు వంతపాడితే దండాలు పెడతారు, వ్యతిరేకంగా వార్తలు రాస్తే రాళ్లతో దాడులా?**

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై08:తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణకు పెట్టుబడులు తెచ్చే విధంగా కృషి చేస్తే, బిఆర్ఎస్ నాయకులు మాత్రం తెలంగాణ రాష్ట్ర ఇమేజ్ ను దెబ్బ తీసే విధంగా కుట్రలు చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ బాధ్యతలు తీసుకొని ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 3 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు,యువతకు 60 వేల ఉద్యోగాలు,పేదలకు సన్న బియ్యం, రైతు బోనస్,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రైతు భరోసా కింద తొమ్మిది రోజులలో 9000 వేల కోట్లు జమ చేసిన ఘనత రేవంత్ రెడ్డి కే దక్కుతుందని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు జైలుకు పోవడానికి సిద్ధంగా ఉండండని ఎందుకంటే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి,ఫోన్ ట్యాంపిగ్,కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తగిన గుణపాఠం ప్రజలు చెప్తారని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులవి టీవీలలో ఐదు నిమిషాలు కూడా వార్తలు రానిచ్చేవారు కాదని అన్నారు. ఇటీవల కాలంలో కేటీఆర్ భాష అనైతికంగా ప్రజలు జీర్ణించుకునే విధంగా లేకుండా ఉన్నదని ఎద్దేవ చేశారు.

# ఇందిరామహిళా శక్తిలో భాగంగా కామారెడ్డి మండల సమాఖ్య ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్







(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 08: ఇందిరా మహిళా శక్తిలో భాగంగా కామారెడ్డి మండల సమాఖ్య ప్రత్యేక సమావేశం మంగళవారం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ యొక్క సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ హాజరైనారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా శక్తిలో భాగంగా ప్రతి 18 సంవత్సరాలు నిండిన మహిళ సంఘం నందు సభ్యత్వం తీసుకోవాలి, తీసుకునేలా సిబ్బంది చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్యాడి కొనుగోలు కేంద్రాలు ఈసారి బాగా చేశారు. ఇక ముందు కొనుగోలు కేంద్రాలు పెరుగుతాయి, ఇంకా బాగా పనిచేయాలని తెలియజేశారు. ముఖ్యంగా బ్యాంకు లింకేజీ టార్గెట్ ను 100% పూర్తి చేయాలని సూచించారు. మరియు డ్రోన్ ఏర్పాటు చేసుకొని వ్యవసాయ సంబంధ ఎరువులు, పురుగు మందులు పిచికారు చేసుకోవాలని తెలియజేశారు. జిల్లా సమాఖ్య భవన నిర్మాణం మండల సమాఖ్య వారు పర్యవేక్షించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్, డిఆర్డిఓ సురేందర్, మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్, డిపిఎం ఫైనాన్స్ రాజయ్య, ఎంపీడీవో ఎఫ్సిబా, మండల సమాఖ్య ఏపీఎం మోహిజ్, సీసీలు విశ్వనాథం, అంజాగౌడ్,స్వరూప,సంజీవులు, వివో ఏలు మండల సమాఖ్య పాలకవర్గం అధ్యక్షులు గోదావరి,కార్యదర్శి సరస్వతి, కోశాధికారి పూజా, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రత,కార్మిక చట్టాల రక్షణకై జూలై 9 న దేశ వ్యాప్త సమ్మె.



మంచిర్యాల, జులై 08,(భారతశక్తి): దేశ వ్యాప్త సమ్మె ప్రచారంలో భాగంగా మంగళవారం కాసిపెట మండలంలో సిపిఎం నాయకులు సంకె. రవి ప్రచారం చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ,మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చెయ్యడం జరిగింది.రోజుకు 12 గంటలు పని చెయ్యాలని లేబర్ కోడ్ లను తీసుకు వచ్చింది.వ్యవసాయ రంగాన్ని,భూములను,ప్రకృతి సంపదను పెట్టుబడిదారులకు అప్పగించడం కోసం దొడ్డి దారిన కుట్రలు చేస్తున్నది.భారత రాజ్యాంగన్ని బలహీన పర్చడం తదనంతరం రద్దు చెయ్యడం కోసం కుట్రలు చేస్తున్నది.రాష్ట్రంలోని కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మికులు 10 గంటల నుంచి 12 గం.లు పని చెయ్యాలని %+ూ చీ% 282 తీసుకు రావడం చూస్తుంటే బీజేపీ, మోడీకి,కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాలకు ఏమీ తెడాలేదని నిరుపించుకున్నారు.రేవంత్ రెడ్డి మాటల్లో మోడీ విధానాలను విమర్చిస్తున్నడు,ఆచరణలో మోడీ బాటలో నడుస్తున్నాడు.జూలై 9 జరిగే సమ్మె లో కాసిపెట మండలంలోని అన్ని వర్గాల కార్మికులు,ప్రజలు సమ్మెలో,నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో సంకె రవి సీపీఎం మంచిర్యాల జిల్లా కార్యదర్శి,దూలం శ్రీనివాస్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు,ముడి మడుగుల బ్రహ్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కార్మికులు సాయక్క,అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 27 నుంచి కాణిపాక వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలు



తిరుపతి జిల్లా ప్రతినిధి/చిత్తూరు, జూలై 8(భారత శక్తి) : ఆంధ్ర ప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక ఉత్సవాలు ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 16 వరకు 21 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ ప్రకటించారు. ఆగస్టు 27న వినాయకచవితి, రాత్రి గ్రామోత్సవం, 28న ఉదయం ధ్వజారోహణం, రాత్రి హంస వాహనం సేవలు నిర్వహించనున్నారు. సెప్టెంబరు 5న ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయిని ఈవో పెంచల కిషోర్ తెలిపారు.

# జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దాం: ఐ ఎన్ టి యు సి మందమర్రి పట్టణ అధ్యక్షులు వడ్లకొండ రంజిత్ గౌడ్.



మందమర్రి టౌన్, జూలై 8,(భారత శక్తి):గత పదేళ్లుగా వార్షిక కార్మిక సమావేశాలు పెట్టకుండా కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని,ఎంతో మంది ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్నా కార్మిక చట్టాలను కాలరాసేవిధంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న కార్మిక వ్యతిరేక చట్టలకు నిరసనగా ఈనెల తొమ్మిదో తారీఖున జాతీయ కార్మిక సంఘాలు మరియు ప్రాంతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు చేపట్టిన సమ్మెను సంగటిత అసంగటిత కార్మికులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని ఐ ఎన్ టి యు సి మందమర్రి పట్టణ అధ్యక్షులు వడ్లకొండ రంజిత్ గౌడ్ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎన్టియుసి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి సంజీవరెడ్డి, ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి.జనక్ ప్రసాద్ మంచిరియాల్ జిల్లా అధ్యక్షులు రాంశెట్టి నరేందర్ సూచన మేరకు సమ్మెను విజయవంతం చేయడానికి ఐఎన్టియుసి ముందుండి పోరాడుతున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మోడీ నాయకత్వంలో ఆకాశంలో నడిచే విమానాలను సముద్రాల పై నడిచే నౌకలను భూమిపై నడిచే రైళ్లను భూగర్భ గనులను ఎల్ ఐ సిని మరియు చివరికి అంతరిక్షాన్ని సైతం ప్రైవేటికరణ చేసి ఆదానీ అంబానీలకు ఈ దేశ సంపదను శ్రామికశక్తిని దోచిపెట్టడానికి కుట్ర చేస్తున్నదని అన్నారు. అందులో భాగంగానే 29 కార్మిక చట్టాలను నాలుగు కోడలుగా మార్చి కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేయడం కనీస వేతన చట్టాన్ని నీరుగార్చడం పనిగంటలను పెంచడం పిఎఫ్ ను కుజించడం పని ప్రదేశాల్లో రక్షణ లేకుండా చేయడం తదితర అంశాలను జోడించి తయారుచేసిన ఈ చట్టాల వలన కార్మిక సంఘాలు నిర్వీర్యమవ్వడమే కాకుండా సమ్మె చేసే హక్కును కూడా కార్మికులు కోల్పోతారని అన్నారు.దానివలన కార్మికుల జీవితాలు దుర్భల్యమవుతాయని, అందుకే ఈ నెల 9న జరిగే సమ్మెను ఐక్యమత్యంతో అందరం పాల్గొని కార్మిక శక్తిని చూపాలని పట్టణ అధ్యక్షులు రంజిత్ గౌడ్ కోరారు.

# క్రిస్టియన్ స్మశాన వాటికలను అన్ని క్రిస్టియన్ సంఘాలవారు వాడుకోవాలి: మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 08:హుజూర్ నగర్ పురపాలక సంఘ కార్యాలయం పరిధిలోగల అన్ని క్రిస్టియన్ సంఘాల చర్చిలకు సంబంధించిన పాస్టర్లతో మంగళవారం స్థానిక టౌన్ హాల్ నందు పురపాలక సంఘ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఏ ఈ వినోద్ కుమార్,శానిటరీ ఇన్స్ పెక్టర్ అశోక్ లతో కలిసి సమావేశం నిర్వహించారు క్రిస్టియన్ స్మశాన వాటికలు అన్ని క్రిస్టియన్ సంఘములకు సంబంధించినవని క్రిస్టియన్లు స్మశాన వాటికను వాడుకోవాల్సినదిగా తెలియజేస్తూ సమావేశం నిర్వహించి పాస్టర్ల అందరి దగ్గర నుండి సలహాలు సూచనలు తీసుకోవటం జరిగినది.ఇట్టి సమావేశములో అన్ని క్రిస్టియన్ సంఘముల చర్చి పాస్టర్లు పాల్గొన్నారు.

# పార్కులు.. రహదారుల కబ్జాలు

## -హైడ్రా ప్రజావాణికి 49 ఫిర్యాదులు





హైదరాబాద్, జులై 08(భారత శక్తి): ఇంటి ఎదురుగా రోడ్డు ఉంటే కలిపేయడం.., పార్కు ఉంటే ఆక్రమించేయడం.. కాలువ పైనే నిర్మాణం చేసేయడం.. కబ్జాలకు ఏదీ అడ్డు రావడంలేదని పలు ఫిర్యాదులను బట్టి అర్థమౌతోంది. ఎదురుగా ఉన్న ప్లాట్‌కు దారి లేకుండా మరీ కబ్జా చేసేస్తున్నారంటూ పలువురు హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. రహదారులను ఆక్రమించడం.. అడ్డంగా గోడ కట్టేయడంతో దారి లేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆఖరుకు 20 గజాల స్థలాన్నికూడా వదలడంలేదని.. గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ వద్ద కబ్జా రుజువు చేస్తోంది. నాలాలు పైన ఉన్న వెడల్పు కిందకు వచ్చేసరికి విస్తరించాల్సింది పోయి.. కుంచించుకు పోయిన దృశ్యాలు అనేకం ఉన్నాయి. ఇలా సోమవారం హైడ్రా నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 49 ఫిర్యాదులు రాగా.. అందులో ఎక్కువ శాతం రహదారులు, పార్కుల ఆక్రమణలపైనే ఉన్నాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు పరిశీలించారు. గూగుల్ మ్యాప్స్ ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితిని తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఆ సమస్య పరిష్కార బాధ్యతలు అప్పగించారు.

ఫిర్యాదులు ఇలా..:

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం సిద్ధివినాయకనగర్‌లో 30 అడుగుల విస్తీర్ణంలో ఉన్న రహదారిని ఎదురుగా ఉన్న ప్లాట్ యజమానులు కబ్జా చేశారంటూ ఫిర్యాదు చేశారు. 7 ఎకరాల మేర వేసిన ఈ లే ఔట్‌లో 102 ప్లాట్లు వేయుగా.. రోడ్డును కబ్జా చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం, బోడుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని చెంగిచెర్ల గ్రామానికి చెందిన చిన్న క్రాంతి కాలనీలో పార్కును కబ్జాచేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్లు 114, 118, 120, 121లలో సుమారు 1800 గజాల పార్కు స్థలాన్ని అనధికారికంగా నకిలీ ప్లాట్ నంబర్లు వేసి ఆక్రమించేశారని పేర్కొన్నారు. కాలనీవాసులకు కేటాయించిన పార్క్ స్థలాన్ని కాపాడాలని కోరారు.రంగారెడ్డి జిల్లా తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని పోథాయపల్లి గ్రామంలో నివాసం ఉన్న కొందరు స్థానికులు తమ ఇంటికి వెళ్లే రహదారిని కబ్జా చేశారంటూ స్థానికులు పిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన కొంతమంది రహదారిపై అక్రమంగా గోడ నిర్మించి దారిని పూర్తిగా మూసేసి నిర్మాణం కూడా చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కారణంగా తమ ఇంటికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయని, తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని బాధితులు వాపోయారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని కొండాపూర్ జూబిలీ గార్డెన్ కాలనీలో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కబ్జాలను వెంటనే ఆపాలని కాలనీవాసులు ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. కొత్తగూడ గ్రామం సర్వే నెం. 30లో 14 గుంటలు, సర్వే నెం. 29లో 1 ఎకరం 2 గుంటల భూమి ప్రభుత్వానికి చెందినదిగా రికార్డుల్లో ఉంది. కాంపౌండ్ వాల్ ను శేరిలింగంపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కూడా కూల్చారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం భూమిని సరిగా గుర్తించి.. తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ప్రజావాణి లో ఫిర్యాదు చేసారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మేడిపల్లికి చెందిన ఫీర్జాదీగూడలోని 30 అడుగుల రహదారిని కబ్జా చేశారంటూ శ్రీ సాయి కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. అదే ప్రాంతంలోని పంచవటి కాలనీకి చెందిన కొంతమంది వ్యక్తులు ఈ రహదారిని ఆక్రమిస్తూ రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. రాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలని కోరారు.

# జులై 09 దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయండి : బహుజన వామపక్ష కార్మిక సంఘాల,జెఏసి,రాష్ట్ర కమిటీ





(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 08: మంగళవారం కామారెడ్డి జిల్లా పాల్వంచ,మాచారెడ్డి,పరిదిపేపేట్,లాంగర్,బీడీ దేశాయిబీడీ,విఎస్,ఠాకూర్ బీడీ సెంటర్ లో బుధవారం జరిగే జాతీయ సమ్మెలో మాచారెడ్డి, పాల్వంచ బీడీ సెంటర్ లో పనిచేయు కార్మికులు పాల్గొంటారు. సెంటర్ మేనేజర్లకు తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ, ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ, రాష్ట్ర అధ్యక్షులు యస్, సిద్దిరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నగరపు యెల్లయ్యలు మాట్లాడుతూ, బహుజన వామపక్ష కార్మిక సంఘాల జెఏసి,భాగస్వామ్య కార్మిక సంఘాలు, ఎఐసిటీయు, బిఎల్ టీయూ, టీయుసిఐ, ఎఐఎఫ్ టీయూ, ఐఎఫ్ టీయూ, టీయస్ పి యస్, కే హెచ్ పియస్,టీఎఫ్ టీయూ, బిఎఫ్ టీయూ,తదితర కార్మిక సంఘాల జెఏసి ఆధ్వర్యంలో జులై 9,న జరిగే జాతీయ సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.జులై 9,న జరిగే జాతీయ సమ్మె లో తెలంగాణ రాష్ట్రములోని అన్ని రంగాల కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు,స్వతంత్రం పూర్వం నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోది ప్రభుత్వం రద్దుచేసి, పెట్టు బడి దారులకు అదాని, అంబనీలకు ఉపయోగ పడే చట్టాలను తీసుకురావడం, కార్మిక హక్కులను కాలరాసే 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, బీడీ పరిశ్రమపై పెట్టిన ఆంక్షలు ఎత్తి వేయాలని, జి,యస్,టీ, కోఫ్టా చట్టం రద్దు చేయాలని, యావత్తు కార్మికలోకం ముక్తకంతంతో నినదిస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పోరేట్ పెట్టుబడుదారుల ప్రయోజనాల కోసం దేశ ప్రజలు కార్మికుల పైన భారాలు వేస్తూ ధరలు పెంచుతూ కార్మికుల పనిగంటలు పెంచుతూ, కనీస వేతనాలు ఇవ్వకుండా ప్రజల్ని కార్మికుల్ని హక్కులు లేకుండా కట్టు బానిసల్లాగా దిగజారుస్తూ ప్రజాస్వామ్య దేశంలో నియంత పరిపాలన లాగా మారుస్తూ రాజ్యాంగ పరంగా వచ్చిన హక్కుల్ని తొలగిస్తున్నారు. యావత్తు కార్మిక లోకం ప్రజా హక్కుల కోసం జరుగుతున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేసారు, జూలై 9, న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని పిలునిచ్చారు.ఈ కార్యక్రమంతో బిఎల్ టీయూ జిల్లా నాయకులు, కుమ్మరి రవి,దుర్గయ్య,శాంశు, వెంకటి,నర్సింలు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ నాయకులు ఎస్ ఎస్ సాజిద్ ఆధ్వర్యంలో ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై08:సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్ వద్ద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, జలయజ్ఞం ప్రదాత, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి సందర్భంగా జిల్లా మైనార్టీ నాయకులు ఎస్ ఎస్ సాజిద్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైయస్సార్ వీరాభిమాని సాజిద్ వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు స్ఫూర్తితో నేటికీ అమలవుతున్నాయన్నారు. వైఎస్ఆర్ మరణించిన రోజు ఆత్మ యత్నం చేసినట్లు పేర్కొన్నారు.వైఎస్ జగన్ సీఎం కావాలంటూ సెల్ ఫోన్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేయగా కేసు నమోదు అయిందన్నారు. వైఎస్ఆర్ కుటుంబం సాజిద్ ఖాన్ అని పేరు పెట్టి పిలిచేలా పేరు సంపాదించుకున్నట్లు తెలిపారు. విద్యార్థుల



ఫీజుల కొరకు జగన్ ఉద్యమానికి సంఘీభావం తెలుపుతూ నిరసన వ్యక్తం చేయగా ఐదు రోజులు జైలుకి వెళ్ళినట్లు చెప్పారు.త్వరలో సైకిల్ యాత్ర చేస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్ ను కలవనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎండి గౌస్, వసీం, రహీం, కిరణ్, రవీందర్ రెడ్డి, కనుకు ప్రసాద్, మై బెల్లి, రియాజ్, కత్తి వెంకన్న, సిహెచ్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగం పోయిన బాధ ఏఐతో పంచుకోవాలట..

## లేఆఫ్‌లపై మైక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ సలహా




టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ ఇటీవల భారీ సంఖ్యలో లేఆఫ్‌లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒకేసారి దాదాపు 9000 మందికి నోటీసులిచ్చింది. ఈ నేపథ్యంలో ఉద్యోగాలు కోల్పోయిన వారికి కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఒకరు ఇచ్చిన సలహా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ ఉద్యోగులు బాధ నుంచి బయటపడేందుకు ఏఐ చాట్‌బాట్‌లతో మాట్లాడాలని ఆయన సూచించడం గమనార్హం.

లేఆఫ్‌ల ప్రకటన అనంతరం మైక్రోసాఫ్ట్‌లోని ఎక్స్‌బాక్స్ గేమ్ స్టూడియోస్‌లో పనిచేసే ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మాట్ టర్న్‌బుల్ తన లింక్డ్‌ఇన్‌లో పోస్ట్ చేశారు. "ఇది చాలా కష్ట సమయం. ఈ లేఆఫ్‌లను మీరు ఎదుర్కోవాలన్నా.. దాన్నుంచి బయటపడి ముందుకుసాగాలన్నా మీరు ఒంటరిగా లేరన్న విషయాన్ని మర్చిపోకండి. ఉద్యోగం కోల్పోయిన బాధలో ఉన్నవారికి ఊరట కలిగించేలా లార్జ్ లాంగ్వేజ్ మోడల్ ఏఐ టూల్స్ ఎలా పనిచేస్తాయన్న విషయంపై నేను పరిశోధనలు చేస్తున్నా. చాట్‌జీపీటీ, మైక్రోసాఫ్ట్ కోపైలట్ వంటి ఏఐ టూల్స్ మీకు ఈ విషయంలో మెరుగ్గా సాయపడతాయి. మరింత స్పష్టతతో కెరీర్‌లో ముందుకుసాగడానికి మీరు వాటిని ఉపయోగించుకోవచ్చు. మానసిక బాధ నుంచి ఉపశమనం కలిగిస్తాయి. కెరీర్ కోచ్‌లా సలహాలిస్తాయి. మీ రెజ్యూమ్‌ను మెరుగ్గా రాసుకునేందుకు సాయం చేస్తాయి" అని టర్న్‌బుల్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

అయితే, ఈ పోస్ట్‌పై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. కృత్రిమమేధ వల్లే కంపెనీలు లేఆఫ్‌లు చేపడుతున్నప్పుడు.. ఆ బాధను పోగొట్టుకునేందుకు మళ్లీ ఏఐ టూల్స్‌ను వాడాలన్న సలహా సముచితం కాదని పలువురు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో టర్న్‌బుల్ ఆ పోస్ట్‌ను తొలగించారు.

మైక్రోసాఫ్ట్ ఇటీవల అత్యధిక కోతలను ప్రకటించింది. మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 4 శాతం మందిని అంటే దాదాపు 9,100 మందిని తొలగిస్తున్నట్లు తెలిపింది. ఎక్స్‌బాక్స్, గేమింగ్ డివిజన్లలో ఈ లేఆఫ్‌లు ఇచ్చింది. ఈ ఏడాదిలో కంపెనీ లేఆఫ్‌లు ప్రకటించడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఆరంభంలో 1 శాతం మందిని తొలగించిన కంపెనీ.. ఆ తర్వాత మే నెలలో 6 వేల మందిని ఇంటికి పంపించింది. జూన్‌లోనూ 300 మందికి పైగా ఉద్యోగులను తీసేసింది. ఉద్యోగాలు కోల్పోయిన వారిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రొడక్ట్ డెవలపర్లు ఉన్నారు. కంపెనీ సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ కోతలు పెడుతున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది.

# సింగిల్ క్లిక్‌తో ఆధార్ కేంద్రం

## ఎక్కడుందో తెలుసుకోండిలా..




ఆధార్.. ఈ గుర్తింపు కార్డు గురించి కొత్తగా పరిచయం అక్కర్లేదు. ప్రతి దానికీ ఇప్పుడు ఆధార్ తప్పనిసరి. అందుకే ఈ డాక్యుమెంట్‌ను ఎప్పుడూ అప్‌డేటెడ్‌గా ఉంచుకోవడం చాలా అవసరం. ఏవైనా పొరపాట్లు ఉంటే కచ్చితంగా ఆధార్ నమోదు కేంద్రానికి వెళ్లి సరిచేసుకోవాల్సిందే. చాలా సందర్భాల్లో అలాంటి కేంద్రాలు ఎక్కడున్నాయో తెలుసుకోవడం పెద్ద సమస్యే. ముఖ్యంగా నగరాలకు కొత్తగా వలస వచ్చినవారు, ఒక చోటు నుంచి మరో చోటుకు మారిన వారికి ఈ కేంద్రాల సమాచారం గురించి తెలుసుకోవడం సవాలే. దీనికి పరిష్కారమే భువన్ పోర్టల్. దీని ద్వారా సులువుగా ఆధార్ కేంద్రం ఎక్కడుందో తెలుసుకోవచ్చు.

భారత విశిష్ట ప్రాధికార సంస్థ ( ఇస్రోకు అనుబంధంగా పనిచేసే నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (%చీ=ూజ%)తో కలిసి భువన్ ఆధార్ అనే పోర్టల్‌ను ప్రారంభించింది. దీనిద్వారా ఆధార్ కార్డు హోల్డర్లు మూడు రకాల ప్రీమియం ఫీచర్లను పొందొచ్చు. దగ్గర్లో ఉన్న ఆధార్ కేంద్రాలను తెలుసుకోవడంతో పాటు వాటి దగ్గరకు వెళ్లేందుకు రూట్, ఏ పరిసరాల్లో ఉందో మ్యాప్‌ను కూడా ఈ పోర్టల్ అందిస్తుంది. ఆయా ఆధార్ కేంద్రాల్లో మీకు అవసరమైన సేవలు ఆయా కేంద్రాల్లో లభిస్తాయా? లేదా? అనేది కూడా ఫిల్టర్ చేసి తెలుసుకోవచ్చు. ఎంత దూరంలో ఆధార్ కేంద్రం కావాలో కూడా ఎంపిక చేసుకోవచ్చు.

ఇలా తెలుసుకోండి..

భువన్ ఆధార్ పోర్టల్‌కు వెళ్లండి. స్క్రీన్‌కు ఎడమ వైపున మీకు నాలుగు డ్రాప్-డౌన్ ఆప్షన్లు కనిపిస్తాయి.

దగ్గర్లోని ఆధార్ నమోదు కేంద్రాన్ని తెలుసుకునేందుకు ఆప్షన్లలో 'సెంటర్స్ నియర్‌బై'ను ఎంపిక చేసుకోండి. వెంటనే మీకు దగ్గర్లోకి కేంద్రాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి.

మీకు ప్రత్యేకంగా ఒక ఆధార్ సేవా కేంద్రం పేరు తెలిస్తే 'సెర్చ్ బై ఆధార్ సేవా కేంద్ర' అనే ఆప్షన్‌ను కూడా ఉపయోగించుకోవచ్చు.

పిన్‌కోడ్‌ను ఎంటర్ చేయడం ద్వారా కూడా మీ పరిసర ప్రాంతాల్లో ఆధార్ కేంద్రాలు ఎక్కడున్నాయో తెలుసుకోవచ్చు.

రాష్ట్రం, జిల్లా, మండలం వంటి వివరాలను ఎంటర్ చేసి ఆయా రాష్ట్రాల్లోని ఆధార్ కేంద్రాల వివరాలన్నింటినీ చూసుకోవచ్చు.

టూల్స్ అనే సెక్షన్‌పై క్లిక్ చేసి దగ్గర్లోని కేంద్రానికి మార్గాన్ని కూడా చూసుకోవచ్చు.

# ఉద్యోగం పోయిన బాధ ఏఐతో పంచుకోవాలట..

## లేఆఫ్‌లపై మైక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ సలహా




: టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ (ఇటీవల భారీ సంఖ్యలో లేఆఫ్‌లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒకేసారి దాదాపు 9000 మందికి నోటీసులిచ్చింది. ఈ నేపథ్యంలో ఉద్యోగాలు కోల్పోయిన వారికి కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఒకరు ఇచ్చిన సలహా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ ఉద్యోగులు బాధ నుంచి బయటపడేందుకు ఏఐ చాట్‌బాట్‌లతో మాట్లాడాలని ఆయన సూచించడం గమనార్హం.

లేఆఫ్‌ల ( ప్రకటన అనంతరం మైక్రోసాఫ్ట్‌లోని ఎక్స్‌బాక్స్ గేమ్ స్టూడియోస్‌లో పనిచేసే ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మాట్ టర్న్‌బుల్ తన లింక్డ్‌ఇన్‌లో పోస్ట్ చేశారు. "ఇది చాలా కష్ట సమయం. ఈ లేఆఫ్‌లను మీరు ఎదుర్కోవాలన్నా.. దాన్నుంచి బయటపడి ముందుకుసాగాలన్నా మీరు ఒంటరిగా లేరన్న విషయాన్ని మర్చిపోకండి. ఉద్యోగం కోల్పోయిన బాధలో ఉన్నవారికి ఊరట కలిగించేలా లార్జ్ లాంగ్వేజ్ మోడల్ ఏఐ టూల్స్ ఎలా పనిచేస్తాయన్న విషయంపై నేను పరిశోధనలు చేస్తున్నా. చాట్‌జీపీటీ, మైక్రోసాఫ్ట్ కోపైలట్ వంటి ఏఐ టూల్స్ మీకు ఈ విషయంలో మెరుగ్గా సాయపడతాయి. మరింత స్పష్టతతో కెరీర్‌లో ముందుకుసాగడానికి మీరు వాటిని ఉపయోగించుకోవచ్చు. మానసిక బాధ నుంచి ఉపశమనం కలిగిస్తాయి. కెరీర్ కోచ్‌లా సలహాలిస్తాయి. మీ రెజ్యూమ్‌ను మెరుగ్గా రాసుకునేందుకు సాయం చేస్తాయి" అని టర్న్‌బుల్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

అయితే, ఈ పోస్ట్‌పై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. కృత్రిమమేధ వల్లే కంపెనీలు లేఆఫ్‌లు చేపడుతున్నప్పుడు.. ఆ బాధను పోగొట్టుకునేందుకు మళ్లీ ఏఐ టూల్స్‌ను వాడాలన్న సలహా సముచితం కాదని పలువురు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో టర్న్‌బుల్ ఆ పోస్ట్‌ను తొలగించారు.

మైక్రోసాఫ్ట్ ( ఇటీవల అత్యధిక కోతలను ప్రకటించింది. మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 4 శాతం మందిని అంటే దాదాపు 9,100 మందిని తొలగిస్తున్నట్లు తెలిపింది. ఎక్స్‌బాక్స్, గేమింగ్ డివిజన్లలో ఈ లేఆఫ్‌లు ఇచ్చింది. ఈ ఏడాదిలో కంపెనీ లేఆఫ్‌లు ప్రకటించడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఆరంభంలో 1 శాతం మందిని తొలగించిన కంపెనీ.. ఆ తర్వాత మే నెలలో 6 వేల మందిని ఇంటికి పంపించింది. జూన్‌లోనూ 300 మందికి పైగా ఉద్యోగులను తీసేసింది. ఉద్యోగాలు కోల్పోయిన వారిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రొడక్ట్ డెవలపర్లు ఉన్నారు. కంపెనీ సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ కోతలు పెడుతున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది.




# '7 ఏళ్లలో 5 వేల కోట్ల నష్టం '..

## లింక్డిన్ పోస్ట్‌పై స్పందించిన క్రెడ్ సీఈఓ

ప్రస్తుత స్టార్టప్ ప్రపంచంలో కునాల్ షా పేరు తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. సాధారణ కుటుంబ నేపథ్యంతో నుంచి వచ్చిన ఆయన.. 'క్రెడ్' అనే అతిపెద్ద ఫైనాన్షియల్ యాప్‌ను తీర్చిదిద్దారు. అయితే, కునాల్ షా గురించి లింక్డిన్‌లో పెట్టిన ఓ పోస్టు వైరల్‌గా మారింది. 15 ఏళ్ల తన కెరీర్‌లో ఒక్క రూపాయి లాభం చూపని వ్యక్తి ఎలా ఆదర్శం? అంటూ ఓ నెటిజన్ ప్రశ్నించాడు. దీనికి ఆయనే స్వయంగా బదులిచ్చారు.

డెలాయిట్‌లో సీనియర్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నా ఆదర్ష్ సమలోప్పనన్ ఇటీవల లింక్డిన్ వేదికగా కునాల్ షా గురించి ఓ పోస్ట్ పెట్టారు. "2010లో ఫ్రీఛార్జ్‌కు కునాల్ సహ వ్యవస్థాపకుడిగా వ్యవహరించారు. 2015 నాటికి ఆ సంస్థ రూ.35 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. రూ.269 కోట్ల నష్టం చవిచూసింది. స్నాప్‌డీల్ దాన్ని రూ.2800 కోట్లకు కొనుగోలు చేసింది. అక్కడకు రెండేళ్లకు రూ.370 కోట్లకు యాక్సిస్ బ్యాంక్ దాన్ని కొనుగోలు చేసింది. షా 2018లో క్రెడ్‌ను స్థాపించారు. ఏడేళ్లలో ఆ కంపెనీ సాధించిన ఆదాయం రూ.4,493 కోట్లు కాగా.. రూ.5215 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. తన 15 ఏళ్ల ఈ ప్రయాణంలో ఒక్క ఆర్థిక సంవత్సరం కూడా లాభదాయకతను నమోదు చేయని వ్యక్తి గురించి సెలబ్రేట్ చేసుకోవడం ఎందుకో?" అని ఆదర్శ్ పోస్ట్ చేశారు.

ఈ పోస్ట్ తన దృష్టికి రావడంతో కునాల్ షా హుందాగా స్పందించారు. "మీరు చెప్పింది నిజమే. ఒక్క రూపాయి కూడా సొంత సొమ్మును ఖర్చు చేయకుండా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగిన వేలాది మంది విజయాన్ని సెలబ్రేట్ చేసుకోవాలి. తమ జీవితాలను రిస్క్‌లో పెడుతూ ఆంత్రప్రెన్యూర్‌లుగా మారుతున్న వ్యక్తుల విజయాన్ని సెలబ్రేట్ చేసుకోవాలి. మన జీవితంలోకి ఏఐ ప్రవేశించాక.. ఉద్యోగం చేయడం అనేది మరింత రిస్క్‌తో కూడుకున్న వ్యవహారంగా మారింది. అలాంటి ఈ రోజుల్లో ఉద్యోగాలు చేసే వారితో పాటు ఉద్యోగాలు కల్పించే వారూ ముఖ్యమే" అంటూ బదులిచ్చారు.

ఈ పోస్ట్‌పై నెటిజన్లు కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేశారు. ఈ చర్చలో కొందరు ఆదర్ష్ వాదనతో ఏకీభవించగా.. మరికొందరు మాత్రం కునాల్ షా వైపు నిలిచారు. ఒక్క రూపాయి కూడా లాభం చూపకుండా ఇన్వెస్టర్ల నమ్మకాన్ని ఎలా చూరగొంటారో అంటూ కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విజయానికి లాభదాయకత ఒక్కటే కొలమానం కాదు అంటూ మరికొందరు కామెంట్లు పెట్టారు. ఇలాంటి స్టార్టప్ ఆలోచనల నుంచే వాట్సప్, ఫేస్‌బుక్ వంటి పెద్ద పెద్ద కంపెనీలు ఉద్భవించాయని ఆదర్ష్ గుర్తు చేశారు.

# వన్‌ప్లస్ డబుల్ ధమాకా: 6 ఏళ్ల

## అప్‌డేట్స్‌తో నార్డ్ 5, నార్డ్ సీఈ 5

ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ వన్‌ప్లస్ (ఒకేరోజు రెండు ఫోన్లను లాంచ్ చేసింది. వన్‌ప్లస్ నార్డ్ 55), నార్డ్ సీఈ 5 పేరిట మిడ్‌రేంజ్ ఫోన్లను తీసుకొచ్చింది. బిగ్ బ్యాటరీ, 80%ఔ% ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఇందులో ఉన్నాయి. నాలుగు ఆండ్రాయిడ్ అప్‌డేట్స్‌తోపాటు, ఆరేళ్ల సెక్యూరిటీ అప్‌డేట్స్‌తో ఈ ఫోన్లను తీసుకురావడం విశేషం. ఈ రెండు ఫోన్లలోనూ ఏఐ ఫీచర్లను జోడించారు. అలర్ట్ స్లయిడర్ స్థానంలో కొత్తగా ఇందులో ప్లస్ కీ ని అమర్చారు. వీటితో పాటు వన్‌ప్లస్ బడ్స్ 4ని కూడా కంపెనీ లాంచ్ చేసింది.

వన్‌ప్లస్ నార్డ్ 5 (%ూఅవూశ్రీబం చీశీతీస 5)

%వన్‌ప్లస్ నార్డ్ 5లో 6.83 అంగుళాల అమోలెడ్ 1.5%ఖ, 144 స్ఓ% డిస్‌ప్లే ఇచ్చారు. స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జన్ 3 ప్రాసెసర్‌ను అమర్చారు. వెనుకవైపు 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ 700 మెయిన్ కెమెరా ఇచ్చారు. ఇది ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో వస్తోంది. దీంతో పాటు 8 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. 50 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 6,800 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. 80%ఔ% ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఆండ్రాయిడ్ 15తో కూడిన ఆక్సిజన్ ఓఎస్ 15తో పనిచేస్తుంది. వైఫై 6, ఎన్‌ఎఫ్‌సీ, ఇన్ డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సర్, ఐఆర్ ట్రాన్స్‌మిటర్ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయి. ఐపీ 65 రేటింగ్‌తో వస్తున్న ఈ ఫోన్ బరువు 211 గ్రాములు.

వన్‌ప్లస్ నార్డ్ సీఈ5

%వన్‌ప్లస్ నార్డ్ సీఈ5లోనూ 6.83 అంగుళాల అమోలెడ్ 1.5%ఎ, 144 స్ఓ% డిస్‌ప్లేను ఇచ్చారు. ఇందులో మీడియాటెక్ డైమెన్‌సిటీ 8350 ప్రాసెసర్‌ను అమర్చారు. వెనుకవైపు 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ 600 ప్రధాన కెమెరా ఇచ్చారు. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో వస్తోంది. 8 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. సెల్ఫీల కోసం 16 ఎంపీ కెమెరా ఉంది. ఇందులో 7,100 ఎంఏహెచ్ బ్యాటరీ ఇచ్చారు. ఇది కూడా 80%ఔ% ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఔటాఫ్ ది బాక్స్ ఆండ్రాయిడ్ 15 ఆధారిత ఆక్సిజన్ ఓఎస్ 15తో పనిచేస్తుంది. ఇందులోనూ ఇన్‌డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సర్, ఐఆర్ ట్రాన్స్‌మిటర్ ఉన్నాయి. దీని బరువు 199 గ్రాములు.

# ఆఖర్లో కొనుగోళ్ల మద్దతు..

## లాభాల్లో ముగిసిన సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఉదయం ఫ్లాట్‌గా కదలాడిన సూచీలు.. ఆఖర్లో కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. మరోవైపు ట్రంప్ టారిఫ్‌లపై అనిశ్చితి కొనసాగుతోంది. ఇప్పటికే వివిధ దేశాలపై టారిఫ్‌లను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్- అమెరికా ట్రేడ్ డీల్‌పై అనిశ్చితి కొనసాగుతోంది. దీంతో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు.

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 83,387.03 వద్ద (క్రితం ముగింపు 83,442.50) ఫ్లాట్‌గా ప్రారంభమైంది. రోజంతా ఫ్లాట్‌గా కొనసాగిన సూచీ.. ఇంట్రాడేలో 83,320.95 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరి అరగంటలో కొనుగోళ్లు మద్దతు కలిసొచ్చింది. దీంతో 270.01 పాయింట్ల లాభంతో సెన్సెక్స్ 83,712.51 వద్ద ముగిసింది. నిఫ్టీ 61.20 పాయింట్ల లాభంతో 25,5222.50 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.71గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎటర్నల్, ఏషియన్ పెయింట్స్, ఎన్టీపీసీ, బీఈఎల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టైటాన్, ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, మారుతీ సుజుకీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 69.37 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,333 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.






# ‘శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడు’

ఇంగ్లాండ్‌లో పర్యటిస్తున్న టీమ్‌ఇండియా అయిదు టెస్ట్‌మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఇందులోభాగంగా ఇప్పటికే రెండు మ్యాచ్‌లు ముగిశాయి. మొదటి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ అయిదు వికెట్ల తేడాతో గెలిస్తే, రెండో మ్యాచ్‌లో భారత జట్టు 336 పరుగుల తేడాతో రికార్డు విజయం సాధించింది. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ టీమ్‌ఇండియా నూతన టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ( రాణించాడు. ముఖ్యంగా రెండో టెస్ట్ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో ద్విశతకం (269) బాదిన గిల్, రెండో ఇన్నింగ్స్‌లోనూ భారీ శతకం (161) సాధించాడు. ఈ నేపథ్యంలో భారత జట్టు సారథిపై.. ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ మార్క్ బుచర్ ప్రశంసల వర్షం కురిపించాడు.

శుభ్‌మన్ గిల్.. బ్యాటింగ్ ఆర్డర్‌లో విరాట్‌కోహ్లీ సచిన్ తెందుల్కర్ స్థానాన్ని భర్తీ చేశాడని, నాలుగో స్థానంలో అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడని బుచర్ కొనియాడాడు. ‘టీమ్‌ఇండియాకు కెప్టెన్‌గా వ్యవహరించడమంటే సాదాసీదా విషయం కాదు. విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లోనూ గిల్ అద్భుతంగా రాణిస్తున్నాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో.. విరాట్ కోహ్లీ స్థానాన్ని చాలా తేలికగా భర్తీ చేశాడు. నాలుగో స్థానంలో అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడు. మంచినీళ్ల ప్రాయంలా పరుగుల వరద పారిస్తున్నాడు. టెక్నికల్‌గా కూడా గిల్ బ్యాటింగ్ బాగుంది. ఈ సిరీస్‌లో చక్కగా రాణిస్తున్నాడు. ఇప్పటికే దాదాపు 600 వరకు పరుగులు రాబట్టాడు’ అని బుచర్ విశ్లేషించాడు.

అలాగే కేఎల్ రాహుల్ , యశస్వి జైస్వాల్ ‌గురించి కూడా అతడు మాట్లాడాడు. ‘టెస్ట్ క్రికెట్‌కు రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ జోడీ చక్కగా ఓపెనింగ్ చేస్తోంది. వీరిద్దరూ వేగంగా పరుగులు సాధిస్తున్నారు. షార్ట్ బాల్స్ విషయంలో మాత్రం జైస్వాల్ కాస్త ఇబ్బందిపడుతున్నాడు. అతడు ఆ ఒక్క లోపాన్ని సరిచేసుకుంటే సరిపోతుంది’ అని మార్క్ బుచర్ సూచించాడు.

# లార్డ్స్ టెస్ట్.. బెన్‌స్టోక్స్‌కు పెద్ద సవాలే: మైకేల్ అథర్టన్

2 ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా చేతిలో ఇంగ్లాండ్ ఘోర పరాజయం ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జులై 10 నుంచి లార్డ్స్‌లో జరగనున్న మూడో టెస్ట్ మ్యాచ్.. ఇంగ్లిష్ జట్టు కెప్టెన్ బెన్‌స్టోక్స్‌కు పెద్ద సవాలే అని ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ మైకేల్ అథర్టన్ ( అన్నాడు. రెండో మ్యాచ్‌లో, టాస్ సమయంలో పొరపాటు జరిగిందని ఇంగ్లాండ్ కోచ్ బ్రెండన్ మెకల్లమ్ అంగీకరించాడు. దీంతో బెన్‌స్టోక్స్ కెప్టెన్సీ సామర్థ్యంపై ప్రశ్నలు తలెత్తాయి.

‘కెప్టెన్‌గా బెన్‌స్టోక్స్‌కు లార్డ్స్‌లో జరగనున్న మూడో టెస్ట్ మ్యాచ్ కీలకం కానుంది. ఈ నేపథ్యంలో అతడు ప్రస్తుతం కఠినమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాడు. ఈ టెస్ట్ మ్యాచ్ అతని నాయకత్వ పటిమ, మానసిక, శారీరక సామర్థ్యానికి పరీక్ష కానుంది’ అని మైకేల్ అథర్టన్ విశ్లేషించాడు.

రాబోయే రెండు రోజులు బెన్‌స్టోక్స్‌కు చాలా ముఖ్యమని అథర్టన్ అన్నాడు.




‘మొదటి టెస్ట్ మ్యాచ్‌కు, రెండో టెస్ట్‌కు మధ్యలో ఏడు రోజుల విరామం దొరికింది. కానీ రెండో, మూడో టెస్ట్ మ్యాచ్‌ల మధ్య కేవలం మూడు రోజులు మాత్రమే ఉంది. ఈ సమయం తిరిగి పుంజుకోవడం బెన్‌స్టోక్స్‌కు చాలా కీలకం’ అని అతడు అన్నాడు.

అలాగే లార్డ్స్ టెస్ట్ కోసం ఇంగ్లాండ్ తుది జట్టులో కొన్ని మార్పులను అథర్టన్ సూచించాడు. ‘నేను బ్యాటింగ్‌పై విశ్వాసం ఉంచుతాను. అలాగే సీమ్ దాడిని బలోపేతం చేస్తాను. జోష్ టంగ్, బ్రైడన్ కార్స్ స్థానంలో జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్‌ను టీమ్‌లోకి తీసుకుంటాను’ అని అథర్టన్ వివరించాడు.

# లారాపై గౌరవంతో..

బులవాయో: జింబాబ్వేతో రెండో టెస్టు తొలి రోజు దక్షిణాఫ్రికా స్కోరు 465/4. తాత్కాలిక కెప్టెన్ వియాన్ ముల్డర్ 264 పరుగులతో అజేయంగా నిలిచాడు. రెండో రోజూ అతడి దూకుడు కొనసాగింది. జట్టు స్కోరు 600 దాటింది. అతను 400 మార్కుకు చేరువ అయ్యాడు. ఇంకొన్ని ఓవర్లు ఆడితే టెస్టు క్రికెట్ చరిత్రలో ఆ ఘనత సాధించిన ఏకైక బ్యాటర్ బ్రయాన్ లారా (400 నాటౌట్)ను దాటేస్తాడు. కానీ ముల్డర్ ఆ రికార్డు వద్దనుకున్నాడు. లారా మీద గౌరవంతో అతను 367 (334 బంతుల్లో 49ఐ4, 4ఐ6) పరుగుల వద్ద ఆగిపోయాడు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌ను 626/5 వద్ద డిక్లేర్ చేశాడు. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన జింబాబ్వే.. సుబ్రయెన్ (4/24), కొడి యూసుఫ్ (2/20), వియాన్ ముల్డర్ (2/20)ల ధాటికి 170 పరుగులకే కుప్పకూలి ఫాలోఆన్‌లో పడింది. సీన్ విలియమ్స్ (83) ఒంటరి పోరాటం చేశాడు. రెండో రోజు ఆట చివరికి రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు



51/1తో నిలిచింది. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే జింబాబ్వే ఇంకా 405 పరుగులు చేయాలి. తొలి టెస్టులో ఆ జట్టు 328 పరుగుల తేడాతో ఓడింది. టెస్టుల్లో అత్యధిక స్కోరు లారా లాంటి గొప్ప బ్యాటర్ పేరు మీదే ఉండాలని, తనకు మరో అవకాశం వచ్చినా ఆ రికార్డును దాటే ప్రయత్నం చేయనని ముల్డర్ చెప్పడం విశేషం. టెస్టుల్లో అతడిది అయిదో అత్యధిక స్కోరు.

# క్రికెట్‌లో కన్నా.. వింబుల్డన్‌లోనే ఎక్కువ ఒత్తిడి ఉంటుంది: విరాట్ కోహ్లీ

లండన్‌లోని సెంటర్ కోర్టులో జకోవిచ్, అలెక్స్ డి మినార్ మధ్య సోమవారం వింబుల్డన్ మ్యాచ్ జరిగింది. దీన్ని సతీసమేతంగా విరాట్‌కోహ్లీ వీక్షించాడు. ఈ మ్యాచ్ అనంతరం ఓ స్పోర్ట్స్ ఛానల్‌తో మాట్లాడాడు. క్రికెట్ కన్నా.. వింబుల్డన్‌లోనే ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డాడు. వరల్డ్‌కప్‌లో టీమ్‌ఇండియా పాకిస్థాన్ మధ్య మ్యాచ్‌లు ఉన్నప్పుడు ఎంత తీవ్రమైన ఒత్తిడి ఉంటుందో, ప్రతి వింబుల్డన్ మ్యాచులోనూ అంతే స్థాయిలో ఉంటుందని వివరించాడు. ప్రేక్షకులతో కిక్కిరిసిన క్రికెట్ మైదానంలో ఆడటం కంటే.. సెంట్రల్ కోర్టులో వింబుల్డన్ ఆడటమే కాస్త కష్టమన్నాడు.



ఇటీవలే.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ తొలి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజయోత్సవం సందర్భంగా బెంగళూరులో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 11 మంది తమ ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన తర్వాత కోహ్లీ మళ్లీ ఇప్పుడే బయట కనిపించాడు.

‘క్రికెట్‌లో అభిమానులు ఆటగాళ్లకు దూరంగా ఉంటారు. కేవలం బౌండరీ దగ్గర ఫీల్డింగ్ చేసేవాళ్లే ప్రేక్షకులకు కాస్త దగ్గరగా ఉంటారు. కానీ వింబుల్డన్‌లో అలా కాదు. జనాలు మనకు చాలా దగ్గరగా ఉంటారు. ఇది ఒత్తిడిని పెంచుతుంది. ఈ కారణంగానే నాకు టెన్నిస్ ఆటగాళ్లంటే అపారమైన గౌరవం ఉంది. వీళ్లు శారీరకంగా, మానసికంగా తమ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం నిజంగా గ్రేట్. వరల్డ్ కప్‌లో ఇండియా, పాకిస్థాన్ మ్యాచుల్లో మాత్రమే కాళ్లు వణికేంత ఒత్తిడి ఉంటుంది. కానీ టెన్నిస్ ఆటగాళ్లు క్వార్టర్ ఫైనల్ నుంచి ఫైనల్ వరకు ఇదే రకమైన ఒత్తిడిని ఎదుర్కొంటారు’ అని విరాట్ కోహ్లీ అన్నాడు.

# జోఫ్రా ఆర్చర్‌ను లార్డ్స్‌లో ఆడించాలి: జేమ్స్ అండర్సన్

లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్, టీమ్‌ఇండియా ల మధ్య జులై 10 నుంచి మూడో టెస్ట్ మ్యాచ్ జరగనుంది. ఇందులో ఇంగ్లిష్ జట్టులో జోఫ్రా ఆర్చర్‌ను ( ఆడించాలని ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ జేమ్స్ అండర్సన్ ( సూచించాడు. ఫిట్‌నెస్ సమస్యలు, గాయాల కారణంగా 2021 ఫిబ్రవరి నుంచి జోఫ్రా ఆర్చర్ టెస్ట్ మ్యాచ్‌లు ఆడలేదు. అతడు ఇటీవలే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఓ మ్యాచ్‌లో పాల్గొన్నాడు. అలాగే భారత్‌తో జరిగిన రెండో మ్యాచ్ కోసం ఇంగ్లాండ్ స్క్వాడ్‌లో భాగమయ్యాడు. కానీ తుది జట్టులో మాత్రం స్థానం పదిలం చేసుకోలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 336 పరుగుల తేడాతో టీమ్‌ఇండియా చేతిలో ఓటమి పాలైంది. దీంతో భారతజట్టు సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఈనేపథ్యంలో ఆర్చర్‌ను తుదిజట్టులోకి తీసుకోవాలని జేమ్స్ అండర్సన్ ఇంగ్లాండ్ సెలక్టర్లకు సూచిస్తున్నాడు.







# మహారాష్ట్ర జట్టులో పృథ్వీ

ముంబయి: ముంబయి యువ బ్యాటర్ పృథ్వీ షా మహారాష్ట్ర జట్టులో చేరాడు. 2025-26 దేశవాళీ సీజన్‌లో మహారాష్ట్ర తరఫున పృథ్వీ బరిలో దిగనున్నాడు. గత నెలలో అతనుమరో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించేందుకు నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) కోరగా.. ముంబయి క్రికెట్ సంఘం (ఎంసీఏ) పాలక మండలి అతని విజ్ఞప్తికి ఆమోదం తెలిపింది. అంతకుముందు ఫిట్‌నెస్, క్రమశిక్షణ సమస్యల కారణంగా ముంబయి రంజీ ట్రోఫీ జట్టు నుంచి పృథ్వీని తప్పించారు. దీంతో 2025-26 సీజన్‌లో మహారాష్ట్రకు ఆడాలని పృథ్వీ నిర్ణయించుకున్నాడు. “అంతర్జాతీయ క్రికెటర్ పృథ్వీ అధికారికంగా ఎంసీఏతో విడిపోయాడు. రానున్న దేశవాళీ సీజన్‌లో అతను మహారాష్ట్రకు ప్రాతినిధ్యం వహిస్తాడు” అని మహారాష్ట్ర క్రికెట్ సంఘం పేర్కొంది. “నా కెరీర్‌లోని ఈ దశలో మహారాష్ట్ర జట్టులో చేరడం వల్ల క్రికెటర్‌గా మరింత ఎదగగలనని నమ్ముతున్నా. ఎంసీఏకు నా కృతజ్ఞతలు” అని పృథ్వీ తెలిపాడు.





# కీరవాణి.. రాగం పేరే కుమారుడికి పెట్టి.. శివశక్తి దత్తా ఇండస్ట్రీకి ఎలా వచ్చారంటే

: ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి తండ్రి, రచయిత శివశక్తి దత్తా ( సోమవారం కన్నుమూశారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయన 'కళ లేనిదే నా జీవితం లేదు' అంటూ చిన్నప్పటినుంచే కళపై మక్కువ పెంచుకున్నారు. కళపై ఉన్న ఇష్టంతోనే ఇంట్లో వాళ్లకు చెప్పకుండా ముంబయికి వెళ్లిపోయారు. అక్కడి నుంచి ఆయన ప్రయాణం సాగిందిలా..

సుబ్బారావు నుంచి శివశక్తి దత్తాగా..

శివశక్తి దత్తా తండ్రి కోడూరి విజయ అప్పారావు (కీరవాణి తాత) రైతు కుటుంబవే కానీ... బాగా చదువుకున్నవారు. ఆయన రెండో సంతానమే కోడూరి సుబ్బారావు (శివశక్తి దత్తా). ఊహ తెలిశాక తన పేరును బాబూరావుగా మార్చుకున్నారు. పదిహేనేళ్ళ వచ్చాక చిత్రలేఖనంలో చేరతానంటే తండ్రి అంగీకరించలేదు. దీంతో ఓ రోజు ఇంట్లో ఎవరితోనూ చెప్పకుండా ముంబయికి వెళ్లిపోయారు. అక్కడి 'జెజె స్కూల్ ఆఫ్ ఆర్ట్'లో చేరారు. రెండేళ్ళ తర్వాత డిప్లొమాతో సొంతూరు వచ్చి తన చిత్రలేఖనంతో అందర్నీ అబ్బురపరిచారు. 'కమలేష్' అనే కుంచె పేరుతో చిత్రాలు గీయడం ప్రారంభించిన బాబూరావు తర్వాత తన పేరుని 'శివదత్తా'గా మార్చుకున్నారు.

కీరవాణి రాగం పేరే కుమారుడికి..

శివదత్తా కుంచెకే పరిమితమైతే తెలుగు రాష్ట్రం గర్వించే చిత్రకారుడిగా రాణించి ఉండేవారేమో కానీ... ఆయన దృష్టి ఆ ఒక్కదానికే పరిమితం కాలేదు. సంగీతం పైనా పడింది. గిటార్, సితార్, హార్మోనియం నేర్చుకున్నారు. వాటితోపాటూ కథలూ, కవితలంటూ సాహిత్యంలోకి ప్రవేశించారు. సినిమాలపై ఆసక్తితో ఎల్వీప్రసాద్ దగ్గర సహాయకుడిగా చేరారు. వీణావాయిద్యం తెలిసిన భానుమతిని ఏరికోరి పెళ్లి చేసుకున్నారు. 1961లో ఆమె గర్భిణిగా ఉన్నప్పుడు ఓసారి... శివదత్తా మద్రాసులో సంగీత దర్శకుడు ఎస్.రాజేశ్వరరావుని కలిశారట. 'విప్రనారాయణ' సినిమాలో తనకెంతో ఇష్టమైన 'ఎందుకోయీ తోటమాలీ...' పాట ఏ రాగంలోనిదని అడిగారట. 'కీరవాణి' అన్నారట రాజేశ్వరరావు. దీంతో తన కుమారుడికి ఆ రాగం పేరే పెట్టారు. కీరవాణి ఆస్కార్ సొంతం చేసుకున్నప్పుడు భావోద్వేగానికి గురయ్యారు శివశక్తి దత్తా. సంగీతమే తన కుమారుడి రూపంలో జన్మించిందని ఎంతో గర్వంగా ఉందన్నారు.

కీరవాణికి తండ్రి అంటే ఎంతో ఇష్టం..

దర్శకుడు కీరవాణికి తండ్రి అంటే ఎంతో ప్రేమ. ఆయన వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఎన్నో సందర్భాల్లో చెప్పారు. తమ కుటుంబ ఆర్థికపరిస్థితి ఎలా ఉన్నా కుమారుడికి పట్టుపట్టి సంగీతం నేర్పించారట శివశక్తి. ఆయన ఆరోజు అంత కష్టపడి తనకు సంగీతం నేర్పించారు కాబట్టే తాను నేడు ఇలా ఉన్నానంటారు కీరవాణి. 'దేవుడి దర్శనం కోసం కొండ పైకి వెళ్ళాలంటే మెట్లెక్కాలి. కానీ మనల్ని భగవంతుడి వద్దకు చేర్చే మెట్లు మాత్రం దేవుణ్ని ఎప్పుడూ చూడలేవు. మా నాన్న నాకు ఆ మెట్ల లాంటివారు! ఆయన తన ప్రతిభకి తగ్గ విజయాలు అందుకోలేకపోయినా మాకు పునాదిరాయిగా నిలిచారు' అంటూ తండ్రిపై తన ప్రేమను వ్యక్తపరుస్తుంటారు కీరవాణి.

శివశక్తి దత్తా తోబుట్టువులు వీరే..

శివదత్తాకి తోబుట్టువులు ఆరుగురు. ఓ అన్న, అక్క, నలుగురు తమ్ముళ్ళు. అక్కయ్యకు పెళ్ళి కావడం, అన్నయ్య కుటుంబం నుంచి వేరుపడటంతో శివదత్తే ఇంటికి పెద్దయ్యారు. ఆ తమ్ముళ్లలో ఒకడు చంద్రబోస్... సంగీత దర్శకురాలు శ్రీలేఖ వాళ్ళ నాన్న. చివరివాడు... ఎస్ఎస్ రాజమౌళి తండ్రి విజయేంద్రప్రసాద్.

# వివాదాస్పదమైన 'ది' ట్యాగ్‌పై స్పందించిన విజయ్‌దేవరకొండ..



తన అభిమానులతో ఎప్పుడూ టచ్‌లో ఉండే హీరోల్లో విజయ్ దేవరకొండ ఒకరు. తన సినిమాల విడుదల సమయాల్లోనే కాకుండా ఎప్పుడూ సోషల్ మీడియా వేదికగా యాక్టివ్‌గా ఉంటారు. గతంలో ఆయన తన పేరుకు ముందు 'ది' అనే ట్యాగ్‌ను జోడించగా అది వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. దీంతో ఆయన దాన్ని తొలగించాలని అభిమానులకు సూచించారు. తాజాగా దీనిపై విజయ్ మాట్లాడారు.

"నా పేరుకు ముందు 'ది' అనే ట్యాగ్‌ను జోడించడం వల్ల విపరీతమైన స్పందన వచ్చింది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. దీనివల్ల ఇతర హీరోలెవరూ ఎదుర్కోనన్ని ఎదురుదెబ్బలు నాకు తగిలాయి. యూనివర్సల్ స్టార్ నుంచి పీపుల్స్ స్టార్ వరకు ఎన్నో ట్యాగ్స్ ఉన్నాయి. నాకంటే చిన్నవారు, పెద్దవారు వీటిని ఉపయోగించుకుంటున్నారు. నాకంటే ముందు ఇండస్ట్రీకి వచ్చిన వారికి కూడా ట్యాగ్‌లైన్స్ ఉన్నాయి. బహుశా ఏ ట్యాగ్ లేకుండా ఉన్న హీరో నేను ఒక్కడినేనేమో".

"నాకు ట్యాగ్‌లైన్‌తో గుర్తుండాలనే ఆసక్తి లేదు. ప్రేక్షకులు నన్ను నా నటనతో గుర్తుంచుకోవాలని కోరుకుంటాను. ఆడియన్స్ నన్ను సదరన్ సెన్సేషన్, రౌడీ స్టార్.. ఇలాంటి పేర్లతో పిలిచారు. వాటిని నేను అంగీకరించకపోవడంతో నా 'లైగర్' ప్రచారంలో టీమ్ 'ది' అనే పదాన్ని జోడించింది. అప్పటివరకూ ఈ ట్యాగ్ ఎవరికీ లేకపోవడంతో నేను అంగీకరించాను. కానీ, దానివల్ల విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. దీంతో దాన్ని తీసేయాలని నా టీమ్‌కు సూచించాను" అని తెలిపారు. తనను విజయ్ దేవరకొండ అని మాత్రమే పిలవాలని చెప్పాను.

ఇక తన వ్యక్తిగత జీవితంపై వచ్చే రూమర్స్‌పై విజయ్ దేవరకొండ స్పందించారు. జీవితంలో ప్రతిదీ అవసరమేనన్నారు. ఎదురయ్యే ఒడుదొడుకులను కూడా తాను సవాలుగా తీసుకొని వాటిని అధిగమిస్తానన్నారు. చిన్నప్పటినుంచి ఎన్నో పరిస్థితులను దాటుకొని ఈ స్థాయికి వచ్చినట్లు చెప్పారు. ఈరోజు తాను గుర్తింపు తెచ్చుకోవడానికి తాను ఎదుర్కొన్న పరిస్థితులే కారణమన్నారు.

# వైరలవుతోన్న 'హరి హర వీరమల్లు' రన్‌టైమ్..



: పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందిన హిస్టారికల్ యాక్షన్ ఫిల్మ్ 'హరి హర వీరమల్లు'. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జులై 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే ఓవర్సీస్‌లో కొన్ని ప్రాంతాల్లో టికెట్ బుకింగ్స్ కూడా ప్రారంభమయ్యాయి. తాజాగా అక్కడ ఓ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ దీని రన్‌టైమ్ 2.40 గంటలుగా పేర్కొంది. దీంతో ఈ రన్‌టైమ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది ( దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

ఇక ఈ సినిమాలో పవన్ సరసన నిధి అగర్వాల్ కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా ఆమె అభిమానులతో చిట్‌చాట్ చేస్తూ.. ఈ సినిమాలో ఏ సన్నివేశం ఎక్కువ ఆసక్తికరంగా ఉంటుందో చెప్పారు. ఇంటర్వెల్, పోస్ట్ ఇంటర్వెల్, క్లైమాక్స్‌లోని సన్నివేశాలు మరింత ఆసక్తిగా ఉంటాయని వెల్లడించారు. దీని విడుదల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. 'హరి హర వీరమల్లు' తనకు దేవుడిచ్చిన బహుమానమని అన్నారు.

మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఏఎం రత్నం నిర్మించిన ఈ చిత్రంలో వీరమల్లు అనే పోరాటయోధుడి పాత్రలో పవన్ కనిపించనున్నారు. ఈ మూవీ రెండు భాగాలుగా రానుంది. ధర్మం కోసం యుద్ధం అంటూ 'హరి హర వీరమల్లు: స్వోర్డ్ అండ్ స్పిరిట్' పేరుతో మొదటి భాగం సిద్ధమైంది. ఇటీవల విడుదలైన దీని ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది.

# బాలకృష్ణ - వెంకటేశ్ కలయికలో సినిమా



అగ్ర కథానాయకులు కలిసిమెలిసి నటించేందుకు ముందుకొస్తుండడంతో ఆసక్తికరమైన కలయికల్లో సినిమాలు కుదురుతున్నాయి. గత కొన్నేళ్లుగా మల్టీస్టారర్ సినిమాల జోరు ఊపందుకున్న సంగతి తెలిసిందే. ఆ వరసలో మరో సినిమాకి రంగం సిద్ధమైంది. అగ్ర కథానాయకులు బాలకృష్ణ - వెంకటేశ్ కలయికలో ఓ సినిమా రూపొందబోతోంది. ఈ విషయాన్ని అమెరికాలో జరుగుతున్న 'నాట్స్ 2025' వేడుకలో కథానాయకుడు వెంకటేశ్ స్వయంగా ప్రకటించారు. ఇప్పటికే చిరంజీవి ) కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తోన్న సినిమాలో వెంకటేశ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. త్వరలోనే బాలకృష్ణతో కలిసి కెమెరా ముందుకు వెళ్లనున్నారు. బాలకృష్ణ ప్రస్తుతం 'అఖండ 2' (%ూనెప్త్రుఖఅుఖ% 2) చిత్రంలో నటిస్తున్నారు. ఆ తర్వాత గోపీచంద్ మలినేని దర్శకత్వంలో సినిమా చేయనున్నారు. అందులోనే వెంకటేశ్ కూడా నటించే అవకాశాలున్నాయి.



# కృతి కాదు.. కియారానే?

మరికొద్ది రోజుల్లో 'వార్ 2'తో ప్రేక్షకుల్ని పలకరించడానికి సన్నద్ధమవుతోంది బాలీవుడ్ అందాల తార కియారా అద్వాణీ. ఈ చిత్రంతో పాటు ఈమె ఖాతాలో 'డాన్ 3' కూడా ఉన్న సంగతి తెలిసిందే. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడు. అయితే కొన్ని రోజులుగా కియారా స్థానంలో కృతి సనన్ నటించనున్నట్లు నెట్టింట్లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పుడీ సినిమా గురించి మరో ఆసక్తికర విషయం బయటికొచ్చింది. వచ్చే ఏడాది జనవరిలో చిత్రీకరణ ప్రారంభం కానున్నట్లు సమాచారం. "కొన్ని కారణాల వల్ల ఈ సినిమా షూటింగ్‌కు చాలా ఆలస్యం అయ్యింది. మరోవైపు ఈ సినిమాకు హీరోయిన్‌గా సంతకం చేసిన కియారా గర్భవతి కావడం కూడా మరో కారణం. ఈ పరిస్థితుల దృష్ట్యా చిత్రీకరణను ఆపాల్సి వచ్చింది. ఇప్పుడు 2026లో 'డాన్ 3'ను సెట్స్ పైకి తీసుకెళ్లడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుంది చిత్రబృందం. ఇందులో రణ్‌వీర్ సరసన నటించేది కృతి సనన్ కాదు.. కియారానే" అని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# ఈత రాకున్నా సీన్ కోసం నీళ్లలో దూకేశా




'ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రం 'ఓ భామ అయ్యో రామ' ఇందులో సత్యభామగా నా నటన అందరికీ గుర్తుండిపోతుంది" అంటోంది నటి మాళవిక మనోజ్ ( ఇప్పుడామె.. సుహాస్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని రామ్ గోదల తెరకెక్కించారు. ఇది ఈ నెల 11న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది మాళవిక మనోజ్.

"తమిళ చిత్రం 'జో'లో నా నటన నచ్చి దర్శకుడు రామ్ నన్నీ కథతో సంప్రదించారు. ఈ కథను ఒక్క లైన్‌లో చెప్పడం చాలా కష్టం. దీంట్లో ప్రేమ, వినోదంతో పాటు చాలా కోణాలున్నాయి. స్క్రిప్ట్ విన్నప్పుడు చాలా విభిన్నంగా ఉందనిపించి వెంటనే ఓకే చెప్పేశా. నేనిందులో సత్యభామ అనే మోడ్రన్ అమ్మాయిగా కనిపిస్తాను. ఆ పాత్ర చాలా హైపర్‌గా గడుసుతనంతో ఉంటుంది. ప్రతి నటి కోరుకునే వైవిధ్యభరితమైన పాత్రిది. తప్పకుండా అందరికీ నచ్చుతుంది".

"సత్యభామ పాత్ర నా నిజ జీవితానికి చాలా దూరంగా ఉంటుంది. కానీ, ఆ పాత్రను నా సొంతం చేసుకుని చక్కగా చేశా. తెలుగులో తొలి అడుగులోనే ఇలాంటి సినిమా చేయడం.. ఇంత మంచి నటనా ప్రాధాన్యమున్న పాత్ర పోషించడం అదృష్టంగా భావిస్తున్నా. నాకు స్వతహాగా ఈత రానప్పటికీ ఈ సినిమాలోని ఓ సీన్ కోసం భయపడుతూనే నీళ్లలో దూకి స్విమ్ చేశాను".

"నాకెప్పుడూ వైవిధ్యభరితమైనని, సవాల్ విసిరే పాత్రలు చేయాలని ఉంటుంది. ప్రతి సినిమాలోనూ రొటీన్ పాత్రలే చేస్తే ప్రేక్షకులకే కాదు నాకు బోర్ కొట్టేస్తుంది. నేనిప్పుడు నాకు సౌకర్యవంతంగా అనిపించిన సినిమాలే చేస్తున్నా.

# పిల్లల్లో అధిక బరువుకు కారణమేంటి?



మా బాబుకు పదేండ్లు. ఇంతకుముందు బరువు మామూలుగానే ఉండేవాడు. సంవత్సరం నుంచి ఊహించనంతగా బరువు పెరుగుతున్నాడు. నిరుడు సైకిల్ పైనుంచి పడ్డాడు. తలకు గాయమైంది. వైద్యులను సంప్రదిస్తే మెదడులో రక్తస్రావమైందని చెప్పారు. శస్త్రచికిత్స చేశారు. అప్పట్నుంచి బరువు పెరుగుతున్నాడు. మా బాబుకు ఆటల పట్ల ఆసక్తి లేదు. ఎప్పుడూ ఏదో ఒకటి తింటూ ఉంటాడు. పిల్లల వైద్య నిపుణుడిని సంప్రదిస్తే ప్రవర్తనకు సంబంధించిన సమస్య కాబట్టి చిరుతిళ్లు తగ్గించమని సూచించారు. ఆహారం తగ్గించినా ప్రయోజనం లేదు. కొన్నాళ్లకు అదే తగ్గుతుందిలే అనుకున్నాం. అయితే, మా బిడ్డ బరువు పెరగడానికి హార్మోన్ల సమస్య కారణమేమో అన్న సందేహం కలుగుతున్నది. మా సమస్యకు సరైన పరిష్కారం చూపగలరు.

ఒకే సంవత్సరంలో విపరీతమైన బరువు పెరిగాడని చెప్పారు. కానీ ఎంతన్నది చెప్పలేదు. వాస్తవానికి పిల్లలు ఒక ఏడాది కాలంలో ఒకటీ రెండు కిలోల కన్నా ఎక్కువగా పెరిగే అవకాశం లేదు. మీ బాబు మరీ ఎక్కువగా పెరిగినట్లు మీరు గమనించి ఉంటే, మళ్లీ ఓసారి ఇప్పుడు గ్రోత్ చాట్ సాయంతో అతని బరువుల్ని నమోదు చేయండి. పీడియాట్రిక్ ఎండోక్రైనాలజిస్ట్‌ను సంప్రదించి, ఈ బరువుకు బలమైన కారణం ఏమై ఉంటుందో నిర్ధారణ చేసుకోవాల్సి ఉంది. అలాగే మీ బాబు తలకు దెబ్బ తగిలిందని చెప్పారు.

ఒక్కోసారి తలకు గాయమైతే మెదడులోని గ్రంథులపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. మరో విషయం ఏమిటంటే.. ఈ రోజుల్లో పిల్లల్లో ఊబకాయం, స్థూలకాయం, ఒబేసిటీ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఆరోగ్యకరమైనది కాకుండా ఎక్కువగా కొవ్వులు ఉన్న ఆహారం తీసుకోవడమే ఇందుకు కారణం. టీవీ, ఫోన్, ఇతర గ్యాడ్జెట్స్‌తో గడుపుతుండటమూ కారణమే. శారీరక శ్రమ లేకపోవడం, వ్యాయామం చేయకపోవడం లాంటివి కూడా వింత ఆరోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయి. అయితే మీ బాబుకి హార్మోన్ల లోపం ఉన్నదా.. లేదా? అనేది తెలుసుకునేందుకు కొన్ని పరీక్షలు అవసరం.

మీ బాబు సైక్లింగ్, స్విమ్మింగ్ వంటి ఔట్‌డోర్ గేమ్స్‌లో పాల్గొనేలా చూడండి. కొవ్వు పదార్థాలు లేని ఆహారం ఇవ్వండి. ఇంకో విషయం ఏమిటంటే మీ బాబులో మీరు గమనించిన కొన్ని లక్షణాల గురించి చెప్పలేదు. హుషారుగా ఉంటున్నాడా.. లేదా? మలబద్ధక సమస్య ఏమైనా ఉందా? నిస్సత్తువగా, నిద్రమత్తుగా ఉంటున్నాడా? గమనించండి. ఇలాంటి సమస్యలు ఉన్నట్లయితే థైరాయిడ్ లాంటి హార్మోన్ సమస్య ఉండొచ్చు. ఈ విషయాలన్నీ గ్రహించి, సమస్య పరిష్కారం కోసం పీడియాట్రిషన్‌ను లేదా పీడియాట్రిక్ ఎండోక్రైనాలజిస్ట్‌ను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది.

# మీ జుట్టు తెల్లబడుతుందా..
# అయితే గుండెజబ్బుల ముప్పు ఉన్నట్టే!



జుట్టు తెల్లబడటం ఇప్పుడు సర్వసాధారణం అయిపోయింది. పాతికేండ్లు నిండకుండానే జుట్టు నెరిసిపోవడం కనిపిస్తున్నది. చాలామంది దీన్ని చిన్న విషయంగా పరిగణిస్తుంటారు. దీనిని కాస్మొటిక్ అంశంగా నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరిస్తున్నారు పరిశోధకులు.

జుట్టు నెరవడం హృద్రోగానికి సంకేతమని చెబుతున్నారు. ఈజిప్ట్‌లోని కైరో యూనివర్సిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. అధ్యయనంలో భాగంగా 545 మందిని ఎంపిక చేశారు. వాళ్ల ఆరోగ్యం, జుట్టు రంగు ఆధారంగా పరిశీలించారు. అందరూ ఒకే రకమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

పదేండ్ల పాటు వీళ్లను గమనించగా తెల్లజుట్టు ఉన్నవారిలో ఎక్కువ మందికి అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ ఉన్నట్టు కనుగొన్నారు. జుట్టు నల్లగా ఉన్నవాళ్లలో ఇలాంటి సమస్యలు అరుదుగా కనిపించాయి. తెల్లజుట్టు ఉన్నవాళ్లకు కొలెస్ట్రాల్ పెరగడం వల్ల గుండెజబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కాబట్టి ఇలాంటి వాళ్లు కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకుని ముందుజాగ్రత్త పడాలని సూచిస్తున్నారు.

# చీటికీ మాటికీ వచ్చే కోపం ఎంత
# చేటు చేస్తుందంటే..



'తన కోపమే తన శత్రువు..' అన్నారు పెద్దలు. ఆవేశానికి పోయి అవకాశాలు కోల్పోతే వచ్చిన ప్రమాదమేం లేదు. కానీ, కోపం కారణంగా ఆరోగ్య నష్టం జరుగుతుందనీ, తీవ్రమైన వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందనీ వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్న చిన్న విషయాలకు ఆగ్రహోద్రిక్తులు అవుతున్నారంటే మీ ఆరోగ్యాన్ని చేజేతులా పాడుచేసుకుంటున్నారని గమనించాలి. ఇంతకీ చీటికీ మాటికీ వచ్చే కోపం ఎంత చేటు చేస్తుందంటే

కోపం కారణంగా కడుపులో అల్సర్, గ్యాస్ట్రిక్ సమస్యలు పెరుగుతాయి. కోపంగా ఉన్న సమయంలో మన మెదడులోని రక్తనాళాలు సంకోచిస్తాయి. ఇలాంటి పరిస్థితులలో కోపం ఒక్కొక్కసారి రక్తనాళాలు దెబ్బతినేలా చేస్తుంది. విపరీతమైన కోపం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. దాని కారణంగా అనేక ఇన్ఫెక్షన్లు తలెత్తే ప్రమాదం ఉంది.

అధిక కోపం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. మితిమీరిన కోపం తెచ్చుకోవడం ఒక్కొక్కసారి ప్రాణాంతకంగా మారుతుంది. కోపం వల్ల తలనొప్పి, అధిక రక్తపోటు, నిద్రలేమి సమస్యలు పెరుగుతాయి. మానసిక ప్రశాంతత దెబ్బతింటుంది.

ఒక్కొక్కసారి విపరీతమైన కోపం వల్ల బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం వంటి సమస్యల ముప్పు పెరుగుతుంది. చాలా కోపంగా ఉండే వ్యక్తుల్లో కూడా మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువ. అంతేకాదు చర్మ సంబంధిత సమస్యలు సోరియాసిస్, ఎగ్జిమా వచ్చే అవకాశం ఉంది. అందుకే కోపాన్ని జయించి తన శాంతమే తకు రక్ష సూత్రాన్ని వంటబట్టించుకోవడం అవసరం.

# పంటల సాగులో రసాయనాలు..
# ఆరోగ్యానికి హానికరం



పెరుగుతున్న జనాభాకు తగినంత ఆహారం అందించే క్రమంలో రసాయన ఎరువులు, క్రిమిసంహారకాలు, కలుపు నాశనుల వాడకం పెరిగింది. పంటల దిగుబడులు బాగా పెరిగి ఆహార భద్రత సమకూరినప్పటికీ, ఇలాంటి ఆహారం వల్ల ఎనిమిది రకాలైన ప్రమాదకర రసాయనాలు మన ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వంటలు, కూరగాయలు, పండ్లతోటల్లో తెగుళ్లు, కలుపు మొక్కల నివారణకు మోనోక్రోటోఫాస్, ఆక్సిడెమెటాన్‌మిథైల్, ఏసిఫేట్, ప్రొఫెనోఫాస్, ఎలక్లార్, క్లోరోథాలోనిల్, మిథోమైల్, ట్కగ్లైఫోసేట్ లాంటి క్రిమి సంహారకాలు, శిలీంధ్ర నాశకాలు, కలుపు నాశనులను పిచికారీ చేస్తారు. వీటిలో ఉండే హానికరమైన రసాయనాల వల్ల శ్వాస సమస్యలు, నాడీకణాలు ధ్వంసం కావడం, చర్మ సమస్యలు, జీర్ణవ్యవస్థలో ఇబ్బందులు, క్యాన్సర్ల అభివృద్ధి చెందడంలాంటి విపరిణామాలు సంభవిస్తాయి.

కాబట్టి, మన ఆరోగ్య సంరక్షణ కోసం తినే ఆహార పదార్థాల్లో దాగి ఉన్న ఈ రసాయనాల గురించి తెలుసుకుని ఉండాలి. మార్కెట్‌లో ఆర్గానిక్ ఉత్పత్తులను ఎంచుకోవడం, పండ్లు, కూరగాయలను బాగా కడిగి తినడం, సుస్థిర వ్యవసాయ విధానాలను అనుసరించడం మొదలైన చర్యల ద్వారా హానికరమైన రసాయనాల ప్రభావాన్ని తప్పించుకోవచ్చు.

# తుంటి తెచ్చే తంటాలు తుంటి నొప్పి..





తుంటి నొప్పి ఈ మధ్యకాలంలో చాలా మందిని వేధిస్తున్న సమస్య. గతంతో పోలిస్తే కరోనా వైరస్ వచ్చిపోయిన తరువాత తుంటి నొప్పి బాధితుల సంఖ్య పెరిగిందంటున్నారు వైద్య నిపుణులు. కారణం వైరస్‌కు గురై, కోలుకున్న తరువాత రక్త సరఫరాలో అవరోధాలు ఏర్పడటమే. ఈ విధంగా రక్త ప్రసరణ మందగించడం వల్ల తలెత్తే తుంటి సమస్యను వైద్య పరిభాషలో 'ఎవాస్కులర్ నెక్రోసిస్ ఆఫ్ హిప్ జాయింట్' అంటారు. ఈ వ్యాధి ముందు నుంచే ఉన్నప్పటికీ కరోనాతరువాత బాధితుల సంఖ్య 20 శాతం పెరిగినట్టు చెబుతున్నారు వైద్యులు. ఈవ్యాధి రావడానికి ప్రధాన కారణాలేంటి? దీనివల్ల రోగికి కలిగే ఆరోగ్య సమస్యలు, నిర్ధారించే పద్ధతులు, వ్యాధి లక్షణాలు, చికిత్స తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.

సాధారణంగా శరీరంలోని ఏ అవయవానికైనా పైనుంచి కిందికి రక్త సరఫరా జరుగుతుంది. కానీ తుంటి భాగానికి మాత్రం కింది నుంచి పైకి రక్తం సరఫరా జరుగుతుంది. దీనివల్ల ఇతర భాగాలతో పోలిస్తే తుంటి ఎముకకు రక్తం



సరఫరా మందగించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అంటే తుంటి కీలు హిప్ జాయింట్‌కు రక్త ప్రసరణ అనేది తగ్గిపోతుంది. ఫలితంగా తుంటి కీలులోని ఎముక కణాలు క్రమంగా నశిస్తాయి. ఇవి పూర్తిగా నశిస్తే.. అక్కడున్న ఎముక కుళ్లిపోతుంది. ఇలా ఎముక కుళ్లిపోవడాన్నే వైద్య పరిభాషలో 'ఎవాస్కులర్ నెక్రోసిస్' అంటారు. దీనివల్ల రోగి తీవ్రమైన తుంటి నొప్పితో బాధపడతాడు. ఈ వ్యాధి సాధారణంగా నాలుగు దశల్లో ఉంటుంది.

మొదటి దశలో

%తొలి దశలో ఎముకలోని కణాలు నశించడం ప్రారంభమవుతుంది. దీంతో తుంటి నొప్పి మొదలవుతుంది. ఆరు వారాల్లో నొప్పి తగ్గకపోతే ఎంఆర్‌ఐ చేయించాల్సి ఉంటుంది. ఈ దశలో ఎంఆర్‌ఐ పరీక్షతో వ్యాధిని నిర్ధారించవచ్చు. మొదటి దశలోనే వ్యాధిని గుర్తించడం వల్ల సాధారణ చికిత్సతోనే రోగికి వ్యాధి ముదరకుండా జాగ్రత్త పడవచ్చు.

రెండో దశ

దీనిని ప్రీ కొలాప్స్ దశ అంటారు. ఈ దశలో కార్టిలేజ్‌కు సపోర్ట్‌గా ఉన్న ఎముక 25 శాతం నుంచి 50 శాతం వరకు దెబ్బతింటుంది. రోగిలో లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. రెండో దశలో వ్యాధిని గుర్తిస్తే శస్త్రచికిత్స అవసరం లేకుండానే మాత్రలతో వ్యాధిని నయం చేయవచ్చు. మొదటి రెండు దశల్లో వ్యాధిని గుర్తిస్తే సాధారణ చికిత్స ద్వారా ఎముక కుళ్లిపోవడం (బోన్‌డెత్) నుంచి రోగికి విముక్తి కల్పించవచ్చు.

మూడో దశ

మూడో దశను కొలాప్స్ దశ అనికూడా అంటారు. ఈ దశలో తుంటి కీలులోని ఎముక 50 శాతం నుంచి 75 శాతం వరకు అరిగిపోతుంది. ఈ దశలో రోగి భరించలేని నొప్పితో బాధపడతాడు. లేచి నిలబడలేడు. నడవలేడు. నొప్పి కారణంగా నిద్ర పట్టదు.

నాలుగో దశ

ఈ దశలో తుంటి ఎముక పూర్తిగా దెబ్బతిని, కప్ సైడ్ కూడా అరుగుదల మొదలవుతుంది. నాలుగో దశను ఆర్థరైటిస్ స్టేజ్ అంటారు. ఈ దశలో రోగి తుంటి కీలు ఎముక పూర్తిగా కుళ్లిపోతుంది. దీనివల్ల తుంటి కీళ్లు పనిచేయవు. దీంతో రోగి తీవ్రమైన నొప్పితో బాధపడతాడు. ఒకచోటు నుంచి మరోచోటుకు నడవడం సాధ్యపడదు. ఏదైనా వస్తువును తీసుకోవాలంటే వంగలేని పరిస్థితి. వీల్‌చైర్‌పైనే ఉండాల్సిన దుస్థితి నెలకొంటుంది. మూడు నాలుగు దశల్లో రోగి తుంటి నొప్పి నుంచి కోలుకోవాలంటే శస్త్రచికిత్స ఒక్కటే మార్గం. అంటే తుంటి కీలు మార్పిడి చేయాల్సి వస్తుంది.

తుంటి నుంచి మోకాలి వరకు ఒకే నరం ఉండటం వల్ల కొందరిలో తుంటి నొప్పి ఉండదు. కానీ, మోకాలి నొప్పితోబాధపడతారు.

నిర్ధారణ పద్ధతులు

ఎక్స్‌రే ద్వారా వ్యాధిని గుర్తించవచ్చు. అందులో కనిపించకపోతే ఎంఆర్‌ఐ ద్వారా స్పష్టంగా నిర్ధారించవచ్చు.

ఎంఆర్‌ఐ ద్వారా వ్యాధి ఏ దశలో ఉందో కూడా తెలుసుకోవచ్చు.

జాగ్రత్తలు

తుంటి నొప్పి ఆరువారాలకు మించి ఉంటే వెంటనే ఎముకల వైద్యుణ్ని సంప్రదించడం ఉత్తమం.

మొదటి లేదా రెండో దశలోనే వ్యాధిని గుర్తించడం మంచిది. అంటే స్వల్ప లక్షణాలు కనిపించగానే అప్రమత్తం కావాలి.

కరోనా వైరస్‌కు గురైన వారు నడుము లేదా గజ్జలలో నొప్పి వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

చికిత్సా పద్ధతులు

మొదటి రెండు దశల్లో సాధారణ ఔషధాలతోనే చికిత్స చేయవచ్చు. ముందుగా రోగి ఆరోగ్య చరిత్ర తెలుసుకోవాల్సి ఉంటుంది. అంటే రోగి స్టెరాయిడ్స్ వాడుతున్నాడా లేదా తెలుసుకోవాలి. ఒకవేళ స్టెరాయిడ్స్ వాడుతుంటే వెంటనే వాటిని నిలిపివేయాలి. షుగర్, బీపీ, రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి వాటిని నియంత్రణలోకి తీసుకురావాల్సి ఉంటుంది. ధూమపానం, మద్యపానం అలవాట్లను మాన్పించడం లేదా తగ్గించడం చేయాలి. క్రమం తప్పకుండా ఫిజియో థెరపీ అవసరమవుతుంది. 'బై ఫాస్ఫోనేట్' మాత్రలను మూడు నెలలపాటు వైద్యుల పర్యవేక్షణలో వాడాల్సి ఉంటుంది. వీటితోపాటు కాల్షియం, డి-విటమిన్ కూడా తీసుకోవాలి. ఒకవేళ రెండోదైన ప్రీ కొలాప్స్ స్టేజ్‌లో నొప్పి తీవ్రంగా ఉంటే కోర్ డి-కంప్రెషన్, కోర్ డి-కంప్రెషన్‌తోపాటు ఎముక మూలుగ (బోన్ మ్యారో) చికిత్సకు వెళ్లాలి. అయితే లోకల్ పీఆర్‌పీ ఇంజెక్షన్‌లు ప్రయోగ దశలో ఉన్నాయి. ఇక మూడో దశ అయిన కొలాప్స్ దశ, నాలుగో దశలో ఉన్న రోగులకు మాత్రం పూర్తిగా తుంటి ఎముక మార్చడం ఒక్కటే మార్గం.

వ్యాధికి ప్రధాన కారణాలు

రక్త నాళాల్లో కానీ, రక్త ప్రసరణలో కానీ లేదా రక్తం తయారీలో కానీ అవరోధాలు ఏర్పడటం

దెబ్బలు తగలడం

మద్యపానం

ఎక్కువ మోతాదులోస్టెరాయిడ్స్ వాడటం

ఇతర కొన్ని రకాల ఔషధాలు

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy